సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 201

గురువారం 6-4-2023



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'




'కింగ్స్' మరో పంజా...
రాజస్తాన్ రాయల్స్‌పై 5 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్ గెలుపు - 13లో



నాలుగోరోజూ బుల్ జోరు
సెన్సెక్స్ 582 పాయింట్లు ప్లస్
17,550 స్థాయిపై ముగిసిన నిఫ్టీ -14లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | VIJAYAWADA | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మీడియావన్‌కు ఊరట
మలయాళం వార్తా చానల్ 'మీడియావన్'పై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.
వివరాలు 6లో ▸



బొమ్మైకి నా మద్దతు: సుదీప్
కర్ణాటక సీఎం, బీజేపీ నేత బసవరాజ బొమ్మైకి నటుడు సుదీప్ తన మద్దతు ప్రకటించారు. ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటానన్నారు.
వివరాలు 6లో ▸



బైడెన్ పాలనలో సర్వభ్రష్టం
బైడెన్ చెత్త అధ్యక్షుడని.. అమెరికాను అన్ని రంగాల్లోనూ భ్రష్టు పట్టిస్తూ విఫల రాజ్యంగా మారుస్తున్నారని ట్రంప్ మండిపడ్డారు.
వివరాలు 6లో ▸



దగాకోరు యాప్
చైనాలో జనాదరణ ఉన్న షాపింగ్ యాప్ 'పిండువోడువో' 75 కోట్ల మంది డేటాను సేకరించడం సంచలనం సృష్టిస్తోంది.
వివరాలు 6లో ▸

'చుక్కల' చిక్కుల్లేవ్!

చుక్కల భూములకు శాశ్వత విముక్తి కల్పించిన సీఎం జగన్

- నిషేధిత ఆస్తుల జాబితా నుంచి ఒకేసారి 2.06 లక్షల ఎకరాల తొలగింపు
- '22 ఏ (1) ఇ' నుంచి వాటిని తొలగిస్తూ జిల్లాల వారీగా జీవోలు
- రాష్ట్ర భూముల చరిత్రలో విప్లవాత్మక నిర్ణయం
- చుక్కల భూములపై రెవెన్యూ శాఖ సుమోటో వెరిఫికేషన్
- 1.81 లక్షల సర్వే నెంబర్లలోని 4.06 లక్షల ఎకరాల పరిశీలన
- పక్కా రికార్డులతో 11 ఏళ్ల స్వాధీనంలో ఉన్న వాటికి విముక్తి
- 15 జిల్లాల్లో లక్ష మందికిపైగా రైతుల మానసిక వేదనకు పరిష్కారం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే భూముల సమస్యలపై దృష్టి
- రీ సర్వే నుంచి చుక్కల భూముల దాకా రైతన్నకు మేలు చేసేలా నిర్ణయాలు
- ఈ నెలలో సీఎం జగన్ బహిరంగ సభ నిర్వహణకు కసరత్తు



సాక్షి, అమరావతి: భూముల చరిత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో విప్లవాత్మక ముందడుగు వేసింది. రాష్ట్రంలో దశాబ్దాలుగా స్తంభించిపోయిన చుక్కల భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించింది. ఒకేసారి 15 జిల్లాల్లో 2.06 లక్షల ఎకరాల చుక్కల భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించి రైతన్నలకు ఊరట కల్పించింది. రెవెన్యూ శాఖ నిర్వహించిన సుమోటో వెరిఫికేషన్ ద్వారా రికార్డులన్నింటినీ పూర్తిగా పరిశీలించి చుక్కల నుంచి విముక్తి కల్పించింది. "22 ఏ (1) ఇ" నుంచి
మిగతా 2వ పేజీలో ▶

చుక్కల భూములంటే?
ఆంగ్లేయుల హయాంలో నిర్వహించిన రీ సర్వేలో కొందరు భూ యజమానులు సర్వేకు ముందుకు రాకపోవడం, భూమి ఎవరిదో నిర్ధారించలేకపోవడంతో ఆర్ఎస్ఆర్-1లోని పట్టాదార్ కాలమ్, రిమార్క్స్ కాలమ్‌లో మూడు చుక్కలు పెట్టి వదిలేశారు. శిస్తు కట్ట లేని రైతులు సర్వేకు విముఖత చూపడంతో ఆ భూములు ఎవరివో రికార్డుల్లో నమోదు కాలేదు. ఇక ఆ తర్వాత మళ్లీ సర్వే జరగలేదు. రికార్డులు అలా చుక్కలతోనే ఉండడంతో వాటిని చుక్కల భూములుగా వ్యవహరిస్తున్నారు.

బండి సంజయ్‌కి రిమాండ్..

- తెలంగాణలో పదో తరగతి హిందీ పేపర్ లీక్, కాపీ కుట్ర కేసులో మంగళవారం రాత్రి అరెస్ట్
- బుధవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచిన పోలీసులు
- ఈ నెల 19 వరకు రిమాండ్ విధించిన జడ్జి
- భారీ భద్రత మధ్య కరీంనగర్ జైలుకు తరలింపు
- మరో ముగ్గురు నిందితులు ఖమ్మం జైలుకు..
- ఏ1గా సంజయ్.. మొత్తం 10 మందిపై ఆరోపణలు
- ఈ వ్యవహారంపై పలుచోట్ల బీజేపీ నిరసనలు.. ఈటల సహా పలువురు నేతల అరెస్ట్
- రోజంతా ఉద్రిక్తత, ఉత్కంఠ
- నేడు హైకోర్టులో బీజేపీ లంచ్ మోషన్ పిటిషన్



జైలుకు తరలిస్తుండగా నినాదాలు చేస్తున్న బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్

సాక్షిప్రతినిధి, వరంగల్: పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీక్, కాపీ కుట్ర కేసులో మంగళవారం అరెస్ట్ అయిన బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, మరో ముగ్గురికి హనుమకొండ మొదటి సెషన్స్ జడ్జి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారు. మంగళవారం కమలాపూర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం బయటికి వచ్చిన కేసులో పోలీసులు బండి సంజయ్‌తోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఆయనను అర్ధరాత్రి తర్వాత యాదాద్రి జిల్లా బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు.. బుధవారం ఉదయం అక్కడి నుంచి బయలుదేరి జనగామ జిల్లా పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో హనుమకొండలోని నాలుగో మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి రాపోలు అనిత ఎదుట హాజరు పర్చారు. తన అరెస్టు సందర్భంగా పోలీసులు దురుసుగా వ్యవహరించారని, తనకు గాయాలు అయ్యాయని జడ్జికి సంజయ్ విన్నవించారు. దానిపై స్పందించిన న్యాయమూర్తి.. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్..
మిగతా 2వ పేజీలో ▶


న్యూస్‌రీల్

ఉత్సాహంగా 'ఆసరా' సంబరాలు



రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోన్న వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పొదుపు సంఘాల మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 12 రోజులుగా 587 మండలాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు.
వివరాలు 3 ▸

175 స్థానాల్లో పోటీచేస్తామని నీకెందుకు చెప్పాలి?



'రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ పోటీచేస్తామని నీకెందుకు చెప్పాలి. పులివెందులతో సహా 175 స్థానాల్లోనూ ఓడిస్తాం. టీడీపీని లేకుండా చేయడం జగన్ వల్లే కాదు. ఆయన్ని పుట్టించిన దేవుడి వల్ల కూడా కాదు' అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు.
వివరాలు 10 ▸

'మార్గదర్శి' కేసులో ఏ-2 శైలజ విచారణ నేడు



మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి శైలజ కిరణ్‌ను సీఐడీ అధికారులు గురువారం విచారించనున్నారు. ఇప్పటికే ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఏ-1గా ఉన్న రామోజీరావును సీఐడీ అధికారులు విచారించగా.. నిధుల మళ్లింపు వాస్తవమేనని ఆయన అంగీకరించారు.
వివరాలు 3 ▸

నేటి నుంచి జేఈఈ మెయిన్ సెకండ్ సెషన్ పరీక్షలు

- హాజరుకానున్న 9.4 లక్షల మంది విద్యార్థులు.. నేడు, 8, 10, 11, 12, 13, 15 తేదీల్లో పరీక్షలు
- రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచులుగా నిర్వహణ
- దేశంలో 330 పట్టణాల్లో, ఏపీలో 25 పట్టణాల్లో పరీక్ష కేంద్రాలు
- ఏపీ నుంచి 1.5 లక్షల మంది వరకు అభ్యర్థులు



సాక్షి, అమరావతి: ఐఐటీ, ఎన్ఐటీ, తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్ సెకండ్ సెషన్ పరీక్షలు గురువారం (నేడు) ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా 9.4 లక్షల మంది హాజరయ్యే అవకాశముంది. ఏపీ నుంచి 1.5 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. దేశంలోని 330 పట్టణాలు, విదేశాల్లోని 15 పట్టణాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏపీలోని 25 పట్టణాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. ఇవి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు. ఈ పరీక్షలు గురువారంతో పాటు 8, 10, 11, 12, 13, 15 తేదీల్లో జరుగుతాయి. ఇంతకు ముందు షెడ్యూల్‌లో 6 వ తేదీ నుంచి 12వ తేదీ వరకు
మిగతా 2వ పేజీలో ▶

'డాక్టర్' గారు వచ్చేశారు!

నేటి నుంచి పూర్తి స్థాయిలో 'ఫ్యామిలీ డాక్టర్'

- పల్నాడు జిల్లా లింగంగుంట్లలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సంరక్షణే లక్ష్యం
- గ్రామాలను సందర్శించనున్న పీహెచ్‌సీ వైద్యులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఊరిలోనే గడిపి వైద్య సేవలు
- ట్రయల్ రన్ విజయవంతం.. 69.64 లక్షల మందికి గ్రామంలోనే వైద్యం



సాక్షి, అమరావతి: ప్రజలు, ప్రభుత్వ వైద్యుల మధ్య అనుబంధాన్ని బలపరచడం ద్వారా మెరుగైన వైద్య సంరక్షణపై సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రామీణ ప్రజలు చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతిష్టాత్మక 'ఫ్యామిలీ డాక్టర్' విధానానికి
మిగతా 2వ పేజీలో ▶

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

- జనరల్ ఔట్ పేషెంట్ సేవలు
- బీపీ, షుగర్, ఊబకాయం లాంటి జీవనశైలి జబ్బుల కేసుల ఫాలోఅప్
- గర్భిణులకు యాంటీనేటల్ చెకప్స్, బాలింతలకు పోస్ట్‌నేటల్ చెకప్స్, ప్రసవానంతర సమస్యల ముందస్తు గుర్తింపు. చిన్నపిల్లలో పుట్టుకతో వచ్చిన లోపాల గుర్తింపు.
- రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్స జరిగిన రోగులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితమైన వారికి, వృద్ధులకు ఇంటి వద్దే వైద్యం.
- పాలియేటివ్ కేర్.. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ నిర్ధారణ

ఇదండీ సంగతి




వావ్!.. పరోక్షంగా అల్లర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారుగా..!



వైభవంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం 6లో

పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పద్మ భూషణ్‌ను త్రిదండి చినజీయర్‌స్వామి, పద్మశ్రీని సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి అందుకున్నారు.

'ముంచు'కొస్తున్న సముద్రం



నాసా ఇటీవల విడుదల చేసిన సముద్ర జలాల చిత్రమిది. (ఎరుపు రంగులో ఉన్నది సముద్ర మట్టం సాధారణం కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాలు)

ప్రపంచ వ్యాప్తంగా కాలుష్యం కారణంగా వేగంగా కరిగిపోతున్న మంచు

- 2021-22లో 0.27 సెం.మీ పెరిగిన సముద్ర నీటి మట్టం
- 2050 నాటికి పెరుగుదల 17.82 సెం.మీకు చేరుతుందని 'నాసా' అంచనా.. ప్రపంచ ప్రఖ్యాత తీర ప్రాంత నగరాలకు ముప్పు
- వేగంగా విస్తరిస్తున్న ఎల్‌నినోతో ప్రమాదమంటున్న శాస్త్రవేత్తలు
- నాసా తాజా అధ్యయనంలో వెల్లడి 3లో

టీడీపీని కలుపుకుందామని బీజేపీని కోరాం



టీడీపీని కూడా పొత్తులో కలుపుకుపోదామని బీజేపీ పెద్దలను కోరినట్లు జనసేన నేత నాదెండ్ల మనోహర్ పరోక్షంగా వెల్లడించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదన్న తమ నిర్ణయాన్ని వివరించామన్నారు. 10లో

అభ్యర్థులు లేక పొత్తులకు వెంపర్లాట



టీడీపీ, జనసేన పార్టీలకు 175 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేరని.. అందుకే పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని మంత్రి ఆదిమూలపు సురేశ్ విమర్శించారు. 10లో

మా పొత్తు జనసేనతో మాత్రమే



బీజేపీ, జనసేన కలిసే ఉన్నాయని.. రెండూ కలిసే ముందు కెళ్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు స్పష్టం చేశారు. 10లో

పేదల ఇల్లు.. నాణ్యత వర్ధిల్లు

- పేదల ఇళ్ల నిర్మాణ నాణ్యతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ
- కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన సంస్థతో థర్డ్ పార్టీ ఆడిట్
- సొంతంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసి నాణ్యత పరీక్షల నిర్వహణ
- ల్యాబ్‌ల ద్వారా ఆడిట్ చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ
- 6 నెలల్లో 3,131 శాంపిళ్లకు పరీక్షలు
- నాణ్యత పరీక్షల్లో 97% మంచి ఫలితాలే



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా 'నవరత్నాలు -పేదలందరికీ ఇళ్లు' పథకం కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతపై గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వమే ప్రత్యేకంగా మెటీరియల్ క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. వీటిద్వారా ఇంటి నిర్మాణానికి వినియోగించే ఇసుక, సిమెంట్, ఇనుము, కంకర, కాంక్రీట్, ఇతర సామగ్రి నాణ్యతను పరీక్షిస్తున్నారు. పథకం కింద రెండు దశల్లో ప్రభుత్వం 21.25 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వీటిలో 2.62 లక్షల టిడ్కో, 18.63 లక్షలకు పైగా సాధారణ ఇళ్లు ఉన్నాయి. సాధారణ ఇళ్ల లబ్ధిదారుల్లో 3.27 లక్షల మంది ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చే ఆప్షన్-3ని ఎంచుకున్నారు. దీంతో లబ్ధిదారులను గ్రూపులుగా విభజించి నిర్మాణదారులను ఎంపిక చేసి ప్రభుత్వమే ఈ ఇళ్లను నిర్మిస్తోంది.

36 ల్యాబ్‌లు ఏర్పాటు: రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల్లోనే 36 మెటీరియల్ క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్ ల్యాబ్‌లను గృహ నిర్మాణ శాఖ ఏర్పాటు చేసింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.75.60 లక్షలు వెచ్చించింది. గత ఏడాది అక్టోబర్ నుంచి మార్చి నెలాఖరు నాటికి నిర్మాణాలకు వినియోగించే సామగ్రి నుంచి 3,131 నమూనాలను వీటిలో పరీక్షించారు. 97 శాతం అంటే.. 3,066 నమూనాలు నాణ్యత పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చాయి. కేవలం మూడు శాతం అంటే 65 నమూనాల్లో లోటుపాట్లు కనిపించాయి. దీంతో వాటిని సరిదిద్దుకోడానికి ఇంజనీర్‌లు సలహాలు, సూచనలు జారీ చేశారు. ఓ వైపు లేఅవుట్‌లలోనే క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌ల ద్వారా నిర్మాణాల్లో నాణ్యతపై పర్యవేక్షణ చేపడుతూనే.. మరోవైపు భారత ప్రభుత్వ సంస్థ అయిన వ్యాప్‌కోస్ ద్వారా థర్డ్ పార్టీ పర్యవేక్షణ చేపడుతున్నారు. ఈ సంస్థ ప్రతినిధులు మొబైల్ టెస్టింగ్ యూనిట్ వ్యాన్ల ద్వారా లేఅవుట్‌లను సందర్శించి తనిఖీలు నిర్వహించి నిర్మాణ మెటీరియల్, నిర్మాణాల్లో నాణ్యత నిర్ధారణకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీ షా మాట్లాడుతూ 'పేదల ఇళ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీ పడొద్దని సీఎం జగన్ ఆదేశించారు. ఆ మేరకు 36 ల్యాబ్‌లు ఏర్పాటు చేసి నాణ్యత పరీక్షలు చేస్తున్నాం' అని చెప్పారు.

సామాజికన్యాయ ఉద్యమకారుడు బాబూ జగ్జీవన్‌రామ్

- గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్



సాక్షి, అమరావతి: సామాజిక న్యాయ ఉద్యమకారుడు బాబూ జగ్జీవన్ రామ్ అని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటంతో పాటు అనంతరం గొప్ప పార్లమెంటేరియన్‌గా, ప్రజాస్వామ్యవాదిగా బాబూ జగ్జీవన్ రామ్ నిరుపమాన సేవలు అందించారన్నారు. పేదల అభ్యున్నతికి కృషి చేసిన ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్‌కు సీఎం వైఎస్ జగన్ నివాళులు



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నమస్కరిస్తున్న సీఎం జగన్

సాక్షి,అమరావతి: స్వాతంత్ర్యోద్యమ నేత, సంస్కరణవాది బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం వైఎస్ జగన్ నివాళులర్పించారు. తాడేపల్లిలోని సీఎం నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సీఎం పూలమాల వేశారు. ఆయన సేవలను సీఎం స్మరించుకున్నారు. మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్. జవహర్ రెడ్డి, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

మంగళగిరి ఎయిమ్స్‌కు ప్రధాని ప్రశంస

సాక్షి, అమరావతి: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) మంగళగిరిలో 10 లక్షల ఔట్ పేషెంట్ (ఓపీ) సంప్రదింపులు పూర్తయిన క్రమంలో ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది సంస్థ సాధించిన విజయంగా ప్రశంసిస్తూ మోదీ బుధవారం ట్వీట్ చేశారు. కాగా, 2019లో మంగళగిరి ఎయిమ్స్‌లో ఓపీ సేవలను ప్రారంభించారు. ఈ క్రమంలో ఇటీవల ఓపీ సేవలు 10 లక్షల మైలురాయిని దాటాయి.

తెలంగాణ

దాతలు భరోసా కల్పిస్తున్నారు

- 'సాక్షి'కి ధన్యవాదాలు: 'బలగం' మొగిలయ్య, కొమురమ్మ దంపతులు

ఆత్మకూరు(ఎం): అనారోగ్యంతో తాము పడుతున్న ఇబ్బందుల గురించి ప్రత్యేక కథనం రాసి, దాతలు ముందుకొచ్చేలా చేసి సాక్షి తమకు భరోసా కల్పించిందని మొగిలయ్య, కొమురమ్మ దంపతులు అన్నారు. అందుకు వారు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు. బలగం సినిమా క్లైమాక్స్ సన్నివేశంలో పాట పాడిన మొగిలయ్య, కొమురమ్మ దంపతులు ప్రేక్షకులను కంటతడి పెట్టించినది తెలిసిందే. అయితే బలగం సినిమాలో పాట పాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని, ఇందుకు అవకాశం కల్పించిన డైరెక్టర్ వేణుకు రుణపడి ఉంటామని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి బుధవారం వచ్చిన వారు 'సాక్షి'తో మాట్లాడారు.



తిరుపతి జిల్లా నెలబల్లిరెట్టపల్లిలో కన్నా కృష్ణయ్యకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ బాలిపాక వాణి

పింఛన్ పంపిణీ 94.57% పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 94.57 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. బుధవారం కూడా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. ప్రభుత్వం ఈ నెలకుగాను 63,42,805 మంది అవ్వాతాతలు, వితంతు,దివ్యాంగ, పలు చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,747.88 కోట్లు పింఛన్ల రూపంలో విడుదల చేయగా.. బుధవారం సాయంత్రం వరకు 59,98,267 మంది లబ్ధిదారులకు రూ.1,652.65 కోట్లను అందజేసినట్లు సెర్ప్ అధికారులు తెలిపారు. మిగిలిన వారి కోసం మరో 3 రోజుల పాటు వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్ల వద్ద పంపిణీ కొనసాగనుంది.



గుంటూరుకు చెందిన పఠాన్ హసిని ప్రియకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రవికృష్ణ



ఒంగోలు నగరంలోని భాగ్యనగర్‌లో కొన్నిపాటి సావిత్రమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రావణి



ఏలూరులోని తంగెళ్లమూడిలో గద్దెల పైడమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్

'డాక్టర్' గారు వచ్చేశారు!

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. గత ఏడాది అక్టోబర్ 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మొదలైన ట్రయల్ రన్ విజయవంతం కావడంతో పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ఫ్యామిలీ డాక్టర్ విధానం పూర్తి స్థాయిలో అమలు కార్యక్రమం గురువారం ప్రారంభం కానుంది.

ఏమిటీ విధానం?

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న కుటుంబాలు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా తమ కుటుంబ వైద్యుడిని సంప్రదిస్తున్నారు. వారి ఆరోగ్యం పట్ల సంబంధిత వైద్యుడు నిరంతరం ఫాలోఅప్‌లో ఉంటారు. ఆయా కుటుంబాల్లోని వ్యక్తుల ఆరోగ్యంపై డాక్టర్‌కు సమగ్ర అవగాహన ఉంటుంది. ఒక అనుబంధం ఏర్పడి ఆ కుటుంబానికి మెరుగైన వైద్య సంరక్షణ అందుతుంది. ఇదే తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ ఉచితంగా అందించాలన్నది ఫ్యామిలీ డాక్టర్ విధానం లక్ష్యం.

ఇలా నిర్వహిస్తున్నారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది కలిపి 14 మంది ఉండేలా చర్యలు తీసుకుంది. పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యులకు ఆ పరిధిలోని గ్రామ సచివాలయాలను కేటాయించారు. వైద్యులు వాటిని నెలలో రెండు సార్లు సందర్శించాల్సి ఉంటుంది. 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)తో పాటు గ్రామానికి వెళ్లి రోజంతా అక్కడే గడిపి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ 104 ఎంఎంయూ వద్ద ఓపీ సేవలు అందిస్తారు. మంచానికి పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన రోగుల గృహాలను మధ్యాహ్నం నుంచి సందర్శించి ఇంటి వద్దే సేవలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు.

కొత్తగా 260 ఎంఎంయూ వాహనాలు

పీహెచ్‌సీ వైద్యులు తమకు కేటాయించిన గ్రామాలకు షెడ్యూల్ ప్రకారం 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ)లో వెళతారు. రాష్ట్ర ప్రభుత్వం 2020లో మండలానికి ఒక 104 ఎంఎంయూను సమకూర్చి సేవలను బలోపేతం చేసింది. అయితే ప్రతి గ్రామాన్ని నెలలో రెండు సార్లు సందర్శించాల్సి ఉన్నందున ఇప్పటికే ఉన్న 676 ఎంఎంయూ వాహనాలకు అదనంగా కొత్తగా 260 వాహనాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది.

నాలుగేళ్లలో 48,639 వైద్య పోస్టుల భర్తీ

ఫ్యామిలీ డాక్టర్ విధానం సమర్థంగా అమలయ్యేందుకు ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులతోపాటు మండలానికి రెండు పీహెచ్‌సీలు లేదా ఒక పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న 1,142 పీహెచ్‌సీలకు అదనంగా 151 పీహెచ్‌సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఎవరైనా వైద్యుడు సెలవుపై వెళితే ఫ్యామిలీ డాక్టర్ సేవలకు అంతరాయం కలగకుండా అదనపు డాక్టర్లను అందుబాటులో ఉంచారు. ఏడు పీహెచ్‌సీలకు ఒకరు, జిల్లాకు నలుగురు చొప్పున 285 మంది అదనపు వైద్యులను సమకూర్చారు. ఇలా ఫ్యామిలీ డాక్టర్ పథకం కోసం కొత్తగా వైద్య పోస్టులు సృష్టించడంతోపాటు అప్పటికే ఉన్న ఖాళీలను భర్తీ చేసి మొత్తంగా 2,875 మంది డాక్టర్లను అందుబాటులో ఉంచారు. వైద్య శాఖలో ఒక్క పోస్టు కూడా ఖాళీగా మిగలకుండా గత నాలుగేళ్లలో 48,639 మంది వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది.

వైద్యులకు ఫోన్లు

వైద్యులు గ్రామాలను సందర్శించని రోజుల్లో ప్రజలకు ఏవైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పీహెచ్‌సీ వైద్యుడికి మొబైల్ ఫోన్‌ను సమకూర్చింది. రాష్ట్రవ్యాప్తంగా 1,142 పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు సుమారు రూ.3 కోట్లతో ఫోన్లను అందజేశారు. వైద్యుడు మారినా ఫోన్ నంబర్ మారకుండా శాశ్వత నంబర్ కేటాయించారు.



14 రకాల పరీక్షలు.. 105 రకాల మందులు

గ్రామీణ స్థాయిలో వైద్య వసతులను బలోపేతం చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి 2,500 మంది జనాభాకు ఒకటి చొప్పున 10,032 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో), ఏఎన్‌ఎం, నలుగురు నుంచి ఆరుగురు ఆశా వర్కర్లు వీటిల్లో ఉంటారు. ప్రతి క్లినిక్‌లో 105 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉంటాయి. టెలిమెడిసన్ కన్సల్టేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో విలేజ్ క్లినిక్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. గ్రామాలకు వెళ్లిన వైద్యులు వీటిలో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఎవరైనా రోగికైనా మెరుగైన వైద్యం అవసరం అని భావిస్తే ఫ్యామిలీ డాక్టర్ అక్కడి నుంచే పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తారు. రోగిని దగ్గరలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి తరలించడం, వైద్యం అందేలా చూడటం లాంటి కార్యకలాపాలను సీహెచ్‌వో, ఏఎన్‌ఎం పర్యవేక్షిస్తారు. వీరు విలేజ్ ఆరోగ్యమిత్రగా వ్యవహరిస్తారు.

బండి సంజయ్‌కి రిమాండ్

▶ మొదటి పేజీ తరువాయి

కమలాపూర్ సీఐ సంజీవ్‌లను పిలిపించుకుని విచారించారు. అనంతరం పోలీసుల రిమాండ్ రిపోర్టును అంగీకరించారు. బండి సంజయ్‌తోపాటు బూర ప్రశాంత్ (మాజీ జర్నలిస్టు), గుండెబోయిన మహేశ్ (కేఎంసీలో ల్యాబ్ అసిస్టెంట్), మౌటం శివగణేశ్ (డ్రైవర్)లకు 14 రోజులు రిమాండ్ విధించారు. అయితే బండి సంజయ్‌కు ప్రాణహాని ఉందని, ఆహారంలో విష ప్రయోగం చేసి చంపే అవకాశం ఉందని న్యాయవాదులు కోర్టులో ఆందోళన వ్యక్తం చేశారు. దీనితో సంజయ్‌కు ఇచ్చే ఆహారాన్ని పరీక్షించాకే అందజేయాలని జడ్జి ఆదేశించారు. వరంగల్ కోర్టు పరిధిలోని నిందితులను రిమాండ్ నిమిత్తం ఖమ్మం జైలుకు తరలించారు. సంజయ్ తరపు న్యాయవాదుల అభ్యర్థన మేరకు ఆయన్ను కరీంనగర్ జైలుకు తరలించారు. కాగా, తన భర్త బండి సంజయ్‌ను పోలీసులు దౌర్జన్యంగా తీసుకెళ్లారని ఆయన సతీమణి అపర్ణ బుధవారం మీడియాకు తెలిపారు. మందులు కూడా వేసుకోనివ్వలేదని చెప్పారు.

బీజేపీ జాతీయ నాయకత్వం సీరియస్

సంజయ్‌ను అరెస్టు చేసి, వేధింపులకు గురిచేయడాన్ని బీజేపీ జాతీయ నాయకత్వం సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఫోన్ చేసిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్రంలో తాజా పరిస్థితిని వివరించినట్లు సమాచారం. సంజయ్ అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని, ఏయే కేసులు పెట్టారనే విషయాలను తెలియజేసినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ కూడా రాష్ట్ర పార్టీ నేతలను ఆరా తీశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ సంజయ్ అరెస్టును తీవ్రంగా ఖండించారు. సంజయ్ అరెస్టు వ్యవహారంపై నేడు బీజేపీ లీగల్ సెల్ విభాగం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేయనుంది.



బండి సంజయ్‌ని తీసుకెళుతున్న కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న బీజేపీ శ్రేణులపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు

నిందితులపై పెట్టిన సెక్షన్లు ఇవీ..

- బండి సంజయ్, ఇతర నిందితులపై కమలాపూర్ పోలీసులు 4ఏ, 6 రెడ్‌విత్ 8 ఆఫ్ తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్–1997; సెక్షన్ 66డి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)యాక్ట్‌లతోపాటు ఐపీసీ సెక్షన్లు 120బీ, 420, 447, 505 కింద కేసు నమోదు చేశారు.
- ఇందులో ప్రధాన నిందితుడి (ఏ1)గా బండి సంజయ్‌ను, ఏ2గా ప్రశాంత్, ఏ3గా మహేశ్, ఏ4గా మైనర్ బాలుడు, ఏ5గా మౌటం శివగణేశ్, ఏ6గా పోగు సుభాష్, ఏ7గా పోగు శశాంక్, ఏ8గా దూలం శ్రీకాంత్, ఏ9గా పెరుమాండ్ల క్రామిక్, ఏ10గా పోతబోయిన వర్షిత్ పేర్లను చేర్చారు.
- మొత్తం పది మందిపై కేసు నమోదు చేయగా.. మొదట నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

రోజంతా ఉద్రిక్తత..ఉత్కంఠ

మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌లో బండి సంజయ్ అరెస్టుతో మొదలైన ఉత్కంఠ బుధవారం రోజంతా కొనసాగింది. సంజయ్ అరెస్టుపై బీజేపీ ఎమ్మెల్యేలు, నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మండల, జిల్లా కేంద్రాల్లో నిరసనలకు బీజేపీ పిలుపునిచ్చింది. దీంతో పలు జిల్లాల్లో నాయకులు, కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. పోలీసులు వీరిని అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో తోపులాట, వాగ్వివాదాలతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలోనే ఎమ్మెల్యేలు రఘునందన్‌రావు, రాజాసింగ్, ఈటల రాజేందర్‌లను ఇతర నేతలను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి సంజయ్‌ను పోలీసులు జైలుకు తరలించే వరకు ఉద్రిక్తత, ఉత్కంఠ కొనసాగింది.

'చుక్కల' చిక్కుల్లేవ్!

▶ మొదటి పేజీ తరువాయి

తొలగిస్తూ ఇప్పటికే 10 జిల్లాలకు సంబంధించిన జీవోలు జారీ కాగా మిగతావి త్వరలో వెలువడనున్నాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 43 వేల ఎకరాల చుక్కల భూములకు విముక్తి లభించింది. ఈ భూములను రైతులు ఇక స్వేచ్ఛగా అమ్ముకోవచ్చు. వాటిపై రుణాలు పొందేందుకు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. లక్ష మందికి పైగా రైతు కుటుంబాల్లో మానసిక వేదనను తొలగిస్తూ చుక్కల భూములకు విముక్తి కల్పించిన నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో ఈ నెలలో భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

భూముల సమస్యలపై స్పెషల్ ఫోకస్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీర్ఘకాలంగా పేరుకుపోయిన భూముల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చేయని విధంగా అన్ని భూములను రీ సర్వే చేస్తోంది. షరతుల గల పట్టా భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించడంతో కృష్ణా జిల్లా అవనిగడ్డలో 18 వేల ఎకరాలకు సంబంధించి రైతులకు మేలు జరిగింది. అనాదీనం, ఖాళీ కాలమ్ భూముల సమస్యను పరిష్కరించేందుకు చట్టాన్ని మార్చింది. కృష్ణా, గోదావరి డెల్టాలోని లంక భూములకు డి పట్టాలిచ్చేందుకు నిబంధనలను సవరించింది. అదే క్రమంలో చుక్కల భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తోంది. నిషేధిత ఆస్తుల జాబితాలోని 22 ఏ (1) ఇ నుంచి చుక్కల భూములను తొలగించింది. నిబంధనలకు అనుగుణంగా ఆ భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించాలని తొలుత కలెక్టర్లను ఆదేశించినా వివాదాలు, దళారుల కారణంగా అడుగు ముందుకు పడకపోవడంతో సీఎం సూచనలతో ప్రభుత్వం స్వయంగా రంగంలోకి దిగింది.

1.81 లక్షల సర్వే నెంబర్ల రీ–వెరిఫికేషన్

సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్రంలో చుక్కల భూములన్నింటినీ సుమోటోగా రీ వెరిఫికేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు 2022 ఆగస్టు 22, 25వ తేదీల్లో జిల్లా కలెక్టర్లకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ రెండు సర్క్యులర్లు జారీ చేశారు. చుక్కల భూములు కాకపోయినప్పటికీ 1908 రిజిస్ట్రేషన్ల చట్టం సెక్షన్ 22–ఏ (1)ఇ కింద నమోదు చేసిన భూములతోపాటు అసలు నిషేధిత జాబితాలో చేర్చకూడని వాటిని 22 ఏలో పొందుపరచిన కేసులపై ఒక నిర్ణయానికి రావాలని ఆదేశించారు. దీని ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా చుక్కల భూముల పేరుతో ఉన్న 4.06 లక్షల ఎకరాలను రెవెన్యూ యంత్రాంగం సుమోటోగా రీ వెరిఫికేషన్ చేసింది. ఆర్డీవోలు, తహశీల్దార్లు 1.81 లక్షల సర్వే నెంబర్లలోని 4.06 లక్షలపైగా ఎకరాలకు సంబంధించిన భూములను రీ వెరిఫికేషన్ చేశారు. రైతుల వద్ద ఉన్న డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డులు, రెవెన్యూ శాఖ నిర్వహించే 10 (1) అకౌంట్, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ భూములకు సంబంధించి ఏవైనా కోర్టు ఉత్తర్వులుంటే వాటిని కూడా పరిగణలోకి తీసుకున్నారు. 2017లో చుక్కల భూముల చట్టం వచ్చే నాటికి ఆ భూమి 11 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ కాలం సంబంధిత రైతు ఆధీనంలో ఉందో లేదో పరిశీలించారు. ఆర్ఎస్ఆర్ (రీ–సెటిల్మెంట్ రిజిష్టర్)లోని 16వ కాలమ్‌లో చుక్కల భూమిగా నిర్దేశించే కాలమ్‌ను పరిశీలించారు. వీటి ప్రకారం రికార్డుల్లో పేరు ఉన్నట్లు ధృవీకరించుకోవడంతోపాటు 11 ఏళ్లుగా సంబంధిత రైతు ఆధీనంలో భూమి ఉంటే 22 (ఏ)1 ఇ నుంచి తొలగించారు. అలాగే చుక్కల భూముల కేటగిరీ కిందకు రావని గుర్తించిన భూములను నిబంధనల ప్రకారం ఏ కేటగిరీలో చేర్చాలో అందులో (22ఏ (1) చేర్చారు.

రైతులకు సర్వ హక్కులు

నిషేధిత జాబితాలో ఉండడంతో ఈ భూముల రిజిస్ట్రేషన్లను ఇన్నాళ్లూ నిలిపివేశారు. పంట రుణాలు కూడా రావడంలేదు. తమ సమస్యను పరిష్కరించాలని రైతులు అధికారుల చుట్టూ తిరగడమే కానీ ఇన్నాళ్లూ ప్రయోజనం లేకుండా పోయింది. ఈ సమస్యలన్నింటికీ తెర దించుతూ చుక్కల భూముల సమస్యకు సీఎం వైఎస్ జగన్ ముగింపు పలికారు. రాష్ట్ర చరిత్రలో లక్షల ఎకరాల భూములకు విముక్తి కల్పించడం ఇదే తొలిసారి. ప్రణాళిక ప్రకారం చుక్కల భూముల సమస్యను పరిష్కరించి వాటికి విముక్తి కలిగించి లక్షల మంది రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. దీనిద్వారా సంబంధిత రైతులకు తమ భూములపై సర్వ హక్కులు లభిస్తాయి.

15 ఏళ్ల అవస్థలు తీరాయి..

గ్రామంలో పూర్వీకులు నుంచి వచ్చిన 2.50 ఎకరాలు భూమిని 15 ఏళ్ల క్రితం రెడ్ మార్క్‌లో పెట్టారు. తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అడిగితే చుక్కల భూమిగా నమోదైందని చెప్పారు. అప్పటి నుంచి పొలం అమ్ముకోవాలంటే రిజిస్టర్ కాకపోవడంతో ఎంతో ఇబ్బంది పడుతున్నా. సమస్య పరిష్కరించాలని చాలాసార్లు అధికారులకు అర్జీలిచ్చినా స్పందన లేదు. సీఎం జగన్ ప్రభుత్వం మా సమస్యను ఇంత సులభంగా పరిష్కరిస్తుందని అనుకోలేదు. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– జానపాటి అవులయ్య, వేములకోట, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..

18 ఏళ్ల క్రితం సర్వే నెంబర్ 432–3, 4లో 2.30 ఎకరాల భూమి కొన్నాం. అప్పటి నుంచి అందులో సాగు చేసుకుంటున్నాం. 2015లో ఆ భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకుంటే చుక్కల భూమిగా నమోదైందని చెప్పారు. దీంతో విక్రయించేందుకు, బ్యాంకు రుణం పొందేందుకు వీలు లేకుండా పోయింది. ఎన్నోసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. ఇన్నాళ్లకు మా భూమిని చుక్కల నుంచి తప్పించినట్లు చెప్పారు. మేం కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించారు. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

– నల్లగొర్ల మస్తానయ్య, మహిమలూరు, ఆత్మకూరు మండలం, నెల్లూరు జిల్లా

రీ-వెరిఫికేషన్‌లో ముఖ్యాంశాలు

- 22 ఏ (1)ఇ కేటగిరీలోని సర్వే నెంబర్లు - 1.81 లక్షలు
- ఈ సర్వే నెంబర్లలోని భూమి విస్తీర్ణం - 4.06 లక్షల ఎకరాలు
- 22-ఎ (1) ఇ నుంచి తొలగించిన భూమి - 2.06 లక్షల ఎకరాలు
- 22-ఎ (1) ఏ లో ఉంచిన భూమి - 1.12 లక్షల ఎకరాలు
- 22-ఎ (1) బి లో ఉంచిన భూమి - 48 వేల ఎకరాలు
- 22-ఎ (1) సి లో ఉంచిన భూమి - 4,474 ఎకరాలు
- 22-ఎ (1) డి లో ఉంచిన భూమి - 266 ఎకరాలు
- 22-ఎ (1) ఇ లో ఉంచిన భూమి - 36 వేల ఎకరాలు

22 ఏలో ఎన్ని రకాలంటే?

- 22 ఏ (1) ఏ - అసైన్డ్ భూములు
- 22 ఏ (1) బి - ప్రభుత్వానికి చెందిన పోరంబోకు భూములు
- 22 ఏ (1) సి - దేవాదాయ, వక్ఫ్ భూములు
- 22 ఏ (1) డి - మిగులు భూములు, సీలింగ్ భూములు
- 22 ఏ (1) ఇ - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆసక్తి ఉన్న భూములు, చుక్కల భూములు

జిల్లాల వారీగా తొలగించిన చుక్కల భూములు

జిల్లా	సర్వే నెంబర్లు	విస్తీర్ణం (ఎకరాల్లో)
నెల్లూరు	23,023	43,270
ప్రకాశం	10,324	37,615
వైఎస్సార్	17,553	31,399
అన్నమయ్య	12,643	28,882
పల్నాడు	5,654	25,277
సత్యసాయి	8,250	22,010
బాపట్ల	3,672	7,917
తిరుపతి	5,876	7,831
నంద్యాల	166	651
గుంటూరు	169	601
కర్నూలు	118	339
అనంతపురం	52	269
చిత్తూరు	54	95
కోనసీమ	5	8.15
పార్వతీపురం మన్యం	1	0.18

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో బుధవారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	41.9	20.2
కర్నూలు	41.5	26.7
రెంటచింతల	41.4	26.3
రాజమహేంద్రవరం	39.5	25.5
మార్కాపురం	39.0	26.0
నంద్యాల	39.0	25.0
కడప	38.2	26.2
భీమవరం	37.0	24.0
నెల్లూరు	36.6	26.7
ఏలూరు	36.0	26.0
విజయవాడ	36.0	26.0
శ్రీకాకుళం	36.0	25.0
విశాఖపట్నం	35.4	26.0
మచిలీపట్నం	33.0	27.0
తెలంగాణ		
ఆదిలాబాద్	39.8	22.2
నిజామాబాద్	39.1	24.8
హైదరాబాద్	36.2	24.7

తెలంగాణలో 8న ప్రధాని మోదీ పర్యటన

సాక్షి, న్యూఢిల్లీ/యాదాద్రి: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన ఖరారైంది. ఈ నెల 8న రాష్ట్రంలో ప్రధాని పాల్గొనే కార్యక్రమాల వివరాలను పీఎంవో బుధవారం వెల్లడించింది. శుక్రవారం ఉదయం 11.45 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకోనున్న మోదీ.. సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. 12.15 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. బీబీ నగర్ ఎయిమ్స్‌లో పలు అభివృద్ధి పనులను ఇక్కడి నుంచే వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో ఐదు జాతీయ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడంతో పాటు రైల్వేకు సంబంధించిన ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్ సెకండ్ సెషన్ పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి


పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నప్పటికీ, అభ్యర్థుల సంఖ్య పెరగడంతో 13, 15 తేదీల్లో కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పరీక్ష నిర్వహిస్తోంది. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లుగా పరీక్ష జరుగుతుంది. జేఈఈ మెయిన్ తొలి సెషన్‌కు 8.2 లక్షల మంది హాజరు కాగా, ఈసారి ఈ సంఖ్య పెరుగుతోంది, అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి అడ్మిట్ కార్డు కాపీలతో పాటు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డును కూడా తీసుకురావాలని ఎన్‌టీఏ సూచించింది.

నిఘా కన్ను.. ఉంటేనే దన్ను!

సీసీ టీవీ కెమెరాలు కోరుకునే వారే ఎక్కువ

స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2023 నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సీసీ టీవీ కెమెరాలు..ఏ మూల ఏం జరిగినా పట్టిచూపే నిఘానేత్రాలు. అందుకే భద్రత దృష్ట్యా సీసీటీవీ కెమెరాలకు ఆదరణ పెరుగుతోంది. నేర నియంత్రణతో పాటు, నేరాల పరిశోధనలోనూ ఇవే పోలీసులకు అస్త్రాలుగా మారుతున్నాయి. దుకాణాలు, హోటల్స్, ఇతర వ్యాపార ప్రాంతాల్లోనూ యజమానులు ఉద్యోగుల పనితీరును గమనించేందుకు, వినియోగదారుల్లో ఎవరైనా తేడాగా ఉంటే అలాంటి వారిపై నిఘా పెట్టేందుకు సైతం వీటిని వాడుతున్నారు. అలాంటి సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ప్రజల్లో ఎలాంటి అవగాహన ఉంది? సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై పలు వర్గాల్లో ఎలాంటి అభిప్రాయాలున్నాయన్న వివరాలను బీపీఆర్‌ఎండీ (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) ఇటీవల స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2023 పేరిట నివేదికను విడుదల చేసింది. బీదల బస్తీల మొదలు సంపన్న వర్గాల నివాస ప్రాంతాల వరకు అన్ని ప్రాంతాల వారు సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు జై కొట్టారు.



అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'


కర్నూలు నగరం వెంకటరమణ కాలనీలో పొదుపు సంఘాల మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం బీఆర్ తాళ్లవలసలో డ్వాక్రా మహిళలకు చెక్కు ఇస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో సీఎం జగన్ చిత్రపటంతో ఎమ్మెల్సీ దువ్వాడ, డ్వాక్రా సంఘాల మహిళలు


నెల్లూరులో లబ్ధిదారులకు చెక్కును ఇస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు


చిత్తూరు జిల్లా పుంగనూరులో డ్వాక్రా సంఘాల మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జేసీ వెంకటేశ్వర్లు


తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో ఆసరా లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


పల్నాడు జిల్లా మాచర్లలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


అన్నమయ్య జిల్లా రామాపురంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

క్లుప్తంగా...

ఉత్సాహంగా 'ఆసరా' సంబరాలు

సాక్షి, అమరావతి: 12 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతోన్న వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పొదుపు సంఘాల మహిళలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఏప్రిల్ 5 వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ...మధ్యలో ఒక రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం 'కార్యక్రమంపై సీఎం అధ్యక్షతన జరిగిన సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిన రావడంతో ఆ రోజున ఎటువంటి కార్యక్రమాలు జరగలేదు. దీంతో పలువురు ఎమ్మెల్యేల నుంచి అందిన ప్రతిపాదన మేరకు గురువారం (6వ తేదీ) కూడా ఈ కార్యక్రమాలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, 12 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 587 మండలాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం కొనసాగింది. పలు చోట్ల పొదుపు సంఘాల మహిళలు సీఎం జగన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

'మార్గదర్శి' కేసులో ఏ-2 శైలజ విచారణ నేడు

హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో విచారించనున్న సీఐడీ

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమ వ్యవహారాల కేసులో ఏ-2గా ఉన్న ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చెరుకూరి శైలజ కిరణ్‌ను సీఐడీ అధికారులు గురువారం విచారించనున్నారు. కేంద్ర చిట్‌ఫండ్ చట్టం-1982కు విరుద్ధంగా చందాదారుల సొమ్మును మ్యూచువల్‌ఫండ్స్, షేర్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టడం, రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్ల సేకరణపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో ఏ-3గా ఉన్న కొందరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను సీఐడీ విభాగం అరెస్ట్ చేసింది. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఏ-1గా ఉన్న చెరుకూరి రామోజీరావును సీఐడీ అధికారులు సోమవారం విచారించారు. నిధుల మళ్లింపు వాస్తవమేనని ఆయన అంగీకరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పైగా అది తమ సంస్థ ఇష్టమని.. అసలు విచారించడానికి సీఐడీకి ఏం అధికారం ఉందన్న రీతిలో రామోజీరావు ప్రవర్తించడం అందర్నీ విస్మయపరచింది. కానీ సీఐడీ అధికారులు నిబంధనల మేరకు ఆయనను విచారించి కీలక విషయాలు రాబట్టారు. ఏ-1గా ఉన్న రామోజీరావే నిధుల మళ్లింపు నిజమేనని దాదాపుగా అంగీకరించడంతో ఈ కేసులో సీఐడీ కీలక పురోగతి సాధించినట్లయింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసులో ఏ-2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్‌ను గురువారం విచారించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. శైలజను హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని ఆమె నివాసంలోనే విచారించనున్నారు. రామోజీరావు, శైలజ స్టేట్‌మెంట్లను విశ్లేషించిన అనంతరం ఈ కేసులో తదుపరి చర్యలకు ఉపక్రమించాలని సీఐడీ భావిస్తోంది. వారిద్దరినీ ఆంధ్రప్రదేశ్‌కు పిలిపించి మరీ విచారించేందుకు సీఐడీ సంసిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

'మార్గదర్శి'లో పూచీదారులకు తీవ్ర వేధింపులు

సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త రామఅప్పారావు

అగనంపూడి(గాజువాక): మార్గదర్శి చిట్ ఫండ్ కంపెనీలో చిట్‌దారుల కంటే పూచీ ఉన్న వారిపైనే కంపెనీ దాడులు చేస్తూ వేధిస్తోందని సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామఅప్పారావు ఆరోపించారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిట్టీ మొత్తం చెల్లించడానికి ఉద్యోగుల పూచీకత్తు తీసుకోవడం.. రెండు వాయిదాలు చెల్లించకపోయినా చిట్టీదారులపై కాకుండా పూచీదారులకు నోటీసులు పంపడం, వారిని కోర్టులకు లాగి మానసికంగా వేధించడం మార్గదర్శి చిట్ కంపెనీకి అలవాటని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌లో పూచీదారులుగా ఉన్న వేలాది మంది నుంచి న్యాయస్థానాల ద్వారా కోట్లాది రూపాయలు వసూలు చేసి ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటికి ఇప్పటికైనా ఫుల్‌స్టాప్ పెట్టేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్షీర విప్లవం వెల్లువెత్తేలా..!

'జగనన్న పాల వెల్లువ' కోసం జిల్లాకో కమాండ్ కంట్రోల్ సెంటర్

ప్రతి జిల్లాకు ఓ టోల్ ఫ్రీ నంబర్

పాల సేకరణలో ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ



సాక్షి, అమరావతి: జగనన్న పాలవెల్లువ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకం కింద ప్రస్తుతం 1,515 ఆర్బీకేల పరిధిలో 2.60 లక్షల మంది మహిళా రైతులు నమోదు కాగా.. 65 వేల మంది నుంచి ప్రతిరోజు 1.75 లక్షల లీటర్ల పాలను అమూల్ సంస్థ ద్వారా అత్యధిక ధర చెల్లించి సేకరిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 5,388 ఆర్బీకేల పరిధిలో కనీసం 4.58 లక్షల మంది రైతుల నుంచి ప్రతిరోజూ 6 లక్షల లీటర్లు, 2024 మార్చి నాటికి 8,021 ఆర్బీకేల పరిధిలో 6 లక్షల మంది రైతుల నుంచి 9 లక్షల లీటర్లను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

నిత్యం 30 మందితో మాట్లాడేలా..

పాల సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు జిల్లాకో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కంట్రోల్ సెంటర్ పని చేస్తాయి. డీఆర్‌డీఏ, పశుసంవర్థక, సహకార శాఖల నుంచి ఇద్దరేసి చొప్పున మొత్తం ఆరుగురు సిబ్బంది షిఫ్టుల వారీగా ఈ సెంటర్‌లో సేవలందిస్తున్నారు. ఇందుకోసం ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ కేటాయించారు. ప్రతిరోజు కనీసం 30 మంది మహిళా పాడి రైతు సంఘాల కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ సెంటర్ల సిబ్బంది మాట్లాడతారు. పాలుపోసే మహిళా పాడిరైతులతోపాటు రూట్ ఆఫీసర్స్, అమూల్ టీమ్‌కు జిల్లాస్థాయిలో ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తారు. పాల సేకరణ, ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ శాతం గుర్తింపు, సకాలంలో డబ్బులు జమ వంటి విషయాల్లో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను తెలుసుకుని సత్వర పరిష్కారానికి కృషి చేస్తారు.

సేకరణ తగ్గితే రంగంలోకి ప్రత్యేక టీమ్‌లు

ఏ గ్రామంలో అయినా పాల సేకరణ తగ్గినట్టుగా గుర్తిస్తే వెంటనే అందుకు గల కారణాలను విశ్లేషించి పెరిగేందుకు తీసుకోవల్సిన చర్యలపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు ప్రత్యేక టీమ్‌లను పంపించే ఏర్పాటును కమాండ్ కంట్రోల్ సెంటర్లు చేస్తాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుతో పాటు బీఎంసీయూ, ఏఎంసీయూ భవనాల నిర్మాణాల పురోగతి, పాడి రైతులకు బ్యాంక్ లింకేజీను కలెక్టర్లు పర్యవేక్షిస్తుంటారు. ఇందుకోసం ఎంపీడీఓ, తహసీల్దార్ నేతృత్వంలో మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు సొసైటీల రిజిస్ట్రేషన్లు, పాల సేకరణకు చెల్లించే హ్యాండ్లింగ్, నిర్వహణ చార్జీలు ఎప్పటికప్పుడు జమయ్యేలా చూస్తాయి. రైతుల్లో చైతన్యం తీసుకు వచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తాయి.

అన్ని గ్రామాలకు విస్తరిస్తాం

జగనన్న పాల వెల్లువ పథకాన్ని దశల వారీగా అన్ని ఆర్బీకేలకు, అన్ని గ్రామాలకు విస్తరించడంతో పాటు సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. 2024 మార్చి కల్లా పాడి సంపద ఉన్న ప్రతి ఆర్బీకే పరిధిలో పాల సేకరణ ప్రారంభించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం.

– అహ్మద్ బాబు, ఎండీ, డెయిరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్

'ముంచు'కొస్తున్న సముద్రం



సాక్షి, అమరావతి: సముద్ర నీటిమట్టాలు ఎటా పెరుగుతున్నాయని నాసా తాజాగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 2021–22లో 0.27 సెం.మీ మేర పెరిగిన సముద్రజలాలు తీరంలో అలజడిని సృష్టించాయని పేర్కొంది. సముద్రజలాలు కొద్దిగా పెరిగినా తీరం వెంబడి ఆవాసాలు ఏర్పరుచుకున్న వారికి ఆందోళన కలిగిస్తుందని వెల్లడించింది. ఉపగ్రహాల ద్వారా సముద్రజలాలపై నాసా చేసిన అధ్యయన నివేదికను ఇటీవల వెల్లడించడంతోపాటు గత 30 సంవత్సరాల సముద్ర మట్టాలను విశ్లేషించింది. 1993 నుంచి ఇప్పటివరకు సముద్ర జలాల మట్టం 9.1 సెం.మీ పెరిగిందని పేర్కొంది. గతేడాదిలో 0.27 సెం.మీ పెరిగిన సముద్ర జలాలు ఇకపై ఏడాదికి సగటున 0.66 సెం.మీ చొప్పున పెరిగి 2050 నాటికి మొత్తం 17.82 సెం.మీకు చేరుతుందని వెల్లడించింది. సముద్రాలపై 'ఎల్‌నినో' తీవ్రప్రభావం చూపడం, వాతావరణ మార్పులతో ఇలాంటి పరిస్థితి తలెత్తుతోందని, పెరుగుతున్న గ్రీన్‌హౌస్ వాయువులు, వాయుకాలుష్యం వంటివాటిని తగ్గించుకోకపోతే తీరప్రాంతాల్లో నివసించే ప్రజలకు కష్టాలు తప్పవని హెచ్చరించింది. సముద్ర నీటిమట్టం పెరుగుదలను పరిశీలించేందుకు అమెరికా–ఫ్రెంచ్ ప్రభుత్వాలు సంయుక్తంగా 1993లో 'టోపెక్స్ మిషన్'ను చేపట్టాయి. ప్రత్యేక రాడార్లతో సముద్ర ఉపరితలంపైకి మైక్రోవేవ్ తరంగాలని పంపించి కచ్చితమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు.

వేగంగా కరుగుతున్న అంటార్కిటిక్ మంచు


వాతావరణ మార్పులకు, సముద్ర మట్టం పెరుగుదలకు మానవ తప్పిదాలే ప్రధాన కారణమని నాసా విశ్లేషించింది. పరిమితికి మించిన కాలుష్యకారక వాయువుల కారణంగా వాతావరణంలో వేడి పెరిగి మంచు ప్రాంతాలు కరిగిపోయి హిమనీ నదాల్లో నీరు పెరుగుతోందని గుర్తించింది. వేసవి ఉష్ణోగ్రతలకు 2022లో అంటార్కిటిక్ ఖండంలోని మంచు పలకలు సాధారణ సగటు కంటే ఎక్కువగా కరిగిపోయినట్టు పేర్కొంది. దీనికి గ్రీన్‌ల్యాండ్ ఐస్ ప్యాక్ కరిగి అదనపు నీరు తోడవడంతో సముద్ర మట్టాలు వేగంగా పెరిగినట్లు ప్రకటించింది.

అర మీటర్ మునిగింది..

గతేడాది పెరిగిన సముద్ర జలాలతో మియామి, న్యూయార్క్, బ్యాంకాక్, షాంఘై, లిమా (పెరూ), కేప్‌టౌన్‌తో పాటు అనేక తీర ప్రాంతాలు అర మీటర్ మేర నీటమునిగినట్టు నాసా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ పెరుగుదల కష్టాలను కనీసం 800 మిలియన్ల మంది ఎదుర్కొంటారని వాతావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా దేశస్తుల్లో సగం మందికి పైగా తీరప్రాంతాల్లోనే ఉన్నారు. ప్రధాన సీపోర్టులు, వినోద ప్రాంతాలు, ఇతర సౌకర్యాలు తీరంలోనే ఉన్నాయి. సముద్ర మట్టం పెరిగితే వీటిపై తీవ్రంగా ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. ఈ ముంపు ప్రభావం అడవులు, వన్యప్రాణుల పైన కూడా పడుతుందని హెచ్చరిస్తున్నారు. నాసా వెల్లడించిన అంశాలు వాతావరణాన్ని ఏ స్థాయిలో కలుషితం చేస్తున్నామో.. గ్రీన్‌హౌస్ వాయువులను ఏస్థాయిలో విడుదల చేస్తున్నామో హెచ్చరికగా పేర్కొన్నారు. నాసా లెక్కల ప్రకారం 2050 నాటికి సముద్ర మట్టం 17.82 సెం.మీ పెరిగితే.. 300 నుంచి 500 మీటర్ల మేర తీర ప్రాంతం సముద్ర గర్భంలో కలిసిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జయంతి


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని శాసనమండలిలో వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి మాట్లాడుతూ.. రక్షణ శాఖ మంత్రిగా ఆయన చూపిన తెగువ మరువలేనిదన్నారు. 14 శాఖలకు కేంద్ర మంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని చెప్పారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో సీఎం జగన్ రాష్ట్రంలో ఎన్నో సంస్కరణలు చేపట్టారని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ.. బలహీనవర్గాలకు అంబేడ్కర్ హక్కులు ఇస్తే.. వాటిని పక్కాగా అమలు చేసిన గొప్ప వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. మండలిలో విప్ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి విశేష సేవలందించిన మహానుభావుడు జగ్జీవన్‌రామ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ నందిగం సురేశ్, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ శేషగిరిరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, నాయకులు మేడపాటి వెంకట్, అంకంరెడ్డి నారాయణమూర్తి, రాజశేఖర్ పాల్గొన్నారు.

సర్కారు వైద్యం సూపర్

- ఏపీలో పూర్తి స్థాయిలో డాక్టర్లు, నర్సులు, మౌలిక వసతులు
- గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అదనంగా వైద్య సిబ్బంది
- నూరు శాతం పీహెచ్‌సీలకు విద్యుత్, నీరు, రోడ్లు, టెలిఫోన్, కంప్యూటర్
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ హెల్త్‌సెంటర్లలో వైద్య సదుపాయాలతో పాటు మౌలిక వసతులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. అవసరానికి మించి వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. 2021–22లో దేశవ్యాప్తంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు, పీహెచ్‌సీల్లో మౌలిక వసతులపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నివేదిక విడుదల చేసింది. సీఎం జగన్ అధికారంలోకి రాగానే నాడు – నేడు ద్వారా అన్ని స్థాయిల్లో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలతో పాటు వేల సంఖ్యలో వైద్య సిబ్బంది నియామకాలను చేపట్టిన విషయం తెలిసిందే. ప్రధానంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నివేదికలో ప్రతిబింబించాయి.

గిరిజన ప్రాంతాల్లో అదనంగా వైద్యులు

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో 111 పీహెచ్‌సీలు అవసరం కాగా 158 అందుబాటులో ఉన్నాయి. 158 మంది డాక్టర్లు అవసరం కాగా 221 మంది ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో 745 సబ్ హెల్త్ సెంటర్లు అవసరం కాగా 955 సెంటర్లు సేవలందిస్తుండటం గమనార్హం. వీటిల్లో 955 మంది హెల్త్ వర్కర్లు అవసరం కాగా 1,406 మంది సేవలందిస్తున్నారు.

రెట్టింపు సంఖ్యలో డాక్టర్లు

ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో 1,142 పీహెచ్‌సీల్లో 1,142 మంది డాక్టర్లు అవసరం కాగా దాదాపు రెట్టింపు సంఖ్యలో 2,048 మంది వైద్యులు సేవలందిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. గ్రామీణ పీహెచ్‌సీల్లో 1,142 మంది నర్సింగ్ సిబ్బంది అవసరం కాగా 2,870 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో మహిళా ఏఎన్ఎంలు 12,215 మంది అవసరం కాగా 14,009 మంది సేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో 2,115 మంది నర్సింగ్ సిబ్బంది అవసరం కాగా 3,949 మందిని నియమించారు. సబ్ జిల్లా, డివిజన్ ఆస్పత్రుల్లో 3,036 డాక్టర్ పోస్టులు మంజూరు చేయగా 3,130 మంది విధుల్లో ఉన్నారు. ఫార్మా, మెడికల్ సిబ్బంది పోస్టులు 4743 మంజూరు చేయగా 5,454 మంది పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని 1,142 పీహెచ్‌సీలకు నూటికి నూరు శాతం విద్యుత్, నీటి సౌకర్యం ఉంది. నూటికి నూరు శాతం రోడ్లు, టెలిఫోన్, కంప్యూటర్ సౌకర్యం కూడా కల్పించారు. వంద శాతం సబ్ హెల్త్ సెంటర్లకు నీటి సరఫరాతో పాటు విద్యుత్ సౌకర్యం ఉంది. నూరు శాతం పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పురుషులు, స్త్రీలకు వేర్వేరు టాయిలెట్లు ఉన్నాయి.

నచ్చిన ఉద్యోగాలే చేసుకోండి!

- యువత నిర్ణయాలకే మెజార్టీ తల్లిదండ్రుల మద్దతు
- ఇండియా కన్జ్యూమర్ సెంటిమెంట్ ఇండెక్స్ సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: భారతదేశంలో ఉద్యోగ, ఉపాధి విషయాల్లో యువత నిర్ణయాలకే అధిక శాతం తల్లిదండ్రులు మద్దతు తెలుపుతున్నట్టు ఇండియా కన్జ్యూమర్ సెంటిమెంట్ ఇండెక్స్ (సీఎస్ఐ) సర్వే స్పష్టం చేస్తోంది. విద్యతో సంబంధం లేకుండా తమ పిల్లలు భవిష్యత్తు కోసం ఎటువైపు వెళ్తితే.. అటువైపే తమ ప్రోత్సాహం ఉంటుందని మెజార్టీ తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. గతంతో పోలిస్తే ఇప్పుడు దేశంలో ఉద్యోగ అవకాశాలు భారీగా పెరగడంతో పాటు యువత ఓవర్‌టైం డ్యూటీలు కూడా చేస్తున్నట్టు సర్వే పేర్కొంది. ఇందులో మహిళల్లో సుమారు 53 శాతం మంది ఉద్యోగ అవకాశాలపై సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేసినట్టు వివరించింది. ఈ క్రమంలోనే కొంత మంది తల్లిదండ్రులు సైతం తమ పిల్లల భవిష్యత్తుపై ప్రణాళికలు వేసుకుంటున్నట్టు గుర్తించింది. 25 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు దేశంలోని అత్యున్నత ప్రభుత్వ కొలువులో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపింది. 16 శాతం మంది వైద్య వృత్తిలోకి వెళ్లాలని, 10 శాతం మంది మాత్రమే ఇంజినీరింగ్, కంప్యూటర్ అప్లికేషన్, ఐటీ రంగాల వైపు ప్రోత్సహిస్తున్నట్టు వివరించింది. దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కంప్యూటర్-ఎయిడెడ్ టెలిఫోనిక్ ఇంటర్వ్యూల ద్వారా సుమారు 10 వేల మంది నుంచి ప్రతిస్పందనలు స్వీకరించింది. ఇందులో 66 మంది గ్రామీణ ప్రాంతం వారు కాగా, 34 శాతం మంది పట్టణ ప్రజలు ఉన్నారు.



అగౌరవంతో లేదా ఇతరులకు హాని చేయడంతో
ముడిపడిన తృప్తి అది కోరుకునేవాడికి కారాగారమే.

– జరాతుస్త్ర

సాక్షి

గురువారం, ఏప్రిల్, 6

ఏ దేవుడూ హర్షించడు!

ఉత్సాహంగా జరుపుకోవాల్సిన సందర్భం ఉద్రిక్తతలకు దారి తీస్తే? ఎవరూ హర్షించరు. కానీ, ఇలాంటి పరిణామాలు ఎక్కువవుతున్నాయి. మార్చి 30న శ్రీరామనవమి సందర్భంగా గత వారం రోజుల్లో వివిధ రాష్ట్రాల్లో తలెత్తిన ఘర్షణలే అందుకు సాక్ష్యం. భక్తిశ్రద్ధలతో జరగాల్సిన పండుగ, శాంతియుతంగా సాగాల్సిన శోభాయాత్రలు కొన్నేళ్ళుగా శత్రుత్వానికీ, అరెస్టులకూ, అభాగ్యుల మరణాలకూ దారితీయడం శోచనీయం. ఈసారీ బీహార్, బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, ఢిల్లీల్లో రెండు మతాల ఘర్షణగా నవమి ఉత్సవం మారిపోయింది. అటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో, ఇటు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లోనూ హింసాకాండ చెలరేగింది. ప్రధానంగా ప్రతిపక్షాల హయాంలోని పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో భారీ విధ్వంసం రేగిన తీరు ఆందోళనకరం. నిరుటి లాగే ఈసారీ రాళ్ళు రువ్వడం, నినాదాలు చేయడం, గృహదహనాలు, లూటీలు! సోకాల్డ్ భక్తుల చేతుల్లో కత్తులు, తుపాకీలు. వెరసి, పవిత్ర రామనవమి, రంజాన్ మాసం కలిసొచ్చే సమయం దేశంలో కొత్త తరహా హింసాత్మక ధోరణికి అనువైన సందర్భంగా మారిపోవడం ఓ విషాదం.

బెంగాల్‌లో హౌరా జిల్లాలో వరుసగా రెండురోజులు, సోమవారం రాత్రి హుగ్లీ దగ్గర రిష్రాలో మరోసారి ఘర్షణలు రేగాయి. ఇంటర్నెట్ సేవలు నిలిపివేసి, నిషేధాజ్ఞలు విధించిన పరిస్థితి. బీహార్‌లో సాసారామ్, నలందా జిల్లాల్లో హింసకు పలువురు గాయపడ్డారు. నలందా వద్ద 110 ఏళ్ళ చరిత్ర కలిగిన మదరసాలో వేలకొద్దీ అరుదైన పుస్తకాలకు నిలయమైన గ్రంథాలయం దుండగుల చేతిలో బూడిదైన ఘటన కదిలించేస్తుంది. రెచ్చగొట్టే ధోరణి వల్ల సామరస్యం దెబ్బతింటుందే తప్ప సమాజానికి మేలు చేకూరదు. ఇప్పుడు జరుగుతున్నదదే. వార్తల్ని గమనిస్తే – మథురలో జామా మసీదు పక్కనే కాషాయ జెండాలు కట్టారు. మరో రాష్ట్రంలో మసీదులో ప్రార్థనల వేళ పెద్దగా నినాదాలు చేస్తూ, లౌడ్ స్పీకర్లు హోరెత్తించారు. బెంగాల్‌లో అనుమతించిన మార్గంలో కాక రెండు వర్గాలూ ఉండే సున్నితమైన ప్రాంతం మీదుగా కత్తులతో ఊరేగింపు జరిపారు. నిరుటి ఉద్రిక్తతల రీత్యా ఢిల్లీలో ఓ పార్కులో నవమి యాత్ర, నమాజు – రెంటినీ పోలీసులు నిషేధించారు. అయినా కొన్ని మతవాద సంస్థలు అక్కడే యాత్ర, పూజ చేయడాన్ని ఏమనాలి? అదే సమయంలో రెండు చేతులూ కలవనిదే చప్పుడు రాదంటూ రెండోవర్గపు తప్పులు చెబుతున్నవారినీ కొట్టిపారేయలేం.

ఈ హింసాకాండ రాజకీయ నిందలకు దారి తీస్తోంది. ఈ ఘర్షణలకు తమ పాలనలోని లోపాలు, ఉదాసీనతలు కారణమని అంగీకరించడానికి మమత, బీహార్ సీఎం నితీశ్ కుమార్ సహజంగానే సిద్ధంగా లేరు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన గూండాలతో బీజేపీ ఈ ఘర్షణలకు పాల్పడుతోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపణ. బెంగాల్ పోలీసులు ఒక వర్గానికే కొమ్ముకాస్తూ, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని బెంగాల్ బీజేపీ ఛీఫ్ నింద. ఇక, ఆ రాష్ట్ర గవర్నర్ సైతం బాధితప్రాంతాల్లో పర్యటించి గట్టిగానే గళం విప్పారు. ఘర్షణలపై కేంద్ర హోమ్‌శాఖ నివేదిక కోరే పరిస్థితి వచ్చింది. శ్రీరామనవమి ఘర్షణలతో గురువారం నాటి హనుమాన్ జయంతికి అప్రమత్తత అవసరమైంది. ఈసారి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జాగరూకతతో వ్యవహరించాల్సిందిగా వివిధ రాష్ట్రాలకు హోమ్ శాఖ బుధవారం సలహా ఇవ్వాల్సి వచ్చింది. కలకత్తా హైకోర్ట్ ఆదేశంతో హనుమాన్ జయంతికి బెంగాల్ సర్కార్ 3 జిల్లాల్లో పారా మిలటరీ దళాలను బరిలోకి దింపాల్సొచ్చింది. ఈ ఘటనలన్నీ ధార్మిక ఉత్సవాలు అతి సున్నితంగా మారిన పరిస్థితులకు దర్పణం.

నిజానికి, ఇలాంటివన్నీ నివారించదగ్గ విపరిణామాలు. ధార్మిక ఉత్సవాలు భారత సమాజంలో ఒక అంతర్భాగం. కానీ, వాటిని ఆసరాగా చేసుకొని, వివిధ మతాల మధ్య విషబీజాలను నాటాలనీ, రాజకీయ లబ్ధి పొందాలనీ చూస్తే అంతకన్నా నేరం, ఘోరం ఉండవు. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ప్రజలు స్వేచ్ఛగా తమ మత విశ్వాసాలను అనుసరించేలా రక్షణ కల్పించాలి. వారి ధార్మిక యాత్రలకు భద్రతనివ్వాలి. అది ఆ యా ప్రభుత్వాల, అధికార యంత్రాంగాల బాధ్యత. అదే సమయంలో రెచ్చగొట్టే చర్యలు, నినాదాలు, పుకార్ల ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. లక్ష్మణరేఖ దాటిన దోషులపై కఠినంగా వ్యవహరించాలి. ప్రతి ఎన్నికలో అధికారపీఠంపై పార్టీలు మారవచ్చేమో కానీ, మారకుండా ప్రజాసేవలోనే ఉండేది పోలీసు యంత్రాంగం. కాబట్టి, రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించాలి. ఎప్పటికప్పుడు ఏర్పాట్లలో లోపాలను సవరించాలి. విభిన్న వర్గాల మధ్య అపనమ్మకం పెంచే దుశ్చర్యలకు అడ్డుకట్ట వేయాలి.

కలసిమెలసి బతకాల్సిన సమాజంలో విషబీజాలను విత్తితే అది యావత్ దేశానికే నష్టం. రాజకీయ లబ్ధి కోసం అంగలారుస్తున్నవారు అది గ్రహించాలి. మరో ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున మతాల మధ్య చిచ్చుపెట్టి, ఓటర్లను వర్గాలుగా చీల్చాలనే ప్రయత్నాలు పెరిగితే ఆశ్చర్యం లేదు. ఇలాంటి నీచ రాజకీయ వ్యూహాల ఉచ్చులో పడకుండా, జనం అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ వర్గాలు, చట్టాన్ని అమలు చేసే సంస్థలు రాజ్యాంగ విహితంగా వ్యవహరిస్తూ, మారణకాండకూ, మనుషుల్లో చీలికకూ చెక్ పెట్టాలి. ఒక్కమాటలో – సహనం, శాంతి, క్షమ పాటించిన ఆ రాముడైనా, అల్లా అయినా పొరుగువాడిని ద్వేషించమనలేదు. తమ ధర్మం గొప్పదని చాటుకోవడానికి పరధర్మాన్ని తక్కువ చేయమని ఏ సమాజమూ, ఏ దేవుడూ చెప్పలేదు. అంతర్యామి సైతం హర్షించని ఘర్షణలతో మానవతా ధర్మాన్ని సైతం మర్చిపోతే, ఆ పాపానికి ప్రాయశ్చిత్తం ఏ ధర్మంలోనూ లేదు. పాపఫలం మాత్రం ఇక్కడే, ఇప్పుడే మనమందరం అనుభవించాల్సి వస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.9.53 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** హస్త ప.12.37 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.8.55 నుండి 10.34 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.01 నుండి 10.49 వరకు తదుపరి ప.2.54 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.17 నుండి 7.58 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా...

సందర్భం



విడదల రజిని

కార్పొరేట్‌ల దోపిడీకి గురవుతూ... ప్రభుత్వాసుపత్రుల్లో కనీస వైద్య సదుపాయాలకు నోచుకోలేక అల్లాడుతున్న జనాన్ని ఆదుకోవడానికి వైఎస్సార్ 'ఆరోగ్యశ్రీ' ప్రవేశపెట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్య రంగాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుండడంతో ఆయా రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకపక్క కార్పొరేట్ వైద్యం పొందడానికి పేదవారికి అవకాశం కల్పిస్తూనే... మరోవైపు ప్రభుత్వాసుపత్రులను ఆధునికీకరించడం, కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం వంటి చర్యల ద్వారా ప్రభుత్వం వైద్య శాఖను పటిష్ఠం చేస్తోంది. విలేజ్ క్లినిక్, 'ఫ్యామిలీ డాక్టర్'ల ద్వారా వైద్యాన్ని మరింతగా పేదవాడి ముంగిటికి తీసుకు వచ్చేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి.

ఒక కుటుంబ ఆరోగ్యం బాగుంటే... సమాజ ఆరోగ్యమూ బాగుంటుంది. సమాజం బాగుంటే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయి. ఆ ఆలోచనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యసాధన వైపు పరుగులు పెట్టిస్తోంది.

నాకు వైద్య ఆరోగ్య శాఖ అప్పగించడం ఆయన నాపై పెట్టుకున్న నమ్మకానికి నిదర్శనంగా భావిస్తాను. ఊరూరికీ, ఇంటింటికీ వైద్య ఆరోగ్య సేవలు ఉచితంగా... నాణ్యంగా అందాలన్న ఒక గొప్ప లక్ష్యంతో 'ఫ్యామిలీ డాక్టర్' పథకాన్ని ముఖ్యమంత్రి ఈ రోజు (ఏప్రిల్ 6) పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆవిష్కరిస్తున్నారు. ఆ నియోజక వర్గానికి ఎమ్మెల్యేగా ఉన్న నాకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పదవిని ఇవ్వడమే ఒక గొప్ప వరం అనుకుంటే... ఈ రోజు ఈ పథకాన్ని చిలకలూరిపేట నుంచి సీఎం ఆవిష్కరించడం మరో గొప్ప అనుభూతిగా భావిస్తున్నాను. ఫ్యామిలీ డాక్టర్ పథకం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మానసపుత్రిక. ఈ పథకం గురించి వివరించే ముందు ఈ నాలుగేళ్ల పాలనలో వైద్య ఆరోగ్య రంగం సాధించిన అపూర్వ విజయాలను వివరించదలిచాను.

వైద్య ఆరోగ్య శాఖలో పోస్టుల కొరత మాటే ఉండరాదని గట్టిగా నిర్ణయం తీసుకున్నారు సీఎం. పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి అవసరం లేకుండానే జీవో జారీ చేయించారు. డాక్టర్లు, స్పెషలిస్టు నర్సులు, ఇతర వైద్య సిబ్బందితో కలిపి మొత్తం 48 వేలకు పైగా పోస్టులను భర్తీ చేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుంది.

'పేదవాడికి కార్పొరేట్ ఆస్పత్రి వైద్యం' అనే నినాదానికి 'ఆరోగ్యశ్రీ' పేరిట డాక్టర్ వైఎస్సార్ ఊపిరి పోస్తే... దాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకువెళ్లింది ఆయన తనయుడు జగన్. ఈ రోజున రాష్ట్రంలో 90 శాతం ప్రజలు ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా కోట్లాది రూపాయల విలువైన వైద్య సేవలు అందుకోవడమే దీనికి సాక్ష్యం. ఆరోగ్యశ్రీ చికిత్సలకు సంబంధించిన ప్రొసీజర్స్‌నూ ముఖ్యమంత్రి గణనీయంగా పెంచారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 1,059 ప్రొసీజర్స్ ఉంటే... ఈ రోజు ముఖ్యమంత్రి వాటిని 3,255కు పెంచారు. ఇవ్వాళ క్యాన్సర్ వ్యాధి చికిత్సకు రూ. 20 లక్షలు ఖర్చయినా వెనుకాడకుండా ఆరోగ్యశ్రీ ద్వారా భరించడం పేదవాడికి వరమే. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పథకం కింద గుండె, కిడ్నీ, కాలేయం మార్పిడి, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్, కాక్లియర్ ఇంప్లాంట్ వంటి అత్యంత వ్యయంతో కూడిన చికిత్సలను సైతం పొందే సౌలభ్యాన్ని జగన్ మోహన్ రెడ్డి కల్పించారు. 919గా ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను 2,262కు పెంచారు. హైదరాబాద్, ముంబయి, చెన్నైల లోనూ 202 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను పొందే వెసులుబాటును ముఖ్యమంత్రి కల్పించారు.



పలాసలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు కిడ్నీ రీసెర్చి సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని పాదయాత్ర సమయంలో జగన్ మాటిచ్చారు. నేను కూడా అధికారుల బృందంతో కలిసి ఉద్దానం ప్రాంతంలో పర్యటించాను. ఆ ప్రాంత కిడ్నీ బాధితుల సమస్యలను తెలుసుకున్నాను. వెంటనే యుద్ధ ప్రాతిపదికన అన్ని చర్యలు చేపట్టాం. ముఖ్యమంత్రి మాటంటే మాటే. పలాసలో రూ. 50 కోట్లతో 200 పడకల సామర్థ్యంతో ఆస్పత్రి నిర్మాణాన్ని సీఎం ప్రారంభించారు. ఈ ఆస్పత్రి అతి త్వరలోనే ప్రారంభం కానుంది. ఉద్దానం వాసులకు ముందు స్వచ్ఛమైన మంచి నీటిని అందించే కార్యక్రమాన్ని మా ప్రభుత్వం చేపట్టింది. ఇంతటితో సరిపెట్టకుండా తీవ్రంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నవారికి నెలనెలా పెన్షన్ సాయం అందించేలా ఆదేశించి జగన్ మోహన్ రెడ్డి మానవీయ స్పర్శను చూపించారు.

కంటి చూపు సమస్యతో ఏ ఒక్కరూ బాధపడరాదని ముఖ్యమంత్రి 'డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. రాష్ట్రంలో 66.17 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయించారు. వీరిలో 4.38 లక్షల మందికి పైగా కంటిచూపు సంబంధిత సమస్యలున్నట్లు వైద్యులు గుర్తించారు. కళ్లజోడు అవసరమున్న 1.58 లక్షల మందికి మా ప్రభుత్వమే వాటిని పంపిణీ చేసింది. రాష్ట్రంలోని 24.65 లక్షల మంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి 10.61 లక్షల మందికి కళ్లద్దాలు పంపిణీ చేయడమే కాకుండా 4.70 లక్షల మందికి కేటరాక్ట్ సర్జరీలు చేయించి, వారి జీవితాల్లో వెలుగులు నింపింది.

రాష్ట్రంలో రూ. 8,480 కోట్ల వ్యయంతో కొత్తగా 17 వైద్య కళాశాలలనూ ముఖ్యమంత్రి తెస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 13 వైద్య కళాశాలల పటిష్ఠానికీ, ఉన్నతీకరణకూ రూ. 3.8 వేల కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వ పరంగానూ అందుబాటులోకి తేవాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యం. అదీ మారుమూల గిరిజన ప్రాంతాలకు మరింతగా వైద్య సేవలు అందాలన్నది ఆయన ఆశయం. అందుకే వారికోసం రాష్ట్రంలో ఐదు మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులను సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, బుట్టాయగూడెం, డోర్నాలల్లో రూ. 246.30 కోట్లతో ప్రభుత్వం నిర్మిస్తోంది. కడపలో రూ. 257 కోట్లతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, కేన్సర్ ఆస్పత్రి, మానసిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే ఆరోగ్య రంగం పరంగా ఇంత ప్రగతిని సాధించడం ముఖ్యమంత్రి ఈ రంగంపై పెట్టిన దృష్టికి తార్కాణంగా భావించాలి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉన్నతాశయానికి అనుగుణంగా వైద్య, ఆరోగ్య రంగానికి గత నాలుగేళ్లలో కేటాయించిన బడ్జెట్ మొత్తం 54.6 వేల కోట్ల రూపాయలకు పైనే ఉంది.

గ్రామాల్లో ప్రతి రెండు వేల జనాభాకు ఒక క్లినిక్ పని చేయాలన్నది జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ సమున్నత లక్ష్యంగా ఉంది. ఈ ఆశయానికి అనుగుణంగా 10,032 'డాక్టర్ వైఎస్సార్ విలేజ్‌హెల్త్ క్లినిక్స్' ఏర్పాటవుతున్నాయి. బీఎస్సీ నర్సింగ్ క్వాలిఫై అయిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)తో పాటు ఒక ఏఎన్ఎంతో ఈ క్లినిక్స్ పనిచేస్తాయి. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గ్రామస్థులకు 62 రకాల వైద్య సేవలు లభిస్తాయి. ఈ క్లినిక్స్ అన్నీ టెలిమెడిసిన్ సేవలనూ అందిస్తాయి. స్పెషలిస్టు డాక్టర్ల కన్సల్టేషన్ సేవలు కూడా ఇక్కడ అందుబాటులో ఉంటాయి.

ఫ్యామిలీ డాక్టర్

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా... పీహెచ్‌సీ లోని ఇద్దరు డాక్టర్లలో ఒకరు 104 వాహనంలో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ను సందర్శిస్తారు. అక్కడే ఆ గ్రామ ప్రజలకు జనరల్ ఓపీ, గర్భవతులకు వైద్య పరీక్షలు, అవసరమైన చికిత్సలు నిర్వహిస్తారు. తల్లీబిడ్డల సంరక్షణ; అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల సందర్శన; రక్తహీనత కలిగిన రోగులను గుర్తించి చికిత్స అందించడం వంటి విధులూ నిర్వహిస్తారు. గ్రామంలో మంచం మీది నుంచి లేవలేని స్థితిలో ఎవరైనా ఉంటే వారి ఇంటికి వెళ్లి పరీక్షలు, చికిత్సలు, మందులు ఉచితంగా అందజేస్తారు. గ్రామ పారిశుద్ధ్యం విషయమై పంచాయతీ కార్యదర్శిని సమన్వయం చేసుకోవడం వంటి విధులనూ డాక్టర్లు నిర్వహిస్తారు. ఈ మొబైల్ యూనిట్లలో 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. ట్రయల్ రన్‌లో 2023 ఫిబ్రవరి వరకు 54.3 లక్షల మంది వారి వారి గ్రామాల్లోనే ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందుకున్నారు.

ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య రంగంలో మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచింది. అలా నిలవడానికి చేస్తున్న కృషిలో నేనూ భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నాను.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి
(నేడు 'ఫ్యామిలీ డాక్టర్' పథకం ప్రారంభం)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మంచోళ్లు



మొత్తంగా చూస్తే దక్షిణ భారతదేశం చాలా మర్యాదైనదీ, దయాస్వభావం కలిగినదీ. మా కుటుంబంలో సగంమంది దక్షిణ భారతీయులే. ఏదో రకంగా అందులో నేను కూడా చిన్న భాగం.
– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

ఎన్నో వస్తున్నాయి




కృత్రిమ మేధ (ఏఐ) అనేది పెద్ద కొండ. దాని ఉపకరణాల్లో చాట్ జీపీటీ అనేది కేవలం గోరంత. ఒక్క మార్చి నెలలోనే వెయ్యికి పైగా 'ఏఐ' టూల్స్ విడుదలయ్యాయి.
– జైన్ కాన్, కృత్రిమ మేధ విశ్లేషకుడు

నష్టదాయక పోరు



ఇండియాలో చాలామంది విడాకులు అనే యుద్ధాన్ని చేయడంలో జీవితాన్ని కోల్పోతున్నారు. భర్త నుంచి భరణం పొందేందుకు అమ్మాయిలు తమ ఉద్యోగాలను వదులుకోవడాన్నీ, భరణం చెల్లించడాన్ని తప్పించుకోవడానికి మంచి వేతనాలున్న మగవాళ్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేయడాన్నీ చూశాను. తమ తీవ్రమైన అహాలతో ఇరుపక్షాలూ ఎదుటివారిని సర్వనాశనం చేయడానికి ప్రయత్నిస్తాయి.
– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

రావు, నేర్చుకుంటున్నా!



నేను అస్సామీస్ మీడియం పాఠశాలలో చదువుకున్నాను. హిందీ, ఇంగ్లిష్ నేర్చుకోవడానికి నాకు వచ్చినంతలో సాధ్యమైనంత ప్రయత్నం చేస్తున్నాను. నాకు ఇంగ్లిష్, హిందీ రావని నేను ఒప్పుకోవాలి. దాన్ని ఒప్పుకోవడానికి నాకు ఏ అభ్యంతరమూ లేదు.
– హిమంత బిశ్వ శర్మ, అస్సాం ముఖ్యమంత్రి

వాటికవే వచ్చాయా?



తాజ్ మహల్ (ఆగ్రా), ఎర్ర కోట (ఢిల్లీ), జామా మసీదు, ఫతేపూర్‌సిక్రీ (ఉత్తర ప్రదేశ్), హుమాయూన్ టూంబ్ (ఢిల్లీ), బీబీ కా మక్బరా (ఔరంగాబాద్), ఆగ్రా కోట (ఆగ్రా), పరీ మహల్ (శ్రీనగర్)... ఒకవేళ మొఘలులు వీటిని నిర్మించక పోయివుంటే ఎవరు నిర్మించినట్టు? మోదీనా?
– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

దేవుడే కాపాడాలి!



ఇస్లాం మత మూడో అత్యంత పవిత్ర స్థలమైన అల్ అక్సా మసీదులోకి టపాకాయలు ఎవరు తీసుకెళ్లగలరు? ప్రత్యర్థులను రెచ్చగొట్టి మసీదులో తలదాచుకోవడం లేదా ఆడవారు, పిల్లల వెనక దాక్కోవడం హమాస్, ఇస్లామిక్ జిహాదీయుల పని. పాలస్తీనా సోదర సోదరీమణులను ఈ రాబందు యాక్టివిజపు సైతాన్ల నుంచి దేవుడు కాపాడుగాక!
– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

చచ్చు ఫిక్షన్



ఇటీవలి నా పర్యటనలో యూఎస్‌లోని చాలా బుక్ స్టోర్స్ దర్శించాను. నాకు పుస్తకాల షాపులంటే ఇష్టం. కానీ ఈమధ్య వచ్చిన ఫిక్షన్ అంతా ఒకే రకం – వాటి 'బ్లర్బులు' అన్నీ "ప్రేమ, కోల్పోవడం, గాఢంగా కోరుకోవడం" గురించే. పైగా అన్నీ "బాధాకరం". ఈ మిశ్రమానికి కొన్ని వలసానుభవం కలుపుతున్నాయి. పూర్తిగా చచ్చిపోయింది. అదృష్టవశాత్తూ నాన్-ఫిక్షన్ మాత్రం వర్ధిల్లుతోంది. వాటిలోని వెరైటీ చూసేవాళ్లకు ఎంతో ఆనందం కలిగిస్తుంది.
– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

ఇన్‌బాక్స్

అందరికీ ఆరోగ్యం

జీవరాసులకు సంబంధించిన ఆరోగ్యాన్ని జీవావరణ, మానసిక, సామాజిక సంపూర్ణతగా చూడవలసిన అవసరం ఎంతైనా ఉంది. సమాజ శ్రేయస్సు దృష్ట్యా ఆరోగ్యానికి జీవన ప్రమాణం, జీవన స్థాయి, జీవన నాణ్యతలను కొలమానంగా తీసుకోవచ్చు. ప్రపంచ ఆరోగ్యసంస్థ స్థాపించి 75 సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురస్కరించుకొని, ఈ ఏడాది ఆరోగ్యదినాన్ని 'అందరికీ ఆరోగ్యం' అనే మోటోతో నిర్వహిస్తున్నారు. విపణిలో కొనుగోలు/పంపిణీ చేయటానికి ఆరోగ్యం ఒక వస్తువు/ సరకు కాదు. అది వ్యక్తిపరంగా, కుటుంబపరంగా, సంఘపరంగా చేరుకోవాల్సిన ఒక దశ/స్థితి. కుటుంబపరంగా జన్యువులు, నడవడిక, ఆర్థిక స్థోమత, సమాచార మార్పిడి ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. ఇక సంఘపరంగా ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, మూఢనమ్మకాలు, సంఘ సంస్కృతి, పర్యావరణం, జీవావరణం, ఆరోగ్య వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి.

'అనారోగ్య సమాజంలో అభివృద్ధి సాధ్యపడదు' అని గుర్తించిన మేధావులు, సంస్థలు, దేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో 'ఆరోగ్యాన్ని హక్కుగా' గుర్తించడం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్య, ఆరోగ్యానికి సంబంధించి అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తూ ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల' సాధన దిశగా ముందుకు సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలుచేయబడుతున్న 'నాడు-నేడు', 'గోరుముద్ద', 'పోషణ'/'పోషణ+', 'కంటివెలుగు' లాంటి కార్యక్రమాలు ఆరోగ్య రక్షణలో భాగంగానే మనం గుర్తించాలి. 2021 సంవత్సరపు ఆరోగ్యసూచీల్లో ప్రపంచంలోని 195 దేశాల్లో మనదేశం 42.8 స్కోరుతో 66వ స్థానంలో ఉండగా, దేశంలోని 19 పెద్ద రాష్ట్రాల్లో 69.9 స్కోర్‌తో ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలోఉంది.

– తలతోటి రత్న జోసఫ్, డిప్యూటీ డైరెక్టర్ (రిటైర్డ్), ఏపీ ఆరోగ్య, వైద్య – కుటుంబ సంక్షేమ శాఖ
(నేడు ప్రపంచ ఆరోగ్య దినం)

ఇప్పుడు ప్రపంచం చూపు భారత్ వైపే!

సందర్భం



పురిఘళ్ల రఘురామ్

ఒకప్పుడు భారతదేశం ప్రపంచానికే గురువు. మళ్లీ ఆ రోజులు వస్తాయనీ, తీసుకురాగలమనీ రాష్ట్రీయ సంఘ్ పరివార్ బలంగా విశ్వసిస్తోంది. ఇప్పుడు అగ్రరాజ్యంగా అందరూ అంగీకరించే అమెరికా కూడా భారతదేశం వైపు చూస్తున్న పరిస్థితి. 'భారతదేశానికి ఆ సామర్థ్యం ఉంది. అద్భుతమైన నైతిక స్పష్టతతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతున్నారు. అది మేం చూస్తున్నాం' అని అమెరికా ఈ మధ్యనే అంగీకరించింది. రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపే దమ్మున్న నాయకుడు ఈ ప్రపంచంలో నరేంద్ర మోదీయే అని అగ్రరాజ్యమే చెబుతోంది. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత భారతదేశ విదేశాంగ విధానం ఇంత బలంగా ఇంతకు మునుపెన్నడూ లేదు.

భారతదేశం మళ్లీ విశ్వగురువు అవుతోంది. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, మన విద్యా విధానం, కుటుంబ బంధాలు... ఇవే మన పెట్టుబడి. దీనిని బలంగా నమ్మి, ఆ దిశగా చర్యలు చేపట్టింది బీజేపీ. పాశ్చాత్య సంస్కృతి కానీ, పాశ్చాత్య విధానాలు కానీ మనకు సరిపడవని ముందునుంచీ చెబుతోంది కూడా బీజేపీయే. దేశంలో ప్రజలపై నమ్మకం ఉంచిన ఏకైక ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అటెస్టేషన్ చేయడానికి గెజిటెడ్ ఆఫీసర్ అవసరం లేదనీ, ఎవరికివాళ్లు సంతకం పెడితే సరిపోతుందనీ ప్రకటించి, ఆ మేరకు చట్టాలను కూడా మార్చారు. గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోండి అని ఆయన పిలుపునిస్తే ఎంతోమంది వదులుకోవడానికి ముందుకొచ్చారు. ఒకప్పుడు రెండు సీట్లకు పరిమితమైన పార్టీ తనంతట తానుగా పూర్తి మెజారిటీతో అధికారం సాధిస్తుందని ఎవరైనా కలలోనైనా ఊహించారా? ఇదంతా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సేవకులు దశాబ్దాలుగా క్షేత్ర స్థాయిలో చేసిన త్యాగాల ఫలితం. మోదీ లాంటి ఎంతో మంది నాయకులను దేశానికి అందించింది, అందిస్తోంది.

హిందూయిజం అంటే ఒక జీవన విధానం. దాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి, ఆచరించి, ఆ స్ఫూర్తితోనే భవిష్యత్ తరాలను తయారు చేస్తూ... ఆ క్రమంలోనే ఎంతో



మంది నాయకులను బీజేపీకి అందించింది ఆర్ఎస్ఎస్. అమెరికా ఇప్పుడు చూస్తున్న నరేంద్ర మోదీలోని ఆ నైతిక స్పష్టతకు మూలం ఆర్ఎస్ఎస్ క్రమశిక్షణ, కట్టుబాట్లు. చాలా సంవత్సరాల పాటు దేశాన్ని అధోగతి పాలు చేసిన కాంగ్రెస్ పార్టీ పనిలో పనిగా ఆర్ఎస్ఎస్ మీద కూడా దుష్ప్రచారం చేసింది. చాలామంది హిందువులు కూడా ఈ దుష్ప్రచారాన్నే నమ్మారు. ఇక ముస్లింల సంగతి అయితే సరేసరి. ముస్లింలపై తమదే గుత్తాధిపత్యం అన్న రీతిలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన ఉండేది.

కానీ, ఆ పార్టీ చెబుతున్నది వాస్తవం కాదు అని నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనలో ముస్లింలు అర్థం చేసుకున్నారు. కాబట్టే, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో ముస్లింలు పెద్ద ఎత్తున బీజేపీని ఆదరించారు. ఇక్కడ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చొరవను కూడా ప్రశంసించాలి. ఎందుకంటే ఆర్ఎస్ఎస్ ఐడియాలజీని తీవ్రంగా వ్యతిరేకించే కాంగ్రెస్ నుంచి ప్రణబ్ ముఖర్జీని నాగ్‌పూర్ ఆహ్వానించి, ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించేలా చేశారు. అలాగే, ముస్లింలలో ఉన్న భయాందోళనల్ని దూరం చేసేందుకు ఆయన స్వయంగా ముస్లింల ప్రార్థనా ప్రాంగణానికే వెళ్లారు. మసీదునూ, మదర్సానూ సందర్శించారు.

ఇన్నాళ్లూ సరైన నాయకత్వం లేకపోవడం వల్లనే భారత్ వెనుకబాటుకు గురైందని నరేంద్ర మోదీ పాలన స్పష్టం చేసింది. సరైన దిశానిర్దేశం లేకపోవడం వల్లనే భారతదేశం ప్రపంచంలో ముందుకు వెళ్లలేకపోతోందని బీజేపీ పాలన రుజువు చేసింది. భారతదేశం ఇంకా ఎన్నాళ్లు అభివృద్ధి చెందుతోన్న దేశంగానే ఉంటుందన్న ప్రశ్న ఇక వినిపించదు. ఎందుకంటే ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తి భారతదేశం. త్వరలోనే చైనాను కూడా దాటుకుని ముందుకు వెళ్లేలా ప్రభుత్వం అభివృద్ధి చేసి చర్యలు చేపడుతోంది. ప్రజాస్వామ్య దేశంలో 10 కోట్ల మంది కార్యకర్తలు ఉన్న ఏకైక పార్టీ బీజేపీ. ప్రపంచంలో భారత్‌ను విశ్వగురువుగా నిలిపే దిశలో బీజేపీ చేస్తున్న కృషి కూడా సత్ఫలితాలను ఇస్తోంది.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు
(నేడు బీజేపీ ఆవిర్భావ దినోత్సవం)

'నేను' అనే మిథ్య

'నేను' అంటే ఏమిటి? అది ఒక వ్యక్తి శరీరమా లేక ఆత్మా? కంటికి కనిపించే శరీరం ఎప్పటికైనా మాయమయ్యేదే కాబట్టి, అలా అంతం కానటు వంటి 'ఆత్మ' మాత్రమే 'నేను' అన్నది భారతీయ చింతనలోని ప్రధానమైన విషయం. ఈ ఆలోచనను మరికొంచెం ముందుకు తీసుకువెళ్ళి, ఒక చిత్రమైన సత్యాన్ని కనులముందు పరిచాడు కనుపర్తి అబ్బయామాత్యుడు, తన రచన 'కవిరాజ మనోరంజనము'లో (ప్రథమాశ్వాసము, 152వ పద్యం). ఊర్వశి, పురూరవులకు సంబంధించిన కథ ఇతివృత్తంగా కలిగినది కావడం వలన ఈ కావ్యానికే 'పురూరవశ్చరిత్రము' అని మరొక పేరు కూడా ఉంది.



జ్యోతిర్మయం

కథ ప్రారంభంలోనే ఒక సందర్భంలో పురూరవునికి, నారద మహామునికి మధ్య వేదాంత పరమైన సంభాషణ జరుగుతుంది. 'దేహము తా గానని నిజ మూహింపగ నేర్చినట్టి యుత్తమునకు, దద్దేహునకైన బాంధవ దేహంబులు మిథ్యలనుచు దెలియంబడవే?' అంటాడు నారదుడు. 'తన దేహమే తాను కాదు, మిథ్య అన్న నిజాన్ని అర్థం చేసుకున్న ఉత్తమునికి, తనకు రోజువారీ జీవనంలో మానవ సంబంధాల కారణంగా దగ్గరవాళ్లైన బంధువుల దేహాలు మాత్రం వాళ్ళు కాదు, అవి కూడా మిథ్యలే అన్న నిజం అర్థం కాదా?' అన్నది అబ్బయామాత్యుడు ఉపయోగించిన తర్కం.

తాను మిథ్య అని గుర్తించిన వానికి, లోకమంతా మిథ్య అని తెలుసుకోవడానికి ఎక్కువ సమయం పట్టదు. ఆ కారణం చేత, ఒక వ్యక్తి తాను మిథ్య అని నిర్ధారణకు రావడమే ముఖ్యం; అదే అత్యంత కష్టమైనది. ఆ స్థితిని దాటినవాడికి అంతా తన ప్రతిబింబాలే అని తెలుసుకోవడానికి, నిర్ణయించుకోవడానికి ఏమి అడ్డంకి వస్తుంది? ఏమీ రాదు. కనుక మనిషి ముందు దాట వలసింది 'నేను' అనే మిథ్యను. ఆధ్యాత్మిక వర్తనాలలో అందరూ గుర్తించి మననం చేసుకోవలసిన మొదటి మాట ఇది.

– వెంకట్ భట్టు

క్లుప్తంగా...

సుబ్రహ్మణ్యుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. గోపాల కృష్ణారావు కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయంకు చేరుకున్న ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేసిన అనంతరం నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్ద సతీష్ శర్మ, బాలకృష్ణ శర్మ, స్వామివారి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

నరసింహుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయంలో జస్టిస్ వెంకటరమణ

వేదాద్రి (జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక స్వాములు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఈవో నాగరాజు స్వామివారి చిత్ర పటం, జ్ఞాపిక, ప్రసాదాలు అందజేశారు.

పెదవడ్లపూడి గోశాలను సందర్శించిన కంచి పీఠాధిపతి

మంగళగిరి: గుంటూరు జిల్లా పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడీ సాయి మందిరంతోపాటు గోశాలను మంగళవారం రాత్రి కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి సందర్శించారు. పీఠాధిపతికి సాయిబాబా మందిరం చైర్మన్ పాతూరి నాగభూషణం ఆయన సతీమణి సుధారాణి స్వాగతం పలికారు. సాయిబాబాను దర్శించుకున్న పీఠాధిపతి గోశాలను సందర్శించారు. స్వామిజీ మాట్లాడుతూ భారతీయ విశ్వాసం, విజ్ఞానం వికాసంకు ఆదర్శంగా కామధేను స్వరూపం ఉంటుందన్నారు. భారతీయ పరంపరలో గోపూజ అనేది ప్రతి దేవాలయంలో నిర్వహించాలన్నారు.

హైకోర్టు వ్యాఖ్యలు హర్షణీయం

తాడికొండ: రాజధాని ప్రాంతంలో పేదవారికి చోటు కల్పించడంలో తప్పేముందని హైకోర్టు వ్యాఖ్యానాలు చేయడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 920వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తప్పుబట్టే విధంగా ప్రతి విషయంలో అడ్డుపడుతూ కోర్టులో కేసులు వేయడం మంచి పద్ధతి కాదని, భూములు ప్రభుత్వానికి ఇచ్చిన తరువాత ఇంకా దానిలో ఏం చేయాలి అనే దానిని కూడా అడ్డుకునేలా చూడడం మంచిది కాదని హితవు పలకడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.



నౌకరీ నచ్చలే

- టీమ్స్‌తో కాకుండా ఒంటరిగా పనిచేసే ఉద్యోగుల్లో అసంతృప్తి
- అందులో నైట్ షిఫ్ట్, ట్రక్ డ్రైవింగ్, ఫుడ్ డెలివరీ సర్వీసెస్, ఆన్‌లైన్ రిటైల్ జాబ్స్ తదితరాలు..
- హార్వర్డ్ యూనివర్సిటీ తాజా అధ్యయనంలో వెల్లడి..

సాక్షి, హైదరాబాద్

➤ టీమ్స్‌తో కాకుండా.. ఒంటరిగా పనిచేసే ఉద్యోగాల్లో ఉన్నవారు ఎక్కువ అసంతృప్తితో ఉంటున్నారట. 'అన్‌హ్యాపీయెస్ట్ జాబ్స్'పై హార్వర్డ్ యూనివర్సిటీ ఇటీవల విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. విధి నిర్వహణలో సంతృప్తి పొందే విషయంలో మంచి జీతం, గౌరవం, విశ్వాసం, భద్రత, మంచి కెరీర్, ఇతర ప్రయోజనాలు వంటివి కీలకపాత్ర పోషిస్తున్నట్టు గతంలోనే పలు అధ్యయనాలు స్పష్టంచేశాయి. అయితే దీనికి భిన్నంగా వివిధ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో అసంతృప్తి కలిగించే అంశాలేంటి, వాటికి కారణాలేంటి అనే దానిపై హార్వర్డ్ వర్సిటీ అధ్యయనం నిర్వహించింది. ఇందుకోసం ఐదేళ్లు, పదేళ్లు కాకుండా ఏకంగా 1938 నుంచి జరిగిన అధ్యయనాలను ఆధారంగా తీసుకుంది. దాదాపు 85 ఏళ్ల కాలవ్యవధిలో ఆయా దశల్లో ఉద్యోగుల మానసిక స్థితి, జీవితం వంటి వాటిపై పరిశీలన జరిపింది. ముఖ్యంగా ఓవర్‌నైట్ షిఫ్టులు, ట్రక్ డ్రైవింగ్, నైట్ సెక్యూరిటీతోపాటు టెక్ ఆధారిత పరిశ్రమలు, ప్యాకేజీ, ఫుడ్ డెలివరీ సర్వీసెస్, ఆన్‌లైన్ రిటైల్ జాబ్స్ వంటి విధుల నిర్వహణలో ఉద్యోగులు ఒంటరితనం ఫీలై అసంతృప్తికి గురవుతున్నట్టు తేలింది. మనుషులతో కానీ, చేస్తున్న పనులతోనూ అంతగా మమేకం కాకపోతే చేస్తున్న పనిలో, ఉద్యోగంలో సంతృప్తి ఉండదని ఉద్యోగులు చెప్పారు.

ఇంకా ఈ నివేదికలో ఏముందంటే..

- ➤ బిజీ జాబ్స్ చేస్తున్నా ఇతరులు, సాటి ఉద్యోగులతో సానుకూల ఇంటరాక్షన్లు లేకపోతే ఉద్యోగులు ఒంటరిగా ఉన్నామన్న భావనలో ఉంటున్నారు.
- ➤ సహోద్యోగులు, మనుషులను కలుసుకునే అవకాశం లేకపోతే అదొక పెద్ద వెలితిగా ఉంటుంది. వారితో కొంత సమయం గడిపితే పనిపట్ల సంతృప్తితోపాటు మెరుగ్గా విధులు నిర్వహించే అవకాశం ఉంటుంది.
- ➤ కోవిడ్ కారణంగా 'రిమోట్‌వర్క్' విధానంతో ఈ ఇబ్బందులు మరీ ఎక్కువయ్యాయి
- ➤ ముఖ్యంగా టెక్, ఫుడ్ డెలివరీ, ఆన్‌లైన్ రిటైల్ సర్వీసెస్ తదితర రంగాల్లోని ఉద్యోగులు ఒంటరితనాన్ని అధికంగా ఫీల్ అవుతున్నారు.

టీమ్ వర్క్ ముఖ్యం



రోజువారీ పనులు, ఉద్యోగంలో సమతూకం సాధించడం వంటి వాటిపై నిర్వహించిన అధ్యయనాల్లో ఇదొకటి. ఉద్యోగం–జీవితంలో సంతృప్తి తదితరాలకు సంబంధించిన ఒక పాత రహస్యాన్ని కనుగొనేందుకు ఇది దోహదపడింది. ఉత్పాదకత కోసమే కాకుండా ఉద్యోగుల్లో మనోబలం పెంచేందుకు టీమ్ వర్క్ ముఖ్యమనే విషయం మరోసారి స్పష్టమైంది.

–ప్రొ.రాబర్ట్ వాల్డింగర్, హార్వర్డ్ స్టడీ ఆఫ్ అడల్ట్ డెవలప్‌మెంట్ డైరెక్టర్

ఏం చేయాలి?

- ➤ మిత్రులు, సహోద్యోగులతో తమకున్న ఆసక్తులు, అభిరుచులు పంచుకోవాలి.
- ➤ తోటి ఉద్యోగులు, టీం సభ్యులతో స్నేహసంబంధాలు పెంచుకుంటే అది ఉద్యోగుల్లో మనోబలం పెరిగేందుకు దోహదపడుతుంది. ఫలితంగా మరింత చురుగ్గా పనిచేసే అవకాశం ఉంటుంది.
- ➤ ఓ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకోవడం లేదా క్లబ్‌గా ఏర్పడటం, పుస్తకాలు చదవడం, గేమింగ్ కమ్యూనిటీగా ఏర్పడటం వంటివి చేయాలి. ఇతరుల సహాయం కోరడంతోపాటు, వారికి సహాయపడేందుకూ సిద్ధంగా ఉండాలి.
- ➤ టీం సభ్యులతో పనికి సంబంధించిన అంశాలతోపాటు ఇతరత్రా అంశాలపైనా చర్చించాలి.
- ➤ పనిప్రదేశాల్లో సహోద్యోగులతో సానుకూల సంబంధాల వల్ల పని ఒత్తిడితో పాటు ఆందోళన, అయోమయం వంటివీ తగ్గుతాయి.

ప్రేమికురాలు అనుకుని.. మరో యువతి హత్య

- అమలాపురం ఘటనలో వెలుగు చూసిన కోణం

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఓ వ్యక్తి అమానుషంగా ఒకరిని హత్య చేసిన వైనంలో కొత్త కోణం బయటపడింది. నెల్లూరుకు చెందిన హరికృష్ణ మంగళవారం ఇద్దరు మహిళలపై చాకుతో దాడి చేయగా ఒకరు మృతి చెందిన వైనం తెలిసిందే. అమలాపురం డీఎస్పీ వై.మాధవరెడ్డి వివరాలు వెల్లడించారు. స్థానిక ఏఎంజీ కాలనీకి చెందిన ఓ యువతికి ఐదు నెలల కిందట హరికృష్ణ ఓ యాప్ చాట్‌లో పరిచయమయ్యాడు. ఇన్‌స్టాగామ్‌లో తరచూ చాటింగ్ చేసేవాడు. ఆమెకు వివాహం అయిందని తెలిసి కూడా కొద్ది రోజులుగా నిన్ను ప్రేమిస్తున్నానంటూ హరికృష్ణ వేధించసాగాడు. దీంతో యువతి చాటింగ్ చేయడం తగ్గించింది. మెసేజ్‌లకు బదులు ఇవ్వడం మానేసింది. ఫోన్ చేస్తే కట్ చేసేది. దీంతో ఆమెపై హరికృష్ణ ద్వేషం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో నెల్లూరు నుంచి మంగళవారం మధ్యాహ్నం అమలాపురానికి చేరుకున్నాడు. ఫోన్ చాటింగ్‌లో తెలిపిన అడ్రసు ఆధారంగా ఇంటిని గుర్తించాడు. మద్యం తాగి డాబా పైకి వెళ్లాడు. అక్కడ పనిమనిషి శ్రీదేవి ఎదురైంది. తాను ప్రేమించే యువతి ఆమేననుకుని వెనుక నుంచి చాకుతో పీక కోసి చంపేశాడు. అడ్డు వచ్చిన యువతి తల్లిని చంపేందుకు వీపుపై చాకుతో దాడి చేశాడు. ఆమె కేకలతో ఇరుగు పొరుగు వారు హరికృష్ణను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ యువతి తల్లి అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భద్రాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

- సుదర్శన చక్రానికి వైభవంగా చక్రస్నానం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మార్చి 22న ప్రారంభమైన శ్రీరామనవమి వసంతపక్ష ప్రయుక్త బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు స్వామి వారి సుదర్శన చక్రానికి పవిత్ర గోదావరి నదిలో వైభవంగా చక్రస్నానం వేడుక నిర్వహించారు. అంతకుముందు నదీ తీరాన ఉన్న పునర్వసు మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం ధ్వజారోహణం, దేవతోద్వాసన, పుష్పయాగం, పూర్ణాహుతితో వేడుకలకు ముగింపు పలికారు. కాగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా రద్దు చేసిన నిత్యకల్యాణాలు గురువారం నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి.



గోదావరిలో సుదర్శన చక్రానికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

వెండి రథంపై ఆది దంపతులు



వెండి రథంపై ఉత్సవ మూర్తులు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ గంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వారు వెండి రథంపై విహరించారు. బుధవారం సాయంత్రం మహా మండపం నుంచి ప్రారంభమైన వాహన సేవను దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాట నృత్యాల నడుమ రథం వైభవంగా కదిలింది. ఈ ఏడాది చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో ముగింపు రోజైన బుధవారం అశ్వాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి అశ్వాలపై స్వారీ చేశారు. భక్తులు, ఉభయదాతలు, ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు అమ్మవారి నామస్మరణ చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. పాలక మండలి సభ్యులు రాంబాబు, మాధవీకృష్ణ, ఉదయ లక్ష్మీ, ఏఈవో రమేష్‌బాబు, సూపరింటెండెంట్ హేమదుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన ఒంటిమిట్ట
- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన మంత్రులు
- భక్తులందరికీ ముత్యంతో కూడిన తలంబ్రాల పంపిణీ
- సీతారాములకు శ్రీవారి కానుకలు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా జరుగుతున్న శ్రీకోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. పున్నమి వెన్నెల్లో జరిగిన ఈ కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు కనులారా తిలకించి తరించారు. శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులకు శ్రీవారి సేవకులు ముత్యంతో కూడిన తలంబ్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు శ్రీసీతారాముల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా ఆలయం నుంచి కల్యాణవేదికకు తీసుకొచ్చారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పెద్దిరెడ్డి, కొట్టు దంపతులు

శ్రీకోదండరాముడి కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, కొట్టు సత్యనారాయణ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అర్చకులు మంత్రి పెద్దిరెడ్డికి తలపాగా కట్టి పళ్లెంలో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు ఉంచారు. మంత్రి దంపతులు వీటిని ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో అర్చకులకు అందించి స్వామిని దర్శించుకున్నారు. శ్రీసీతారాముల కళ్యాణవేదికను నాలుగుటన్నుల సంప్రదాయ పుష్పాలు, 30 టన్నుల కట్‌ఫ్లవర్స్, దేశవిదేశీ ఫలాలతో తెలుగుదనం ఉట్టిపడేలా టీటీడీ ఉద్యానవన విభాగం వారు సుందరంగా అలంకరించారు.

సీతారాములకు తిరుమల శ్రీవారి కానుకలు

కల్యాణోత్సవం సందర్భంగా సీతారాములకు తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి కానుకలు పంపారు. 360 గ్రాముల బరువుగల బంగారు పతకం, కౌస్తుభం ఆభరణాలను కానుకగా అందించారు. టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి ఆభరణాలకు పూజలు చేసి అర్చకులకు అందజేశారు. కల్యాణోత్సవంలో మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్యేలు మేడా మల్లిఖార్జునరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, పాలకమండలి సభ్యుడు పోకల అశోక్ కుమార్, ఈవో ధర్మారెడ్డి దంపతులు, కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్, టీటీడీ జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రథారోహణం, తిరిగి 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒంటిమిట్ట పురవీధుల్లో రథోత్సవం నిర్వహిస్తారు.

వేద విద్యార్థుల పాలిట 'శ్రీవారి సన్నిధి'

వేద విజ్ఞాన శాస్త్ర పరీక్షలకే ప్రామాణికం 'తెనాలి పరీక్ష'

- దేశవ్యాప్తంగా వేద విజ్ఞానాన్ని అభ్యసించే విద్యార్థులకు తెనాలిలోనే పరీక్షలు
- శాస్త్రాల పరిరక్షణ కృషిలో 29 ఏళ్లుగా నడుస్తున్న యజ్ఞం



తెనాలి: ప్రియవ్రత పాటిల్.. ఏడేళ్లు చదవాల్సిన వ్యాకరణ శాస్త్రాన్ని కేవలం నాలుగేళ్లలోనే కంఠతా పట్టి 'తెనాలి పరీక్ష'లో ఉత్తీర్ణుడైన బాలపండితుడు. కాంచీపురంలో విద్వత్ పరీక్షలోనూ నెగ్గి 2019లో 16 ఏళ్ల వయసులో కంచిలో విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా ధ్రువీకరణను స్వీకరించాడు. గోవాకు చెందిన ఈ బాలుడిపై అప్పట్లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. మూడున్నరేళ్ల తర్వాత ప్రియవ్రత పాటిల్ గత వారం గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన సెమిస్టర్‌లో తర్కశాస్త్రం పరీక్షలు రాశారు. అనంతరం జరిగిన స్నాతకోత్సవంలో 'వ్యాకరణ విద్వన్మణి' బిరుదుతో కూడిన పట్టా అందుకున్నాడు. ప్రియవ్రత తండ్రి దేవదత్త పాటిల్ ఒకప్పుడు తెనాలి పరీక్ష రాసినవారే. త్రివేండ్రంకు చెందిన పీఆర్ వాసుదేవన్ నంబూద్రి వేదాంత శాస్త్రం, తర్కశాస్త్రం పూర్తి చేశారు. ప్రస్తుతం మీమాంస శాస్త్రం అధ్యయనం చేస్తూ గత వారమే తెనాలిలోని సెమిస్టర్ పరీక్షలు రాశాడు. స్నాతకోత్సవంలో 'తర్క విద్వన్మణి' బిరుదుతో పట్టాను స్వీకరించారు.

ప్రపంచ ప్రామాణిక విద్యావ్యవస్థగా గుర్తింపు


తెనాలిలో మండువా లోగిలిని తలపించే పెంకుటిల్లే ప్రపంచ ప్రామాణిక విద్యావ్యవస్థగా గుర్తింపు పొందిన తెనాలి పరీక్షా కేంద్రం. దేశం నలుమూలల్లో వేద విజ్ఞానాన్ని అభ్యసించే విద్యార్థులంతా 'శ్రీవారి సన్నిధి'గా పిలుచుకునే ఈ ఇంట్లో ఏటా రెండు సెమిస్టర్లలో జరిగే పరీక్షలను రాయాల్సిందే. బహిరంగ విశ్వ విద్యాలయం నమూనాలో 29 ఏళ్లుగా ఇక్కడ జరిగే పరీక్షలో ఎందరో నిష్ణాతులు వెలుగులోకి వచ్చారు. విశ్వవిద్యాలయ ఆచార్యులుగా, ప్రధాన ఆచార్యులుగా, ప్రిన్సిపాల్స్‌గా ప్రసిద్ధి చెందుతున్నారు. రాష్ట్రపతి అవార్డులను సైతం అందుకుంటున్నారు. అద్వైత సిద్ధాంతంలో పండితుడైన భాగవతుల ఆంజనేయ శర్మ మేధస్సు నుంచి ఆవిర్భవించిందీ తెనాలి పరీక్ష. సుధర్మ రక్షణ పరిషత్ పేరుతో ఇక్కడ పరీక్షలు నిర్వహిస్తుంటారు. బెంగళూరు, కాంచీపురం, చెన్నై, జైపూర్, గోవా, వారణాసి.. ఇలా ఉపాధ్యాయులు దేశమంతా విస్తరించి ఉంటారు. ప్రాచీన గురుకుల పద్ధతిలో తమ ఇంటివద్దనే విద్యార్థులకు శాస్త్రాలను బోధిస్తారు. రెండువేల ఏళ్లనాటి విజ్ఞాన శాఖలైన తర్కం (ఆరేళ్ల కోర్సు), మీమాంస (రెండున్నరేళ్లు), వేదాంతం (ఆరున్నరేళ్లు), వ్యాకరణం (ఏడేళ్లు) చదివే విద్యార్థులు ఏడాదిలో రెండుసార్లు తెనాలి వచ్చి సెమిస్టర్ పరీక్షలు రాస్తుంటారు. రాత, మౌఖికంగా జరిగే పరీక్షలు రెండింటిలోనూ కనీసం 50 శాతం మార్కులు సాధిస్తేనే ఉత్తీర్ణులైనట్టు. ఏ ఒక్కదానిలో తక్కువ వచ్చినా మళ్లీ పరీక్ష రాయాల్సిందే. ఆచార్యులకు గౌరవ వేతనం అందుతుంది. విద్యార్థులకు ఉపకార వేతనం వారి ఆర్‌డీ ఖాతాల్లో జమ చేస్తుంటారు. కోర్సు పూర్తయ్యాక మాత్రమే డ్రా చేసే అవకాశం ఉంటుంది.



పీఆర్ వాసుదేవన్ నంబూద్రి



భాగవతుల ఆంజనేయశర్మ



ప్రియవ్రత పాటిల్

విద్వత్ పరీక్షలో తప్పక నెగ్గాలి

తెనాలి పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు కాంచీపురంలోని శంకరమఠంలో నిర్వహించే విద్వత్ పరీక్ష (మౌఖికం)లో తప్పక నెగ్గాలి. అప్పుడే చదివిన కోర్సు ప్రకారం తగిన బిరుదుతో పట్టాను ప్రదానం చేస్తారు. ఇప్పటి వరకు 150 వరకు శాస్త్రపండితుల్ని తీర్చిదిద్దింది ఈ సంస్థ. వీరిలో పలువురు విశ్వవిద్యాలయ కులపతి/ప్రొఫెసర్లు/పరిశోధన స్కాలర్‌గా వ్యవహరిస్తున్నారు. తెనాలి పరీక్షకు అధికారులుగా వస్తుంటారు. దేశంలోని విద్వత్ సభల్లో ఎక్కువగా తెనాలి పరీక్ష పట్టభద్రులు పాల్గొంటున్నారు. టీటీడీ, రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్, కేంద్రీయ విద్యాపీఠంలో పనిచేస్తుంటారు. వీరినుంచి నేర్చుకునేందుకు విదేశాల నుంచి విద్యార్థులు వస్తుంటారు.

1994లో శ్రీకారం

1980 ప్రాంతంలో ఆంధ్ర రాష్ట్రంలో సంప్రదాయ విద్వాంసులు వేళ్లమీద లెక్కించదగిన సంఖ్యలోనే ఉన్నారని తెలుసుకున్న ఆంజనేయ శర్మ సంప్రదాయ విజ్ఞానాన్ని పరిరక్షించి, ముందు తరాలకు అందించాలనే సంకల్పం తీసుకున్నారు. కంచికామకోటిపీఠం ఆస్థాన విద్వాంసుడు బోడా సుబ్రహ్మణ్యశాస్త్రి సూచనలతో 1994 ఏప్రిల్‌లో 'తెనాలి పరీక్ష'కు శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు ఏటా జూన్, డిసెంబర్‌లో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కారణాంతరాలతో రాయలేని వారు, అడ్వాన్సుగా రాసే వారికోసం మార్చిలో ప్రత్యేక పరీక్షలు జరుపుతారు. శాస్త్రాలను మర్చిపోకుండా ఉండాలనే భావనతో 'శివసుందర సద్గురు శాస్త్రసభలు' నిర్వహణ మరో అంశం. పండితులకు ముందుగానే అంశాన్ని ఇచ్చి చర్చలు, ఉపన్యాసాలు చేయిస్తారు. కంచి పీఠం, ఇండిక్ అకాడమీ (హైదరాబాద్), భారతీయ శిక్షాన్ మండల్ (నాగ పూర్) సంస్థలు కొందరు విద్యార్థులను స్పాన్సర్ చేస్తుంటాయి. ఇండిక్ అకాడమీ మాత్రం ఇక్కడే స్నాతకోత్సవం జరిపి కోర్సు పూర్తిచేసిన తమ విద్యార్థులకు పట్టాలను అందిస్తోంది.

ఈ ప్రభుత్వం పేదలపక్షం

- అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ ఆశయాలు, ఆలోచనా విధానం అందిపుచ్చుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- రాష్ట్రంలో పేదలు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు
- బాబూ జగ్జీవన్‌రామ్ 115వ జయంతి వేడుకలో మంత్రి మేరుగు నాగార్జున



సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. బాబూ జగ్జీవన్‌రామ్ 115వ జయంతి మహోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల ఆశయాలు, ఆలోచన విధానాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిపుచ్చుకున్నారని చెప్పారు. కడుపులో బిడ్డ నుంచి అవ్వల వరకు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవటం శుభపరిణామమన్నారు. విద్య, ఆరోగ్యం, పేదలకు ఇళ్లు వంటి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయని చెప్పారు. చిన్ననాటి నుంచే అనేక ఒడుదొడుకులు అధిగమించి భారత రాజకీయాలను ఒంటిచేత్తో నడిపించిన దార్శనికుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కేంద్రమంత్రి పదవులను సమర్థంగా నిర్వహించటమే కాకుండా ఆ సమయంలో విప్లవాత్మక చర్యలకు నాంది పలికి తనదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. పేదలకు చదువు విలువ చెప్పి వారికి చదువు ఎంత ముఖ్యమో అవగాహన కల్పించడంలో ప్రముఖ పాత్ర పోషించారని చెప్పారు. నేటితరం, రాజకీయాల్లో ఉన్నవారు బాబు జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి మంచివ్యక్తి, బడుగు బలహీనవర్గాలతో పాటు అన్ని వర్గాల్లోను పేదలున్నారని గుర్తించి అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న నాయకుడు మనకు దొరికారని చెప్పారు. అటువంటి మంచివ్యక్తిని వదులుకోవద్దని, 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను సీఎం చేసుకోవాలని ఆయన ప్రజల్ని కోరారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ సెంట్రల్, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణువర్ధన్, వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రసంగించారు. ఏపీ మాల వెల్ఫేర్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్‌నెట్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ పి.గౌతమ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి శివశక్తి పుణ్యశీల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధిసంస్థ చైర్మన్ అడపా శేషగిరి, సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, వివిధ దళిత సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సిసోడియా పాత్రపై కొత్త ఆధారం: ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అవకతవకలకు సంబంధించి ఆప్ నేత మనీశ్ సిసోడియా పాత్రపై కొత్త ఆధారం దొరికిందని ఈడీ బుధవారం కోర్టుకు తెలిపింది. ''దర్యాప్తు కీలక దశలో ఉంది. ఈ సమయంలో బెయిలివ్వకండి. కస్టడీ పొడిగించండి'' అని సిసోడియా బెయిల్ పిటిషన్‌పై జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఎదుట ఈడీ లాయర్లు వాదించారు. ఈ వాదనను సిసోడియా తరఫు లాయర్లు ఖండించారు. బెయిల్ ప్రయత్నాలను ఈడీ ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోందని ఆరోపించారు. అనంతరం విచారణను 13వ తేదీకి జడ్జి వాయిదా వేశారు.

కోనేట్లో అపశ్రుతి


తమిళనాట ఐదుగురు జలసమాధి

చెన్నై: తమిళనాడులో ఐదుగురు యువ అర్చకులు ప్రమాదవశాత్తూ కోనేట్లో మునిగి దుర్మరణం పాలయ్యారు. చెన్నై సమీపంలోని మడిపక్కం దగ్గరున్న మూవరసంపేట్ ఆలయంలో బుధవారం ఈ దుర్ఘటన జరిగింది. కోనేట్లో తీర్థవరి కార్యక్రమం నిర్వహించేందుకు నంగనల్లూర్‌లోని ధర్మలింగేశ్వరార్ ఆలయ అర్చక బృందం మూవరసంపేట్ వచ్చింది. 25 మంది ఒకేసారి వలయాకారంలో కోనేట్లో నిల్చుని కార్యక్రమం కొనసాగిస్తున్నారు. ఒకరు లోతున్నవైపు పడిపోయారు. అతడిని కాపాడపోయి మరో నలుగురూ జలసమాధి అయ్యారు. మృతులంతా పాతికేళ్లలోపు వయసు వారే. వారిలో ఒకరు కాలేజీ విద్యార్థి.

అరుణాచల్ ముమ్మాటికీ భారత్‌లో భాగమే: అమెరికా

చైనా దుర్బుద్ధిని తప్పుబట్టిన అగ్రరాజ్యం

వాషింగ్టన్: సరిహద్దు రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్‌లోని 11 ప్రాంతాలకు చైనా సొంతంగా పేర్లు పెట్టుకున్న ఉదంతంపై అమెరికా ఘాటుగా స్పందించింది. 'అరుణాచల్‌ను భారత్‌లో అంతర్భాగంగా మేం గుర్తించాం. పేర్లు మార్చేసి ఏకపక్షంగా ఆ ప్రాంతాలను చైనా తమవిగా చెప్పుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అంటూ అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్ మంగళవారం తెలిపింది. ఈ విషయంలో మొదట్నుంచీ మేం ఒకే అభిప్రాయంతో ఉన్నామని వైట్‌హౌజ్ ప్రెస్ సెక్రటరీ జీన్ పియరీ పత్రికా సమావేశంలో స్పష్టంచేశారు. అరుణాచల్ ప్రాంతాలకు సొంతంగా కొత్త పేర్లు పెట్టుకుంటూ ఆదివారం చైనా పౌర వ్యవహారాల శాఖ ప్రకటన చేయడంతో అమెరికా పైవిధంగా స్పందించింది. 2017లోనూ ఆరు ప్రాంతాలకు, 2021 ఏడాదిలో 15 ప్రాంతాలకు ఇలా చైనా సొంత పేర్లు పెట్టుకుంది. చైనా చర్యలను భారత్ ఆనాడే తీవ్రంగా తప్పుబట్టింది.



దగాకోరు యాప్

- యూజర్ల డేటా చోరీ చేస్తున్న చైనా షాపింగ్ అప్లికేషన్ 'పిండువొడువో'
- వ్యాపారాన్ని పెంచుకోవడానికి అనైతిక వ్యవహారం
- తమ ప్లేస్టోర్ నుంచి తొలగించిన గూగుల్
- 'పిండువొడువో' యాప్‌పై చర్యలు చేపట్టని చైనా ప్రభుత్వం

వినియోగదారుల సమాచారాన్ని దొంగిలిస్తాయన్న ఆరోపణలు చైనా మొబైల్ అప్లికేషన్ల(యాప్‌లు)పై ఎప్పటినుంచో ఉన్నాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఇలాంటి యాప్‌లపై నిషేధం విధించాయి. చైనాలో బాగా జనాదరణ ఉన్న షాపింగ్ యాప్ 'పిండువొడువో' తమ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని తస్కరిస్తున్నట్లు ఇటీవలే వెల్లడయ్యింది. 75 కోట్ల మంది డేటాను సేకరించి, వ్యాపార అభివృద్ధి కోసం వాడుకున్నట్లు బయటపడడం సంచలనం సృష్టిస్తోంది. ఈ యాప్‌ను ఫోన్లలో ఒకసారి ఇన్‌స్టాల్ చేసుకుంటే తొలగించడం చాలా కష్టమని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతుండడం గమనార్హం. చైనా ప్రభుత్వం ఇప్పటికీ పిండువొడువో యాప్‌పై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

- 75 కోట్ల మంది వినియోగదారుల విస్తృత డేటాను పిండువొడువో యాజమాన్యం వారికి తెలియకుండానే సేకరించింది. వారి ఆసక్తులు, అభిరుచులు, ప్రాధాన్యతలు ఏమిటో తెలుసుకుంది.
- వాటికి అనుగుణంగా నోటిఫికేషన్లు, ప్రకటనలు పంపించడానికి తన మెషీన్ లెర్నింగ్ మోడల్‌ను మెరుగుపర్చుకుంది.
- మన ఫోన్లలోని డేటాను ఇతరులు చూడాలంటే మన అనుమతి తప్పనిసరి. పిండువొడువో మాత్రం ఇలాంటి అనుమతుల జోలికి వెళ్లలేదు.

అనుమతి లేకుండానే..

- యూజర్ల ఫోన్లలోకి పిండువొడువో యాజమాన్యం తమ యాప్ ద్వారా మోసపూరిత సాఫ్ట్‌వేర్(మాల్‌వేర్)ను జొప్పించింది. దాని సాయంతో ఫోన్లలోని లొకేషన్లు, కాంటాక్ట్‌లు, క్యాలెండర్లు, నోటిఫికేషన్లు, ఫొటో ఆల్బమ్స్ యాక్సెస్ చేసుకుంది.
- ఫోన్లలోని సిస్టమ్ సెట్టింగ్స్ మార్చే వెసులుబాటు సైతం సొంతం చేసుకుంది. ఫోన్లలో ఉండే ఇతర యాప్‌లపైనా నిఘా పెట్టింది.
- ఒక్కమాటలో చెప్పాలంటే యూజర్లకు తెలియకుండానే వారి ఫోన్లను స్వేచ్ఛగా వాడుకుంది.
- గూగుల్ సంస్థ మార్చి నెలలో తన ప్లేస్టోర్ నుంచి పిండువొడువోను తొలగించింది.
- తమ యాప్‌పై వచ్చిన ఆరోపణలను యాజమాన్యం ఖండించింది.

ఏమిటీ పిండువొడువో?



కోలిన్ హువాంగ్

- చైనాలో ఇంటర్నెట్ వినియోగించే ప్రజల్లో నాలుగింట మూడొంతుల మంది పిండువొడువో యాప్ ఖాతాదారులే. మార్కెట్ విలువ ప్రఖ్యాత షాపింగ్ యాప్ 'ఈబే' కంటే మూడు రెట్లు ఎక్కువ.
- గూగుల్ మాజీ ఉద్యోగి కోలిన్ హువాంగ్ 2015లో షాంఘైలో స్టార్టప్ కంపెనీగా పిండువొడువో యాప్‌ను 6.49.0 అనే వెర్షన్‌తో ప్రారంభించాడు. ఈ-కామర్స్ దిగ్గజాలైన అలీబాబా, జేడీ డాట్ కామ్‌కు పోటీగా ఈ కంపెనీ ప్రస్థానం ఆరంభమైంది. గూగుల్ ప్లేస్టోర్‌తోపాటు చైనా యాప్ స్టోర్లలో అందుబాటులోకి వచ్చింది.
- పిండువొడువో నగరాలను కాకుండా తొలుత చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలనే తన లక్ష్యంగా చేసుకుంది. తక్కువ ఆదాయం కలిగిన ప్రజలకు చౌక ధరలకే వారు కోరుకున్న వస్తువులు చేరవేసింది. ఫ్రెండ్స్, ఫ్యామిలీ గ్రూప్‌లకు భారీగా డిస్కౌంట్లు ఇచ్చింది. దాంతో అనతి కాలంలోనే పిండువొడువో జనంలోకి బాగా చొచ్చుకెళ్లింది.
- 2018 ఆఖరు నాటికి నెలవారీ యూజర్లలో మూడంకెల వృద్ధిని సాధించింది. అదే సంవత్సరం న్యూయార్క్ స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యింది.
- ఈ యాప్ ఫోన్ బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతూనే ఉంటుంది. అందుకే ఫోన్ల నుంచి సులభంగా తొలగించలేమని నిపుణులు వెల్లడించారు.

ఎప్పుడు బయటపడింది?

- పిండువొడువో యాప్‌లో మాల్‌వేర్ ఉన్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరి మాసాంతంలో అనుమానాలు బలపడ్డాయి.
- చైనా సైబర్ సెక్యూరిటీ సంస్థ 'డార్క్ నేవీ' ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. కానీ, ఆ యాప్ పేరును నేరుగా ప్రస్తావించలేదు.
- యాప్ నిర్వాకంపై ఇతర పరిశోధకులు దృష్టి పెట్టారు. మాల్‌వేర్‌తో డేటాను దొంగిలిస్తున్న సంగతి నిజమేనని తేల్చారు. పిండువొడువో అనేది ఒక దొంగ యాప్ అని స్పష్టం చేశారు.
- ఆరోపణలు వెల్లువెత్తడంతో యాప్ యాజమాన్యం అప్రమత్తమైంది. మార్చి 5న వెర్షన్ 6.50.0 పేరిట కొత్త అప్‌డేట్‌ను విడుదల చేసింది. చాలామంది ఇంజనీర్లు, ప్రొడక్ట్ మేనేజర్లను తమ అనుబంధ సంస్థ అయిన 'టెమూ'కు తరలించింది.
- 20 మందితో కూడిన సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ల బృందం ఇప్పటికీ పిండువొడువోలో కొనసాగుతోంది.

చైనా ప్రభుత్వం మౌనమెందుకో?



- కొత్త వెర్షన్ కూడా సురక్షితం కాదని నిపుణులు చెబుతున్నారు. అందులో అండర్‌లైయింగ్ కోడ్ ఉందని, డేటా చౌర్యం కోసం దాన్ని ఎప్పుడైనా రీయాక్టివేట్ చేయొచ్చని హెచ్చరిస్తున్నారు.
- చట్ట ప్రకారం చూస్తే పిండువొడువోను నిషేధించాల్సిందేనని నిపుణులు తేల్చిచెబుతున్నారు. కానీ, ఆ యాప్‌పై ఇప్పటికీ చర్యల్లేవు. యాప్ కార్యకలాపాలపై బహిరంగంగా ఏనాడూ స్పందించలేదు.
- చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న యాప్‌ల పేర్లతో కూడిన జాబితాను చైనా సమాచార సాంకేతిక శాఖ తరచుగా విడుదల చేస్తోంది. ఈ జాబితాల్లో పిండువొడువో పేరును ఒక్కసారి కూడా చేర్చలేదు.
- పిండువొడువో అనుబంధ యాప్ అయిన 'టెమూ' అమెరికాలో డౌన్‌లోడ్లలో అగ్రస్థానంలో ఉంది. పశ్చిమ దేశాల్లోనూ విస్తరిస్తోంది. ఇప్పుడు దీనిపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

భైడెన్ అసమర్థ పాలనలో... అమెరికా సర్వభ్రష్టం

దేశ చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడు: ట్రంప్

- భైడెన్ హయాంలో అణ్వాయుధ మూడో ప్రపంచ యుద్ధం
- విచారణ అనంతరం తొలి ప్రసంగంలో ట్రంప్ నిప్పులు
- తాను పూర్తిగా అమాయకుడినని పునరుద్ఘాటన
- అటార్నీ, సుప్రీంకోర్టు జడ్జిపైనా తీవ్ర విమర్శలు

వాషింగ్టన్: హష్ మనీ చెల్లింపుల కేసులో తాను పూర్తిగా అమాయకుడినని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ కేసులో తనపై దాఖలైన క్రిమినల్ అభియోగాలకు సంబంధించి మంగళవారం ఆయన న్యూయార్క్‌లో మన్‌హాటన్ జ్యూరీ ముందు విచారణకు హాజరవడం తెలిసిందే. అనంతరం ఫ్లోరిడాలో తన మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. ఈ కేసు రాజకీయ కక్షసాధింపులో భాగమని ఆరోపించారు. వామపక్ష అతివాద ఉన్మాదులు దేశాన్ని సర్వనాశనం దిశగా తీసుకెళ్తున్నారంటూ అధ్యక్షుడు జో భైడెన్, ఆయన మద్దతుదారులపై నిప్పులు చెరిగారు. చట్టాన్ని అడ్డం పెట్టుకుని ఇప్పుడిలా ఎన్నికల ప్రక్రియనూ ముందుగానే ప్రభావితం చేయజూస్తున్నారని ఆరోపించారు. అలా ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వబోమని హెచ్చరించారు. ''భైడెన్ దేశ చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడు. ఆయనకు ముందున్న ఐదుగురు అత్యంత అసమర్థ అధ్యక్షుల వైఫల్యాన్నింటినీ కలగలిపినా భైడెన్ పాలనా వైఫల్యాల్లో పదో వంతుకు కూడా తూగవు. అంతటి దారుణ పాలనతో అమెరికాను అన్ని రంగాల్లోనూ భ్రష్టు పట్టిస్తూ విఫల రాజ్యంగా మారుస్తున్నారు'' అంటూ తూర్పారబట్టారు. ''ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ద్రవ్యోల్బణం అదుపు తప్పుతోంది. డాలర్ శరవేగంగా పతనమవుతోంది. గత 200 ఏళ్ల అమెరికా చరిత్రలో అత్యంత దారుణ పరాజయమిది! ఒక్కమాటలో చెప్పాలంటే అమెరికా ఇంకెంత మాత్రమూ సూపర్ పవర్ కాదు. సర్వనాశనం దిశగా పయనిస్తోంది'' అంటూ ఆవేదన వెలిబుచ్చారు. 2024లో మరోసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానని ట్రంప్ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే.

నేనుంటేనా...!

భైడెన్ అసమర్థత వల్ల నమ్మశక్యం కాని రీతిలో చైనాతో రష్యా, ఇరాన్‌తో సౌదీ అరేబియా చేతులు కలిపాయని ట్రంప్ ఆరోపించారు. ''చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా కలిసి అత్యంత వినాశకర సంకీర్ణంగా రూపొందాయి. ఎన్నో దేశాలు అణ్వాయుధాలను ప్రయోగిస్తామంటూ బాహాటంగా హెచ్చరికలు చేస్తున్నాయి. ఎవరు నమ్మినా నమ్మకపోయినా పూర్తిస్థాయి అణ్వాయుధ ప్రయోగాలతో కూడిన మూడో ప్రపంచ యుద్ధం ఎంతో దూరంలో లేదు. భైడెన్ హయాంలోనే జరిగి తీరుతుంది'' అని చెప్పుకొచ్చారు. ''నేనుంటే వీటిలో దేన్నీ జరగనిచ్చేవాన్ని కాదు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధమే జరిగేది కాదు. ఎన్నో లక్షల ప్రాణాలు పోయేవి కాదు. అందమైన ఉక్రెయిన్ పట్టణాలు నేలమట్టమయ్యేవి కాదు'' అని ట్రంప్ అన్నారు.



అదే నా తప్పిదం...

వినాశక శక్తుల బారినుంచి దేశాన్ని సాహసోపేతంగా కాపాడటమే తాను చేసిన ఏకైక తప్పిదమంటూ భైడెన్, ఆయన మద్దతుదారులపై ట్రంప్ నిప్పులు చెరిగారు. తనపై కేసు విషయంలో మన్‌హాటన్ జిల్లా అటార్నీ ఆల్విన్ బ్రాగ్‌తో పాటు దాన్ని పర్యవేక్షిస్తున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ జువాన్ ఎం.మెర్చన్‌పైనా విరుచుకుపడ్డారు. వారిద్దరూ డెమొక్రటిక్ పార్టీ సానుభూతిపరులంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ''అంతే కాదు, వారిద్దరికీ నేనంటే విపరీతమైన ద్వేషం. జువాన్ భార్యకు, కుటుంబానికీ నేనంటే అసహ్యమే. ఆయన కూతురు ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కోసం పని చేస్తోంది'' అన్నారు. ఎవరేం చేసినా తనను కుంగదీయలేరని, అమెరికాను మరోసారి గొప్ప దేశంగా మార్చి చూపిస్తానని చెప్పుకొచ్చారు.

ట్రంప్‌పై పరువు నష్టం కేసు...స్టార్మీ డేనియల్స్‌కు చుక్కెదురు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై 2018 నాటి పరువునష్టం కేసులో శృంగార చిత్రాల తార స్టార్మీ డేనియల్స్‌కు చుక్కెదురైంది. ఆమె పిటిషన్‌ను కాలిఫోర్నియాలోని 9వ సర్క్యూట్ కోర్టు కొట్టేసింది. అంతేగాక ఈ సివిల్ కేసులో ట్రంప్ తరఫు లాయర్లకు ఫీజు కింద 1.2 లక్షల డాలర్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటికే దిగువ కోర్టులు కూడా విధించిన మొత్తంతో కలిపి ట్రంప్ లాయర్లకు డేనియల్స్ 6 లక్షల డాలర్లకు పైగా చెల్లించాల్సి ఉంటుంది.

సీఎం బొమ్మైకి నా మద్దతు

పోటీ చేయను.. ఏ పార్టీలో చేరను ● కన్నడ నటుడు కిచ్చ సుదీప్

సాక్షి, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి, బీజేపీ నేత బసవరాజ బొమ్మైకి తన మద్దతు ప్రకటిస్తున్నట్లు ప్రముఖ కన్నడ నటుడు కిచ్చా సుదీప్ ప్రకటించారు. బొమ్మై సూచించిన అభ్యర్థుల తరఫున ఎన్నికల్లో ప్రచారం చేస్తానని చెప్పారు. అయితే తాను బీజేపీలో తాను చేరడం లేదని, పోటీ చేయడం లేదని బుధవారం స్పష్టం చేశారు.

తొలినాళ్లలో సాయపడ్డారు

'కష్టకాలంలో నాకు అండగా నిలిచిన వారు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సాయపడటం నా కర్తవ్యం. సీఎం వ్యక్తిత్వానికి గౌరవమిచ్చి ఈ నిర్ణయానికి చిత్ర పరిశ్రమలో నాకు గాడ్ ఫాదర్ ఎవరూ లేరు. బొమ్మైని ప్రేమగా మామా అని పిలుస్తా. చిత్ర పరిశ్రమలో నేను తొలినాళ్లలో కష్టాల్లో ఉన్నపుడు ఆయన ఎంతో సాయపడ్డారు. అందుకే కృతజ్ఞతాపూర్వకంగా ఆయనకు మద్దతు ప్రకటిస్తున్నా'' అన్నారు. సుదీప్ నిర్ణయం బీజేపీకి పెద్ద బలమని బొమ్మై వ్యాఖ్యానించారు.

బెదిరింపు లేఖలు ఎవరు పంపారో తెలుసు

తనకు బెదిరింపు లేఖలు రావడంపై అంతకుముందు సుదీప్ మీడియాతో మాట్లాడారు. ''దానితో నేతలకు సంబంధం లేదు. అదెవరి పనో నాకు తెలుసు. వారికెలా బదులివ్వాలో నాకు తెలుసు. బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాదు. గతంలో ఎవరు పిలిచినా వెళ్లి ప్రచారం చేశా. అంత మాత్రాన వారి పార్టీలకు మద్దతిచ్చినట్లు కాదు. అన్ని పార్టీలతోనూ నాకు సత్సంబంధాలున్నాయి. ఏ పార్టీని, ఎవరి కోసమూ టికెట్ కోరలేదు'' అని చెప్పారు. సుదీప్‌ను అసభ్య పదజాలంతో దూషిస్తూ ఆయన ప్రైవేట్ వీడియోలను సోషల్ మీడియాలో పెడతామంటూ రెండు బెదిరింపు లేఖలు రావడం తెల్సిందే. దీనిపై ఆయన మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసును సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.


విలేకరులతో మాట్లాడుతున్న సీఎం బొమ్మై, నటుడు సుదీప్

సుదీప్ కోసం పార్టీల ఆరాటం

మంచి జనాదరణ ఉన్న సుదీప్ మద్దతు కోసం కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాయి. గత ఫిబ్రవరిలో సుదీప్ పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌ను కలవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారని వార్తలు గుప్పు మన్నాయి. జేడీ(ఎస్) నేత కుమారస్వామి గతంలోనే సుదీప్‌ను కలిశారు. శివమొగ్గ జిల్లాకు చెందిన సుదీప్ సంఖ్యాధికులైన వాల్మీకి నాయక వర్గానికి చెందిన వారు. సామాజిక స్పృహ ఉన్న సుదీప్ బీజేపీకి మద్దతు పలకడం బాధాకరమని అంటూ నటుడు ప్రకాశ్‌రాజ్ మీడియాతో అన్నారు.

మీడియావన్‌పై నిషేధం ఎత్తివేత

విమర్శలను దేశ వ్యతిరేక కోణంలో చూడొద్దన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మలయాళ వార్తా చానల్ 'మీడియావన్'పై దేశ భద్రతా కారణాలతో గతేడాది కేంద్రం విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు బుధవారం రద్దు చేసింది. నిజానిజాలు సరిచూసుకోకుండానే నిషేధాజ్ఞలు అమలుచేశారంటూ కేంద్ర హోం శాఖను తప్పుబట్టింది. మీడియాపై అకారణంగా నిషేధం అమలుచేస్తే పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలుగుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిషేధాన్ని సమర్థిస్తూ గతంలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలుచేసింది. ''ప్రభుత్వ విధానాలను తప్పుబడుతూ చేసిన విమర్శలను దేశ వ్యతిరేక చర్యలుగా చిత్రీకరించవద్దు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అత్యంత ప్రధానం. పాలనపై వాస్తవాలు వెల్లడించే మీడియా ద్వారా పౌరులు ఒక అభిప్రాయానికొస్తారు. సరైన నిర్ణయాలు తీసుకునే ప్రజల ద్వారానే ప్రజాస్వామ్యం సరైన పథంలో ముందుకు సాగుతుంది. ఏకధృవ పోకడలు, అభిప్రాయాలు ప్రజాస్వామ్యానికి కీడు చేస్తాయి. ఛానెల్ లైసెన్స్‌ను రెన్యువల్ చేయకపోవడం భావ ప్రకటన స్వేచ్ఛపై ఆంక్షలు విధించడమే' అని అభిప్రాయపడింది. నిషేధానికి కారణాలను సీల్డ్‌కవర్‌లో కోర్టుకు మాత్రమే తెలియజేయడం సహజ న్యాయసూత్రాన్ని ఉల్లంఘించడమేనని న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ అన్నారు. మీడియావన్ వార్తలను తప్పుబడుతూ భద్రతా కారణాలతో 2022 జనవరి 31న కేంద్రం దానిపై నిషేధం విధించింది. చానల్ దాన్ని కేరళ హైకోర్టులో సవాలు చేయగా కేంద్రం నిర్ణయాన్ని సమర్థించింది. దాంతో చానల్ సుప్రీంను ఆశ్రయించింది.

చరిత్ర పుస్తకాల్లో 'గాంధీ, ఆరెస్సెస్' తొలగింపు

న్యూఢిల్లీ: దేశానికి స్వాతంత్ర్యం రాగానే హిందూ, ముస్లింల మధ్య గొడవలు, సయోధ్య కోసం గాంధీ విఫలయత్నం, ఆయన హత్య తర్వాత ఆరెస్సెస్‌పై నిషేధం, గోధ్రా అల్లర్ల తర్వాత ఘటనలు తదితరాలను పన్నెండో తరగతి చరిత్ర పాఠ్య పుస్తకాల నుంచి ఎన్‌సీఈఆర్‌టీ తొలగించింది. హేతుబద్ధీకరణలో భాగంగా ఏయే అంశాలను తొలగించబోతున్నదీ తెలుపుతూ మండలి గత జూన్‌లో విడుదల చేసిన బుక్‌లెట్‌లో వీటి ప్రస్తావన లేకపోవడం గమనార్హం. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. హిందూ అతివాదంపై గాంధీ అభిప్రాయాలు వంటి అంశాలను తొలగించడం భావితరాలకు వాస్తవాలు తెలియకుండా చేసే కుటిల యత్నమని ఆరోపించింది. బీజేపీ, ఆరెస్సెస్ ఎంత ప్రయత్నించినా చరిత్రను మార్చలేవని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. విషయ నిపుణుల సూచన మేరకే వాటిని తొలగించినట్టు ఎన్‌సీఈఆర్‌టీ చీఫ్ దినేశ్ సాక్లానీ చెప్పారు. ఈ విషయంలో రాద్ధాంతం అనవసరమని అభిప్రాయపడ్డారు.

'దర్యాప్తు సంస్థల దుర్వినియోగం'పై విపక్షాలకు సుప్రీంలో చుక్కెదురు



- నేతలకు ప్రత్యేక హక్కులుండవు
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యలు
- మార్గదర్శకాల జారీకి నిరాకరణ
- పిటిషన్ ఉపసంహరించుకున్న పార్టీలు

న్యూఢిల్లీ: దర్యాప్తు సంస్థల దుర్వినియోగం అంశంపై విపక్షాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వాటిని కేంద్రం తీవ్రంగా దుర్వినియోగం చేస్తోందంటూ కాంగ్రెస్ సహా 14 ప్రతిపక్ష పార్టీలు వేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం నిరాకరించింది. రాజకీయ నాయకులకు న్యాయపరంగా సాధారణ ప్రజలకు మించిన రక్షణలేమీ ఉండబోవని ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ''ఈ పిటిషన్ ఎందుకు వేశారు? విచారణ నుంచి నేతలకు రక్షణ కల్పించేందుకా? వారికి ప్రత్యేక హక్కులేమైనా ఉన్నాయా?'' అని సీజేఐ ప్రశ్నించారు. నేతల పట్ల దర్యాప్తు సంస్థలు అన్యాయంగా వ్యవహరించాయని రుజువు చేసేందుకు ఒక్క క్రిమినల్ కేసునూ పిటిషన్లో పేర్కొనలేదని గుర్తు చేశారు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం విపక్షాల విజ్ఞప్తి ఆధారంగా అరెస్టుకు ముందు, తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థలకు నిర్దిష్ట మార్గదర్శకాలను జారీ చేయడం కుదరదని తేల్చిచెప్పారు. దాంతో, పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని పార్టీల తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోరాల్సి వచ్చింది. అందుకు ధర్మాసనం అనుమతించింది. నేతల హక్కులకు భంగం కలిగే పక్షంలో నిర్దిష్టమైన రుజువు చూపుతూ ఎప్పుడైనా తమను ఆశ్రయించవచ్చని హామీ ఇచ్చింది.

కేంద్రానిది కక్షసాధింపు...

అంతకుముందు సింఘ్వి వాదిస్తూ నిర్దిష్టంగా ఫలానా కేసులో ఫలానా నేతలకు తాము ఎలాంటి రక్షణలూ కోరడం లేదని స్పష్టం చేశారు. కానీ ప్రతిపక్ష పార్టీల స్థైర్యాన్ని దెబ్బ తీసే ఉద్దేశంతో కేంద్రం వాటిపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోందని ఆరోపించారు. విపక్ష నేతలను కేంద్రం ఉద్దేశపూర్వకంగానే లక్ష్యంగా చేసుకుంటోందన్నారు. ''మోదీ ప్రభుత్వ హయాంలో 2014–22 మధ్య వారిపై సీబీఐ, ఈడీ కేసులు ఏకంగా 600 శాతం పెరిగాయి. సీబీఐ 124 మంది రాజకీయ నాయకులపై దర్యాప్తు చేస్తే వారిలో ఏకంగా 108 మంది విపక్ష నేతలే'' అని చెప్పారు. పిటిషన్ వేసిన పార్టీల్లో కాంగ్రెస్‌తో పాటు డీఎంకే, ఆర్జేడీ, బీఆర్ఎస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆప్, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), జేఎంఎం, జేడీ(యూ), సీపీఎం, సీపీఐ, నేషనల్ కాన్ఫరెన్స్ ఉన్నాయి.

మళ్లీ వాయిదానే...

పార్లమెంటులో అదే తీరు ● బడ్జెట్ సమావేశాలకు నేటితో తెర

న్యూఢిల్లీ: అదానీ ఉదంతంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం దర్యాప్తు కోరుతూ విపక్షాలు నిరసన కొనసాగించడంతో పార్లమెంటు ఉభయ సభలు బుధవారం కూడా వాయిదా పడ్డాయి. నలుపు దుస్తులతో హాజరైన విపక్ష సభ్యులు సభాపతుల విజ్ఞప్తులను పట్టించుకోకుండా నినాదాలు, నిరసనలు, ప్లకార్డులతో హోరెత్తించారు. దాంతో లోక్‌సభ, రాజ్యసభ కార్యకలాపాలేవీ చేపట్టకుండానే ముందు మధ్యాహ్నం రెండింటిదాకా, తర్వాత గురువారానికి వాయిదా పడ్డాయి. అదానీపై విపక్షాలు, రాహుల్ గాంధీపై అధికార బీజేపీ వాగ్యుద్ధం కారణంగా మార్చి 13న మొదలైన పార్లమెంటు మలి విడత బడ్జెట్ సమావేశాలు ఇప్పటిదాకా పెద్దగా కార్యకలాపాలేవీ జరపలేకపోయాయి. గురువారంతో బడ్జెట్ సమావేశాలకు తెర పడనుంది. మరోవైపు పార్లమెంటులో సమన్వయ సాధనకు విపక్ష నేతలు బుధవారం ఉదయం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చాంబర్లో భేటీ అయ్యారు. డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, ఆప్, జేడీ(యూ), సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, జేఎంఎం, శివసేన (యూబీటీ), ఆరెస్పీ, ఐయూఎంఎల్ నేతలు పాల్గొన్నారు. అదానీ అంశంపై జేపీసీ విచారణ డిమాండ్‌పై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గరాదని నిర్ణయించారు.

ధన్‌ఖడ్‌కు ఖర్గే లేఖ

భారత్‌లో ప్రజాస్వామ్యంపై బ్రిటన్లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై రాజ్యసభలో మంత్రి పీయూష్ గోయల్, విపక్ష నేత ఖర్గే మధ్య వాగ్యుద్ధం జరిగింది. రాహుల్ రాజ్యసభకు వచ్చి క్షమాపణలు చెప్పాలన్న డిమాండ్‌పై అభ్యంతరం తెలుపుతూ మార్చి 13న ఖర్గే లేవనెత్తిన పాయింటాఫ్ ఆర్డర్‌ను తోసిపుచ్చుతున్నట్టు చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రకటించారు. కాంగ్రెస్ నేతలు సభను అవమానిస్తున్నారంటూ మంత్రి మండిపడగా విపక్షాలను నోరెత్తనివ్వడం లేదంటూ ఖర్గే దుయ్యబట్టారు. ధన్‌ఖడ్ నిర్ణయాన్ని తప్పుబడుతూ ఆయనకు ఖర్గే లేఖ రాశారు. సభాపతులు అధికార పక్షాలకు అనుకూలంగా ప్రవర్తించరాదని హితవు పలికారు.


బుధవారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ అవార్డులు అందుకుంటున్న అఖిలేశ్ యాదవ్ (పద్మవిభూషణ్-తండ్రి దివంగత ములాయంసింగ్ యాదవ్ తరఫున), సుధామూర్తి, చినజీయర్ స్వామి (పద్మభూషణ్), ఎంఎం కీరవాణి, ఖాదర్ వలీ, నాగప్ప గణేశ్ కృష్ణరాజనాగర్, అబ్బారెడ్డి నాగేశ్వరరావు (పద్మశ్రీ)

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 6 । ఏప్రిల్ । 2023

ఎత్తినహొళె ఎన్నడో!

తుమకూరు: జిల్లాలో కొరటగెరె తాలూకా ఇరక సంద్ర వద్ద ఎత్తినహొళె ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.23,251 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. బెంగళూరు రూరల్, రామనగర, హాసన్, తుమకూరు, చిక్కబళ్లాపుర, కోలారు జిల్లాలకు తాగునీటిని అందించాలన్నది ఈ పథకం లక్ష్యం. అయితే పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలున్నాయి.



న్యూస్‌రీల్

ప్రేమపెళ్లికి బలైన దళిత యువతి

- కొట్టి చంపిన భర్త?
- చిత్రదుర్గలో దారుణం



పెళ్లి నాటి ఫొటోలో చిత్రలింగప్ప, పూర్ణిమ (ఫైల్)

సాక్షి, బళ్లారి: వారిద్దరి కులాలు వేరు, అయినా ప్రేమించుకుని, కుటుంబ సభ్యులను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. ఏడాది లోపే ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తి గొడవలు పడుతూ చివరికి కట్టుకున్న భార్యను భర్త హత్య చేసిన ఘటన చిత్రదుర్గలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్రదుర్గలో యాదవ కులానికి చెందిన చిత్రలింగప్ప, దళిత సామాజిక వర్గానికి చెందిన పూర్ణిమ (22) అనే ఇద్దరూ ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇరు కుటుంబాలు ప్రారంభంలో అభ్యంతరం తెలిపారు. యువతి తల్లిదండ్రులు అంగీకారానికి వచ్చి ఆ జంటకు రిజిస్టర్ మ్యారేజ్ కూడా చేయించారు. కానీ పెళ్లైన ఆరు నెలల నుంచి ఇద్దరి మధ్య విభేదాలు పెరిగి గొడవలు పడేవారు. పుట్టింటికెళ్లి కట్నం తేవాలని వేధించేవారని, తమ కూతురిని అల్లుడే తీవ్రంగా కొట్టి గొంతు నులిమి హత్య చేశాడని యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై చిత్రదుర్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతితో మాట్లాడినందుకు దాడి

యశవంతపుర: బస్‌లో మరో వర్గం యువతితో మాట్లాడినందుకు యువకునిపై దాడి జరిగిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా ఉజిరెలో జరిగింది. మంగళూరులో పని చేస్తున్న మహమ్మద్ జహీర్ (22) మంగళవారం సాయంత్రం ఊరికి వెళ్లాలని బస్ ఎక్కాడు. బస్సులో తెలిసిన యువతి ఉండగా ఆమెతో మాట్లాడడాన్ని గమనించిన హిందూపర సంఘాల కార్యకర్తలు జహీర్‌పై దాడి చేసి బస్ నుంచి కిందకు దించేశారు. ఆమెతో ఎందుకు మాట్లాడావంటూ చితకబాది వెళ్లిపోయారు. గాయాలైన జహీర్ బెళ్తంగడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నితేశ్, అవినాశ్, దినేశ్, సచిన్ అనేవారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సాక్షి బెంగళూరు: నగరంలో రామయ్య వైద్య విద్య కళాశాల 39వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మార్చి 31న ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ఎయిమ్స్ కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ బలరాం భార్గవ ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులకు పట్టాలను అందించారు. మొత్తం 335 మంది విద్యార్థులు మెడికల్ డిగ్రీ సర్టిఫికెట్లను అందుకోగా, అందులో 31 మందికి మెడల్స్ లభించాయి. ఈ కార్యక్రమంలో గోకుల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం పాల్గొన్నారు.

మహారాష్ట్రపై సీఎం భగ్గు

శివాజీనగర: సరిహద్దు వివాదం సుప్రీంకోర్టులో ఉన్నా కూడా మహారాష్ట్ర ప్రభుత్వం సరిహద్దుల్లో గందరగోళం సృష్టించే పని చేస్తోందని సీఎం బొమ్మై బుధవారం ట్విట్టర్లో ఆరోపించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సరిహద్దు వివాదాలను సృష్టించబోమని సమ్మతించారు, అయితే నేడు కర్ణాటకకు చెందిన 865 గ్రామాల ప్రజలకు బాబు జగ్జీవన్‌రామ్ బీమా పథకం అమలుకు ఆదేశించటం సమాఖ్య వ్యవస్థకు భంగం కలిగించే కృత్యమని సీఎం దుయ్యబట్టారు.

కేజీ బంగారు రూ.5 లక్షలని..

కణేకల్లు: తక్కువ ధరకు బంగారమిస్తామంటూ ఆశచూపి ఓ వ్యక్తి నుంచి కర్ణాటక ముఠా రూ.5 లక్షలు కొట్టేసింది. వివరాలు.. కణేకల్లు పరిధిలోని కళేకుర్తికి చెందిన రుద్ర బాధితుడు. హొసపేటె జిల్లా హువిన హడగలికి చెందిన నాగరాజు, మరికొందరితో నకిలీ బంగారు మోసాలకు పాల్పడేవాడు. అతడు రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లులో జావేద్ అనే వ్యక్తికి కేజీ బంగారం రూ.5 లక్షలకు ఇస్తానని, ఎవరైనా ఉంటే తీసుకురమ్మని చెప్పాడు. జావేద్ ఈ విషయాన్ని రుద్రకు చెప్పడంతో ఆయన ఆశపడి రూ.5 లక్షలు రెడీ చేసుకున్నాడు. నాగరాజు, జావేద్, మరికొందరు ముఠాసభ్యులు రుద్రతో రూ.5 లక్షలు తీసుకొని నకిలీ బంగారాన్ని అంటగట్టారు. రుద్ర ఊరికి వచ్చాక బంగారాన్ని పరీక్షింపజేయగా నకిలీదని తెలిసి కణేకల్లు పోలీసులకు ఆశ్రయించాడు.

ఎంతెంత దూరం.. పౌష్టికాహారం

- 2.31 లక్షల మంది బాలల్లో లోపం
- కలబురిగి, విజయనగర, బెళగావి జిల్లాల్లో తీవ్రం
- పేదల దరిచేరని పథకాలు

నేటి ఆధునిక యుగంలో ఆహారం ఎక్కువైపోయి వృథా అవుతోంది. పెళ్లిళ్లు, వేడుకల్లో ఎంతో ఆహారం చెత్తదిబ్బ పాలైతే, నాణేనికి మరోవైపున.. ఆహారం దొరక్క పల్లెల్లో బాల్యం వాడిపోతోంది. అందులోనూ పోషకాహారం దొరక్క రేపటి పౌరులు బక్కచిక్కి, రోగాలతో కుస్తీ పడాల్సి వస్తోంది. అంగన్‌వాడీల్లో ఇచ్చే పోషకాహార కిట్లు అవగాహన లేక పేదల వరకూ చేరడం లేదు.



ఆహారం దొరకడమే గొప్ప అనే దుస్థితిలో వేలాది మంది బాలలు

బనశంకరి: రాష్ట్రంలో 2,31,932 మంది బాలలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు అంచనా. 5 ఏళ్ల లోపు పిల్లలు పోషణ లోపాలతో తనువు చాలిస్తున్నట్లు పలు నివేదికలు హెచ్చరించాయి. బలహీనంగా ఉండడం వల్ల పిల్లలపై వివిధ రోగాలు దాడి చేసే ప్రమాదం అధికం. రాష్ట్రంలో 8,711 మంది పిల్లల్లో తీవ్ర పౌష్టికలోపంతో ఉంది. ఉత్తర కర్ణాటక ప్రాంతాలైన కలబురిగి, విజయనగర, బెళగావి జిల్లాలు పౌష్టిక లోపంలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని మహిళా శిశుసంక్షేమశాఖ పేర్కొంది.

పేదరికం, నిరక్షరాస్యత..

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో ఆరోగ్య సంరక్షణపై ఇప్పటికీ సరైన అవగాహన లేదు. దీని వల్ల ఆరోగ్యం, పౌష్టికాహారం గురించి శ్రద్ధ వహించడం చాలా తక్కువ. తగినంత ప్రమాణంలో పాలు, గుడ్లు, మాంసం, గింజ ధాన్యాలు వంటి ఆహారం పిల్లలకు అందక తక్కువ బరువు, రోగాలతో బాధపడే ప్రమాదం పెరిగింది. ప్రసూతి సమయంలో తల్లీ–బిడ్డ పూర్తి స్థాయిలో ఆరోగ్యసేవలు పొందకపోవడం, పేదరికం, నిరక్షరాస్యత, అంగన్‌వాడీ కేంద్రాల్లో అలసత్వం వంటివి బాలల్లో పౌష్టిక లోపానికి ప్రధాన కారణమని ఇటీవల సమీక్షల్లో వెలుగుచూసింది.

పథకాలను పొందడమే సవాల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నప్పటికీ పిల్లల్లో పౌష్టిక నిర్మూలన సవాల్‌గా మారింది. అంగన్‌వాడీల్లో బీపీఎల్ కార్డుదారులు నమోదు చేసుకుంటే 6 నెలల నుంచి 6 ఏళ్ల వయసు పిల్లలకు గుడ్లు, పాల ప్యాకెట్లు, ఇంకా పలు ఆహార దినుసులను అందజేస్తారు. తీవ్ర పౌష్టిక లోపం కలిగిన పిల్లలకు ప్రతి నిత్యం రూ.12, సాధారణ పౌష్టిక లోపం కలిగిన పిల్లలకు రూ.8 విలువచేసే పౌష్టిక ఆహారం వితరణ చేస్తారు. గర్భిణులకు కూడా పాలు, గుడ్లు, ఎండుపండ్లు సరఫరా చేస్తారు. తీవ్ర పౌష్టికలోపం కలిగిన పిల్లలకు పౌష్టిక పునర్వసతి కేంద్రాల్లో (ఎన్ఆర్‌సీ) చికిత్స కు అవకాశం ఉన్నప్పటికీ ప్రజలకు తెలియకపోవడం వల్ల అటువైపు చూసేవారు లేరు.



బాల్యాన్ని వెంటాడుతున్న ఆహార లేమి

పౌష్టిక లోపం పెద్ద శాపం

పిల్లలకు పౌష్టికలోపం పెద్ద శాపంగా మారుతుంది. బరువు తక్కువగా ఉండడం వల్ల మానసికంగానూ వికాసం లోపిస్తుంది. అదే వయసులో ఆరోగ్యంగా ఉన్న పిల్లలతో వీరు పోటీ పడలేక భవిష్యత్తులో విద్యా ఉద్యోగ అవకాశాలను కోల్పోతారు. ఇక తీవ్ర పౌష్టికలోపంతో తరచూ జబ్బులకు గురై 5 ఏళ్ల లోపు బాలల్లో మరణాల రేటు ఎక్కువగా ఉంది. రక్తహీనత, ఆయాసం, అనాసక్తి, పదేపదే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. గర్భంలో ఉన్నప్పుడే పౌష్టికాహార కొరత ఏర్పడితే మరిన్ని సమస్యలు చుట్టుముట్టవచ్చు. పిల్లల్లో పౌష్టిక లోపం బారినుంచి తప్పించడానికి ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన పథకాలను పటిష్టంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని, ఇలాంటి పిల్లలపై నిఘా వహించి పౌష్టిక ఆహారం అందిస్తామని రాష్ట్ర మహిళ శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ కేఎస్ అనురాధ తెలిపారు.





అట్టహాసం

మహావీర్ జయంతి ఉత్సవాల సందర్భంగా బెళగావిలో మహిళల బైక్ ర్యాలీ, (కింద) డోళ్లు వాయిస్తున్న యువతులు

జైలుశిక్ష కేసులో ఎమ్మెల్యేకు ఊరట

శివాజీనగర: బోగస్ బిల్లు కేసులో హావేరి బీజేపీ ఎమ్మెల్యే నెహ్రూ ఓలేకార్‌కు ప్రజా ప్రతినిధుల కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్ష తీర్పుపై హైకోర్టు స్టే ఇచ్చింది. జైలుశిక్ష తీర్పు వల్ల ఆయన అనర్హతకు గురయ్యే అవకాశం ఉంది. కోర్టు తీర్పుపై ఎమ్మెల్యే హైకోర్టును ఆశ్రయించగా, న్యాయమూర్తి జస్టిస్ కే నటరాజన్ ధర్మాసనం నిలుపుదల ఆదేశాలను మంజూరు చేసింది. తుది తీర్పును రిజర్వులో ఉంచింది.

ప్రైవేటు వీడియో వైరల్ చేయాలా?

- నటుడు కిచ్చ సుదీప్‌కు బెదిరింపు లేఖలు



శివాజీనగర: బహుభాషా నటుడు కిచ్చ సుదీప్ సీఎం బొమ్మైను కలిసి మద్దతు ప్రకటించిన తరుణంలోనే సుదీప్‌కు రెండు బెదిరింపు లేఖలు రావడం సంచలనం కలిగింది. ఈ లేఖలు ఎవరు రాశారా అని పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఆ లేఖల్లో సుదీప్ ని అసభ్యకరమైన పదజాలంతో దూషించారు. సుదీప్ ప్రైవేట్ వీడియోను సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తామని బెదిరించారు. సుదీప్ నట గౌరవానికి భంగం కలిగించేందుకు చేసిన కుట్ర అని ఆయన మేనేజర్ పుట్టేనహళ్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. కేసు విచారణను సీసీబీ చేపట్టింది.

లేఖలు ఎవరు రాశారో తెలుసు: కిచ్చ

లేఖల వ్యవహారంపై సుదీప్ స్పందిస్తూ గుర్తు తెలియని వ్యక్తుల బెదిరింపులకు భయపడను. ఆ లేఖలకు తగిన సమాధానం చెబుతానని అన్నారు. బెదిరింపు లేఖ రాసినవారు ఎవరనేది నాకు తెలుసు, అయితే వారి గురించి తాను ఇప్పుడు మాట్లాడను, సినీ రంగంలో నేనంటే గిట్టనివారు ఉన్నారు. వారికి అదే రీతిలోనే జవాబు ఇస్తానని చెప్పారు.

బస్సులో రూ. 2 కోట్ల నగదు సీజ్

- బెళగావిలో తనిఖీలు



బుధవారం చిక్కమగళూరులో బలగాల కవాతు



బెళగావిలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ

యశవంతపుర: ఎన్నికల కోడ్‌లో నిర్వహిస్తున్న తనిఖీల్లో రాష్ట్రంలో పలుచోట్ల భారీగా నగదు పట్టుబడింది. బెళగావి జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న రూ. రెండు కోట్ల నగదును హిరేబాగేవాడి టోల్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. ముంబై నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రైవేట్ బస్‌లో బుధవారం తెల్లవారుజామున అధికారులు తనిఖీలు చేయగా ఓ వ్యక్తి బ్యాగులో నగదు దొరికింది. నగదును సీజ్ చేసి విచారణ కోసం ఐటీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

6 రోజుల్లో 47.43 కోట్ల నగదు, సొత్తు స్వాధీనం

రాష్ట్రవ్యాప్తంగా ఆరు రోజుల నుంచి తనిఖీలలో రూ.47 కోట్ల 43 లక్షల 85 వేలు విలువగల నగదు, వస్తుసామగ్రిని తదితరాలను సీజ్ చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. రూ.12.82 కోట్ల నగదు, రూ.16 కోట్లు విలువగల మద్యం, రూ.41 లక్షలు విలువగల మత్తు పదార్థాలు, రూ.6.72 కోట్లు విలువగల బంగారం, రూ.69.98 లక్షలు విలువగల వెండి ఇందులో ఉన్నాయి. 1416 మందిపై కేసులను నమోదు చేశారు. అలాగే 31,486 లైసెన్స్ తుపాకులను పౌరుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

మరోవైపు ఎన్నికల నిర్వహణ కోసం పలు జిల్లాలకు కేంద్ర బలగాలు చేరుకోవడం ఆరంభమైంది. ఇక బెళగావిలో ఈవీఎంల వాడకం గురించి ఎన్నికల సిబ్బంది శిక్షణ నిర్వహించారు.

బస్సులో రూ.11.79 లక్షలు స్వాధీనం

మైసూరు: చాముండేశ్వరి విధానసభ నియోజకవర్గ పరిధిలో రమ్మనహళ్లి చెక్‌పోస్టుల్లో ఆర్టీసీ బస్సులో తనిఖీ చేయగా రూ. 11.79 లక్షల నగదు పట్టుబడింది. హుణసూరు అబ్కారీ శాఖ అధికారులు పది లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పెన్‌డ్రైవ్‌లో పెను విధ్వంస కుట్రలు!



నిందితుడు షారిక్



- అనుమానిత ఉగ్రవాది షారిక్ విచారణ

బనశంకరి: మంగళూరులో సంభవించిన కుక్కర్ బాంబు పేలుడు కేసులో అనుమానిత ఉగ్రవాది షారిక్‌ను ఎన్ఐఏ అధికారులు విచారిస్తుండగా అనేక నిజాలు వెలుగుచూస్తున్నాయి. అతని వద్ద 80 జీబీ పెన్‌డ్రైవ్ లభించింది. అందులో అనేకమంది అనుమానిత ఉగ్రవాదుల రహస్యాలు ఉన్నట్లు తెలిసింది. ఉగ్రవాదాన్ని ప్రేరేపించే వీడియోలు, మత విద్వేషాలకు కుట్రతో పాటు ఎంతో ముఖ్యమైన సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌లో కనిపెట్టారు. షారిక్, మరో అనుమానితుడు మతిన్ ఇద్దరు సమాజంలో శాంతిభద్రతలకు ఎలా విఘాతం కలిగించాలి అనే చర్యలపై వీడియోలను తయారుచేసి అనుచరులకు పంపారు. భారీ విధ్వంసక చర్యలకు పాల్పడాలని కుట్ర పన్నినట్లు తేలింది.

15కు పైగా అగ్నిప్రమాదాలు

శివమొగ్గ జిల్లా తీర్థహళ్లిలో చోటుచేసుకున్న 15 కు పైగా అగ్ని ప్రమాదాలు సహజంగా జరిగినవి కావని, షారిక్ హస్తం ఉందని ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడైంది. శివమొగ్గ తుంగాతీరంలో ప్రయోగాత్మకంగా పేలుడు, అలాగే తీర్థహళ్లిలోనూ పేలుళ్లు జరిపారు.





బుధవారం బెంగళూరు బాలభవన్‌లో ఆటిజం జాగృతి దినం నిర్వహించారు. ఆటిజం బాధిత బాలలను బొమ్మల రైల్లో షికారు తిప్పి, నృత్యాలు చేయించారు

బంగారం గుజిరీలో విక్రయం

- వలస కూలీ అరెస్టు



నిందితుడు సుబ్రతో మండల్



సీసీ కెమెరా ఫుటేజీలో దొంగ సుబ్రతో

కృష్ణరాజపురం: పొట్ట చేత పట్టుకుని బెంగళూరుకు వచ్చిన వలసకూలీ దొంగగా మారాడు. వివరాలు.. సుబ్రతో మండల్ అనే యువకుడు ఆరు నెలల క్రితం పశ్చిమ బెంగాల్ నుంచి నగరానికి వచ్చాడు. కూలీ పనులు చేసుకుంటూ, అక్కడక్కడ ఉన్న పైపులు, ఇనుప సామగ్రి దొంగతనం చేస్తూ వాటిని గుజిరీకి తరలించి అమ్మేవాడు. ఇదే మాదిరిగా ఒక ఇంట్లో ఇనుప సామగ్రిని దొంగతనం చేసేందుకు వెళ్లి ఒక ఇంట్లో డబ్బుతో పాటు బంగారాన్ని ఎత్తుకొచ్చాడు. తాను ఎప్పుడూ పాత సామగ్రి అమ్మే గుజిరీలోనే ఆ బంగారాన్ని అమ్మకానికి పెట్టాడు. ఆ గుజిరీ యజమాని రూ. 7 లక్షల విలువ చేసే 130 గ్రాముల బంగారం తీసుకుని అతనికి రూ.30 వేలు ముట్టజెప్పాడు. కాగా బంగారం పోయిందని బాధితులు యశవంతపుర పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాల ఆధారంగా చోరుణ్ని గుర్తించి అరెస్టు చేశారు.

అయ్యో అన్నదాతలు

- వ్యాన్ బోల్తా పడి ముగ్గురికి తీవ్రగాయాలు



గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు, స్థానికులు

రాయదుర్గం: పగలూ రాత్రి కష్టపడి పంట పండించి, అమ్ముకుని కుటుంబాలను పోషించుకుందామనుకున్న రైతుల ఆశలు కల్లలయ్యాయి. పంట ప్రతిఫలం చేతికందే సమయంలో రోడ్డు ప్రమాదం వెంటాడింది. బళ్లారి–బెంగళూరు హైవేపై డి.హీరేహాళ్ దగ్గర బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారి జిల్లా బెణకల్లుకు చెందిన ముగ్గురు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు, ఎండు మిర్చి పంటను అమ్ముకోవాలని మినీ వ్యాన్‌లో వేసుకుని కర్ణాటకలోని బ్యాడిగి మార్కెట్‌కు బయలుదేరారు. డి.హీరేహాళ్ సమీపానికి వాహనం రాగానే టైర్ పంచర్ కావడంతో వాహనం పల్టీలు కొట్టింది. బస్తాలపై కూర్చున్న ముగ్గురు రైతులు విసిరేసినట్లు పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహకారంతో వారిని బళ్లారి విమ్స్‌కు తరలించారు.

రెండో జాబితాపై హస్తం కసరత్తు

సాక్షి, బెంగళూరు: అసెంబ్లీ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల రెండో జాబితా విడుదలపై ఢిల్లీలోని ఏఐసీసీ పరిశీలన సమితి కసరత్తులు చేస్తోంది. మంగళవరం అర్ధరాత్రి వరకు చర్చించిన సీనియర్ నాయకులు బుధవారం కూడా చర్చలను కొనసాగించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, సిద్ధరామయ్య తదితరులు పాల్గొన్నారు. 124 మంది అభ్యర్థులతో వారం కిందటే తొలి జాబితా విడుదలైంది. ఇంకా 100 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

మద్యం మత్తులో టెక్కీల దాడి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాధితుడు మృతి



మృతుడు లాయిడ్ (ఫైల్)

కృష్ణరాజపురం: సౌండ్ సిస్టమ్ శబ్దాన్ని తగ్గించమన్నందుకు ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఒక వ్యక్తిని దారుణంగా కొట్టారు. ఆ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటన నగరంలో హెచ్ఏఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఏప్రిల్ 2న విజ్ఞాన్ నగరలో అర్ధరాత్రి దాటిన తర్వాత కారులో జోరుగా మ్యూజిక్ శబ్దం పెట్టుకుని కొందరు టెక్కీలు రోడ్డుపైనే ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సమయంలో సౌండ్ తగ్గించమని స్థానికుడు లాయిడ్ నెహెమియా (54) అనే వ్యక్తి వారిని కోరారు, మద్యం మత్తులో ఉన్న ఆ టెక్కీలు మాకే చెబుతావా అంటూ అతడిని ఇష్టానుసారం కొట్టారు. అక్కడి సీసీ కెమెరాలలో ఈ దాడి దృశ్యాలు రికార్డయ్యాయి.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ

తీవ్రంగా గాయపడిన లాయిడ్ ఆస్పత్రిలో చేరగా చికిత్స ఫలించక మంగళవారం రాత్రి కన్ను మూశాడు. కాగా, రామ్ సంపత్‌రాయ్, బసుదేవ్, అభిషేక్‌సింగ్ అనే ఆ ముగ్గురు టెక్కీలు ఈ దాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన లాయిడ్ సోదరిని కూడా కొట్టారు. వీరందరూ లాయిడ్ ఇంటి ఎదుటే నివాసం ఉంటున్నట్లు తెలిసింది. ఆర్మీలో కల్నల్‌గా పని చేసే వ్యక్తి తమ్ముడు లాయిడ్. హెచ్ఏఎల్ పోలీసులు టెక్కీలపై హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా లాయిడ్ ఆస్పత్రిలో చేరగానే అతని తల్లి కూడా తీవ్ర షాక్‌కి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

క్లుప్తంగా

దేశాభివృద్ధికి కాంగ్రెస్ కృషి

గౌరిబిదనూరు: దేశ స్వాతంత్రానికై పాటు పడిన పార్టీ కాంగ్రెస్ పార్టీకి శతాబ్దాల చరిత్ర ఉందని, దేశాభివృద్ధి కోసం పార్టీ చాలా శ్రమించిందని ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శివశంకరరెడ్డి అన్నారు. బుధవారం తాలూకా కడబూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. గత 20 సంవత్సరాలుగా తాలూకాను విద్యాపరంగా, పారిశ్రామికాపరంగా ఎంతో అభివృద్ధి పరిచానని చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం డిసిసి బ్యాంకు నుంచి మహిళా స్వసహాయ సంఘాలకు రుణాలను ఇచ్చినట్లు తెలిపారు. ఈ మధ్యకాలంలో వందలాది మంది ఇతర పార్టీల నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులైన బొమ్మణ్ణ, ప్రకాశరెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిపై చిత్ర ప్రదర్శన



చిత్ర ప్రదర్శనలో సందర్శకులు

బనశంకరి: చిత్రకళాపరిషత్‌లో ప్రకృతిపై సోలో పెయింటింగ్ ప్రదర్శన ఆరంభమైంది. తమిళనాడు కు చెందిన వర్ధమాన కళాకారుడు పీ మేయప్పన్ ప్రకృతిని ఇతివృత్తంగా చేసుకుని గీసిన చిత్రలేఖనాలను ఇక్కడ చూడవచ్చు. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేస్తున్నారని, ప్రకృతికి విఘాతం కలిగిస్తే మానవ మనుగడకే ప్రమాదమని, ప్రకృతిని కాపాడి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిత్రకారుడు తెలిపారు. ప్రదర్శన 9వ తేదీ వరకు నిర్వహిస్తారు.

తాగుబోతు కొడుకు హత్య

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా సుళ్య తాలూకా గుత్తిగారు గ్రామం మొగ్ర ఏరణగుడ్డె వద్ద గౌడపడి కొడుకును తండ్రి హత్య చేశాడు. మంగళవారం అర్ధరాత్రి తండ్రి శీన, కొడుకు శివరామ (35)కి కోడికూర విషయమై రగడ మొదలైంది. శివరామ నిత్యం తాగి వచ్చి తల్లిదండ్రులతో తగాదాలు పడేవాడు. కోడి కూర చేసి పెట్టాలని కొడుకు పట్టుబట్టగా తల్లి కవిత లేదని చెప్పింది. ఇంట్లోని నాటుకోడిని పట్టుకోవడానికి శివరామ ప్రయత్నించగా అది దొరకలేదు. దీంతో ఉన్మాదిగా మారి కేకలు వేయసాగాడు. తండ్రి శీన శివరామపై కట్టెతో తలపై దాడి చేయడంతో గాయపడ్డాడు. ఇరుగుపొరుగు అతన్ని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కేఆర్‌పీపీలోకి వలసలు



లక్ష్మీఅరుణ సమక్షంలో కేఆర్‌పీపీలో చేరిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు

సాక్షి,బళ్లారి: 19వ వార్డుకు చెందిన గోవిందరాజులు, వెంకటేష్, వీరేష్, నవీన్ కుమార్, ఉదయ్ కుమార్, రఘు తదితర కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం సిరుగుప్ప రోడ్డులోని పార్టీ కార్యాలయంలో గోపి, శ్రీధర్ నేతృత్వంలో ఆ పార్టీ నగర అభ్యర్థిని గాలి లక్ష్మీఅరుణ సమక్షంలో కేఆర్‌పీపీలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో తన గెలుపునకు ప్రతి ఒక్కరు సైనికుల్లా కృషి చేయాలన్నారు. 17వ వార్డుకు చెందిన లలితా, సుధా, నందిని, అలివేలు, వరలక్ష్మీ, దివాకర్, యల్లప్ప, అసుండి చందు, శేఖర్ తదితరులు కూడా పార్టీలో చేరారు. నాయకులు ఆలీఖాన్, ఉమారాజ్, సునీల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గేట్ విరిగి పడి బాలుడు దుర్మరణం

హుబ్లీ: హుబ్లీ మంటూరు రోడ్డు గణేష్ కాలనీలోని ఓ ఇంటి ఇనుపగేట్ పట్టుకొని ఆడుతుండగా ఆ గేట్ విరిగిపడి తీవ్రంగా గాయపడి ఓ బాలుడు మృతి చెందాడు. మంటూరు రోడ్డు బ్యాలిప్లాట్ నివాసి మహమ్మద్ అబఖాన్(7) అనే బాలుడు గులాం హుస్సేన్ జంగ్లి ఇంటి గేట్‌ను పట్టుకొని ఆడుతుండగా ఆ గేట్ విరిగి పడింది. దీంతో కింద పడగా అక్కడ ఉన్న షైడ్ బాలుడి తలకు తగలగా తీవ్రంగా గాయపడి బుధవారం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బెణ్ణిగేరి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భద్రతా దళాల కవాతు



కవాతును ప్రారంభిస్తున్న అధికారులు

గంగావతి రూరల్: శాంతిభద్రతల రక్షణ, శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు వీలుగా బుధవారం కొప్పళ నగరంలో భద్రతా దళాలు కవాతు నిర్వహించాయి. జిల్లా కలెక్టర్ ఎం.సుందరేశ్‌బాబు, జెడ్పీ సీఈఓ రాహుల్ రత్న పాండే, జిల్లా ఎస్పీ యశోద ఒంటగోడిల మార్గదర్శనంలో కొప్పళలోని బస్టాండ్ రోడ్డు, అశోక సర్కిల్, జవహర్ రోడ్డు గుండా గడియార స్తంభం, సాలార్‌జంగ్ రోడ్డుతోపాటు ఈశ్వర్ పార్కు వరకు నిర్వహించిన కవాతుతో పారా మిలిటరీ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుమకూరులో..

తుమకూరు: ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా వారిలో ధైర్యాన్ని నింపేందుకు మంగళవారం సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎస్‌బీ బలగాలు శిరాలో కవాతు నిర్వహించాయి. ఈక్రమంలో స్థానికులు పూల దండలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా ఎస్పీ మరియప్ప పాల్గొన్నారు.

దళితుల ఆశాజ్యోతి జగ్జీవన్ రాం



బళ్లారిలో జగ్జీవన్ రాం ప్రతిమకు నివాళి అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



రాయచూరులో బాబూజీ ప్రతిమకు అధికారుల పూలమాలలు



హొసపేటెలో బాబూజీ చిత్రపటానికి పూలమాల వేసిన దృశ్యం

సాక్షి,బళ్లారి: దేశాభివృద్ధికి కృషి చేస్తూ దళితుల ఆశాజ్యోతిగా పేరొందిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రాం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం బాబూ జగ్జీవన్ రాం 116వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని రంగమందిరం సమీపంలో నెలకొల్పిన బాబూ జగ్జీవన్ రాం ప్రతిమకు పలువురు ప్రముఖులు, దళిత సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రముఖులు బీ.ఎన్.పరశురాం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబూజీ ఆశయాలు అనుసరణీయం

రాయచూరు రూరల్: బాబూ జగ్జీవన్ రాం ఆశయాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అన్నారు. బుధవారం బాబూ జగ్జీవన్ రాం సర్కిల్ వద్ద జరిగిన బాబూ జగ్జీవన్‌రాం 116వ జయంతిని పురస్కరించుకొని బాబూజీ ప్రతిమకు పూలమాల వేసి మాట్లాడారు. దేశంలో దళిత, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన మహా నాయకుడు బాబూజీ అన్నారు. స్టేషన్ సర్కిల్‌లో బాబూజీ ప్రతిమకు జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎస్పీ నిఖిల్, సీఈఓ శశికుమార్, నగరసభ కమిషనర్ గురులింగప్ప, మాజీ ఎమ్మెల్యే బోసురాజు పూలమాలలు వేశారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రాం జయంతి

హొసపేటె: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం దేశానికి చేసిన సేవలు మరువలేమని జెడ్పీ సీఈఓ బి.సదాశివ ప్రభు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రాం 116వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రాం సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఏడీసీ అనురాధ, తహసీల్దార్ విశ్వజిత్ మెహత, గ్రేడ్-2 తహసీల్దార్ అమరనాథ్, శిరస్తేదార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రాం సేవలు అపారం

కోలారు: బాబూ జగ్జీవన్ రాం దేశానికి అందించిన సేవలు అపారమని జిల్లా కలెక్టర్ వెంకటరాజ తెలిపారు. బుధవారం చెన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన జగ్జీవన్ రాం జయంతిలో ఆయన మాట్లాడారు. సమాజంలో అస్పృశ్యతను రూపుమాపడానికి జగ్జీవన్ రాం విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల సమాఖ్య ప్రముఖుడు చంద్రశేఖర్, జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్, ఎస్పీ ఎం.నారాయణ, కన్నడ సంస్కృతి శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

డీసీసీ కార్యాలయంలో..

కోలారు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం బాబూజీ జయంతిని సరళంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రాం యువతకు, నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె జయదేవ్, కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు ఊరుబాగిలు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రసాద్‌బాబు, ఉదయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



డీసీసీ కార్యాలయంలో బాబూజీకి నివాళి దృశ్యం

జగ్జీవన్‌రాంకు సీఎం నివాళులు

శివాజీనగర: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ఉపప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా విధానసౌధ ఆవరణలో ఆయన విగ్రహానికి సీఎం బొమ్మై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ల వర్గీకరణను ఆమోదించినందుకు మాదిగ సంఘాల నాయకులు ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సీఎం ఎలాంటి ప్రసంగం చేయకుండా వెళ్లిపోయారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఏ.నారాయణస్వామి, ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి, దళిత నాయకులు డాక్టర్ ఎన్.మూర్తి, అహింద ముత్తురాజ్, ఎంసీ శ్రీనివాస్, జాంభవ సిద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

- కాలువపై ఎమ్మెల్యే కాపు ధ్వజం



హలకుంది వద్ద పట్టుబడిన టిప్పర్ లారీ ఇదే

సాక్షి, బళ్లారి: టీడీపీ నేత కాలువ శ్రీనివాసులు అసత్య ఆరోపణలు చేస్తున్నాడని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. టీడీపీ వారు అక్రమంగా ఇసుక తరలిస్తే, అది తమ అనుచరులు తరలించారని మీడియాకు చెప్పుకుని ప్రచారం చేసుకుంటున్నాడని దుయ్యబట్టారు. ఇటీవల బళ్లారి గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలో ఇసుక తరలిస్తూ కెఎ-35 బీ-4155 అనే నంబరుగల ఒక టిప్పర్ లారీని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ టిప్పర్‌లో రాయదుర్గం నియోజకవర్గం నుంచి బళ్లారికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని కాలువ పత్రికా ప్రకటన చేసి మీడియాను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. ఆ టిప్పర్‌లోని ఇసుక బళ్లారి గుగ్గరహట్టిలోని ప్రదీప్‌కు చెందినదని స్థానిక పోలీసులు తెలిపారు. ఈయన టీడీపీ సానుభూతి పరుడు, కాలువ శ్రీనివాసులకు సన్నిహితుడు అని కూడా తెలుస్తోందని చెప్పారు. ఈ ఘటనపై బళ్లారి గ్రామీణ సీఐ నిరంజన్‌ను వివరణ కోరగా మార్చి 13న ఒక టిప్పర్‌ను పట్టుకుని, డ్రైవర్ తిప్పేస్వామి నాయక్‌ను అరెస్ట్ చేశామని తెలిపారన్నారు. డ్రైవర్ చెప్పిన వివరాల మేరకు కమ్మరచేడు నుంచి ఇసుకను తవ్వి లోడ్ చేసుకుని బళ్లారికి తీసుకు వచ్చారని, రాయదుర్గం నియోజకవర్గం నుంచి కాదని తేలిందన్నారు. టిప్పర్‌లో ఇసుక నింపిన వ్యక్తి ప్రదీప్ అని తెలిసిందని, అతనిని పట్టుకున్న తర్వాత పూర్తి వివరాలు బయటకు వస్తాయన్నారు.

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శిగా శశికళ

రాయచూరు రూరల్: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా శశికళ, రాయచూరు నగర ఎన్నికల ఇన్‌చార్జిగా మంజుల అమరేష్‌ను నియమిస్తూ బుధవారం రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పుష్ప అమర్‌నాథ్ నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే దేవదుర్గకు శ్రీదేవి నాయక్, రాయచూరు గ్రామీణకు శశికళ, నవనీత, మస్కికి ప్రేమలత, సింధనూరుకు శ్రీదేవి, లింగసూగూరుకు అక్కమహదేవి, మాన్వికి ఈరమ్మలను ఎన్నికల ఇన్‌చార్జిలుగా నియమించారు.

అధ్యక్షునిపై సభ్యుల అవిశ్వాసం

కంప్లి: ఎమ్మిగనూరులోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షుడు బీ.మహేష్‌గౌడపై 7 మంది సభ్యులు అవిశ్వాసం ప్రవేశ పెట్టారు. దీనిపై బళ్లారి సహకార సంఘాల సీనియర్ ఇన్‌స్పెక్టర్ రమేష్ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేశారు. సంఘంలోని 11 మందికిగాను ఏడుగురు సభ్యులు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. డైరెక్టర్లు హొసమనె సాయిబణ్ణ, జడేష్‌రెడ్డి, హులుగప్ప, బంకద సిద్దప్ప, గుడదూరు లక్ష్మమ్మ, నెల్లుడి ఖాసింసాబ్, హెచ్.పక్కీరప్ప పాల్గొన్నారు.

కాషాయదళంలోకి చేరిక



ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన పలువురు ప్రముఖులు

సాక్షి,బళ్లారి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం 20వ వార్డుకు చెందిన బలిజ సమాజ ప్రముఖులు రాజేష్, రమేష్ నేతృత్వంలో పలువురు ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కాషాయ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఈసారి కూడా నగర నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తున్నానని, తన గెలుపునకు ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. అనంతరం 20వ వార్డులో ఇంటింటా ప్రచారం చేసి, తనను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డి, బుడా అధ్యక్షుడు మారుతీ ప్రసాద్, కార్పొరేటర్ మోత్కర్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక నాయకుడు కిట్టూ(కృష్ణ) తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను సత్పౌరులుగా తీర్చిదిద్దాలి

రాయచూరు రూరల్: పిల్లలను సత్పౌరులుగా తీర్చిదిద్దాలని సోమవారపేట మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య పేర్కొన్నారు. బుధవారం సోమవారపేట బృహన్మఠంలో జంగమ వటులకు వేద అధ్యయనం, పూజా విధివిధానాలు, రుద్రాభిషేకం, ఆచమనం, చమక చమక, అష్టోత్తరం, పంచామృతాభిషేకం, లింగాష్టకం గురించి వివరించారు. అంతకు ముందు పూర్వ మఠాధిపతి రాచోటి శివాచార్యుల పుణ్యారాధన నెరవేర్చారు. శివయ్య శాస్త్రి, బసవ ప్రభు శాస్త్రి, పాటిల్, షణ్ముకప్ప, నరసణ్ణ, కల్లయ్య, శరణబసవ, విజయకుమార్‌లున్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

బళ్లారిఅర్బన్: రూపనగుడి రోడ్డు గంగప్ప జిన్న సర్కిల్‌లో బుధవారం యశస్విని చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు ప్రతిమా రమేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డాక్టర్ డీఎల్ రమేష్‌గోపాల్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు అత్యవసరం అన్నారు. సొంతా గిరిధర్, ట్రస్ట్ పదాధికారులు ప్రతిమ, శ్రీనివాసులు, రమేష్ శెట్టి, వినోద, జ్యోతి, మమత, శిల్ప, పూజా పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో దుకాణాలు బుగ్గి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న చెన్నకేశవ

గంగావతి రూరల్: నగరంలోని బన్నిగిడ క్యాంపు శివ థియేటర్ సమీపంలోని వీఆర్‌ఎల్ కార్యాలయం పక్కనే ఉన్న పండ్ల దుకాణం, ప్రెస్టీజ్ కంపెనీకి చెందిన దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.కోటి మేర ఆస్తి నష్టం వాటిల్లింది. పండ్ల దుకాణం ఏసీలు, రూ.లక్షల విలువ చేసే పండ్ల షాపుతోపాటు చుట్టుపక్కల ఇళ్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలిసిన వెంటనే జేడీఎస్ టికెట్ ఆకాంక్షి అభ్యర్థి హెచ్.ఆర్. చెన్నకేశవ సందర్శించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన పండ్ల వ్యాపారికి తక్షణం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తాలూకా జేడీఎస్ అధ్యక్షులు షేక్‌నబీ సాబ్, మహబూబ్ సాబ్, మునియప్ప ఉప్పారు, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

శరణుల వచనాలు సమాజానికి మార్గదర్శకాలు

కంప్లి: శరణుల వచనాలు సమ సమాజ నిర్మాణానికి మార్గదర్శకాలని హెబ్బాళ మఠాధిపతి నాగభూషణ శివాచార్యులు తెలిపారు. పట్టణంలో అక్కమహదేవి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, నాటక కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎమ్మిగనూరు కేఆర్‌ఎస్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు డాక్టర్ సావిత్రి రాజశేఖర్ మాట్లాడుతూ పిల్లలకు శరణుల వచనాల ప్రాముఖ్యతను వివరించాలన్నారు. మండలి అధ్యక్షులు ముక్కుంది శివగంగమ్మ, హొసపేటె విజయనగర కళాశాల ఉపన్యాసకులు డాక్టర్ మృత్యుంజయ రుమాలె, మున్సిపల్ అధ్యక్షురాలు శాంతలా, వీరశైవ సంఘం అధ్యక్షులు మూకయ్యస్వామి, ప్రముఖులు హేమయ్యస్వామి, అరవి బసవనగౌడ పాల్గొన్నారు. అనంతరం అక్కమహాదేవి జీవిత చరిత్రపై నాటకాన్ని ప్రదర్శించారు.

అన్నసంతర్పణ

సిరుగుప్ప: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని కంచన్‌ధామ్‌లో మహావీర జయంతి సందర్భంగా కుంతునాథ్ సంఘం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. జైన్ సంఘం ప్రముఖులు అశోక్ జైన్ మాట్లాడుతూ మహావీరుని ఆదర్శాలను అలవర్చుకోవాలన్నారు. అంతకు ముందు కుంతునాథ్ జైన్ ఆలయంలో కుంతునాథ్‌స్వామికి క్షీరాభిషేకం, వివిధ ఆభరణాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కిరణ్‌కుమార్ జైన్, నగరసభ సభ్యుడు విక్రమ్‌జైన్, సుభాష్‌జైన్, సంతోష్‌జైన్, మాన్మల్‌జైన్, రిషబ్, హర్షద్‌జైన్, ప్రదీప్‌జైన్, పద్మా జైన్, ముక్తిజైన్, శివానిజైన్, డాక్టర్ రక్షితాజైన్, రాజీజైన్, కుశాల్ జైన్, సంజయ్‌జైన్, శివప్ప పాల్గొన్నారు.

క్యాంటర్ వాహనం దగ్ధం



కాలిపోతున్న క్యాంటర్

యశవంతపుర: ధార్వాడ నుంచి బెళగావికి వాషింగ్ మిషన్ల లోడుతో వెళ్తున్న క్యాంటర్ వాహనం బుధవారం బెళగావి జిల్లా హిరేబాగేవాడి సమీపంలోని కెకె కొప్ప క్రాస్ వద్ద దగ్ధమైంది. చలనంలో ఉండగా మంటలు చెలరేగడంతో వాహనాన్ని రోడ్డు పక్కలో ఆపి డ్రైవర్, క్లీనర్ కిందకు దిగారు. తక్షణమే మంటలు వేగంగా వ్యాపించి వాహనం కాలిబూడిదైంది.

కోలారు వార్తలు...

పార్టీలో ఎలాంటి గందరగోళం లేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరాజులు

కోలారు: జిల్లా జేడీఎస్‌లో ఎలాంటి గ్రూపులు లేవని, చిన్నచిన్న సమస్యలు ఉంటే వాటిని తమలోనే పరిష్కరించుకుంటున్నామని ఎమ్మెల్సీ ఇంచర గోవింద రాజులు తెలిపారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాలూకా అధ్యక్షురాలు కుర్కి రాజేశ్వరి నివాసానికి తాను, అభ్యర్థి శ్రీనాథ్, జిల్లా అధ్యక్షుడు నటరాజ్‌లు వెళ్లి చర్చలు జరిపామన్నారు. శ్రీనివాసపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే వారిని పిలిపించి మాట్లాడారని తెలిసిందన్నారు. అనంతరం తాలూకా అధ్యక్షురాలు కుర్కి రాజేశ్వరి గందరగోళానికి గురై అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. తాలూకా అధ్యక్షురాలు రాజేశ్వరి తమతోనే ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. జేడీఎస్ అధికారంలోకి వస్తే ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లుగా అన్ని హామీలను నెరవేరుస్తారన్నారు. పార్టీ అధినాయకుడు కుమారస్వామి ఈ నెల 10న ముళబాగిలు, శ్రీనివాసపురల్లో పర్యటించి బృహత్ సమావేశాల్లో పాల్గొంటారన్నారు. జిల్లా అధ్యక్షుడు బణకనహళ్లి నటరాజ్, జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో అగ్నిప్రమాదం



దగ్ధమైన ఇంటి వద్ద ఫైర్ సిబ్బంది

పావగడ: తుమకూరు జిల్లా పావగడ తాలూకాలోని శ్రీరంగపురం తాండాలో బుధవారం ఉదయం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయింది. ఇంటిలోని బియ్యం, రాగుల బస్తాలు, దుస్తులు, మంచాలు, వంట సామాగ్రి మొత్తం కాలిపోయాయని బాధితుడు భీమ్లానాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఉదయం ఇంటి వద్ద పిల్లల్ని ఉంచి కూలి పనులకు వెళ్లామన్నారు. ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో విద్యుత్ వైర్లలో మంటలు రేగి ఇల్లు కాలి పోయిందన్నాడు. ఆ సమయంలో పిల్లలు ఆడుకోడానికి బయటకు వెళ్ళడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వాళ్లు ఫైర్ సిబ్బందికి ఫోన్‌చేయగా, ఫైరింజన్‌తో వచ్చి మంటల్ని ఆర్పేశారు. అంతలోపే ఇంట్లోని సామగ్రి మొత్తం బూడిదగా మారింది. రెవెన్యూ అధికారులు పరిశీలించి నష్టం వివరాలు రాసుకున్నారు.

14న మద్యం, మాంసం దుకాణాలు బంద్ చేయించండి

కేజీఎఫ్: స్వాతంత్ర్య దినోత్సవం, గణరాజ్యోత్సవం, గాంధీ జయంతి నాడు దేశ వ్యాప్తంగా మాంసం, మద్యం దుకాణాలను మూసేసినట్లుగానే అంబేడ్కర్ జయంతి నాడు కూడా మాంసం, మద్యం దుకాణాలను మూసివేయించాలని డీఎస్‌ఎస్ నాయకుడు ఏపీఎల్ రంగనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతిపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వెలువడినందున అంబేడ్కర్ జయంతిని తాలూకా కార్యాలయంలోనే అన్ని శాఖల అధికారులు కలిసి సరళంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళిత క్రియా సమితి రమేష్, పిచ్చళ్లి మంజు, లక్ష్మయ్య, బబ్లు, సంతోష్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



మాట్లాడుతున్న ముఖ్యాధికారి సత్యనారాయణ

శ్రీనివాసపురం: ఓటు వజ్రాయుధం అని పురసభ ముఖ్యాధికారి వైఎస్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం పట్టణంలో పురసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు జాగృతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించినప్పుడే ప్రజాప్రభుత్వ వ్యవస్థ బలపడుతుందన్నారు. హెల్త్ సూపర్ వైజర్ కేజీ రమేష్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఎన్ శంకర్ పాల్గొన్నారు.

నేడు విరుపాక్షేశ్వర బ్రహ్మరథోత్సవం



విరుపాక్షేశ్వర స్వామి మూలవిరాట్

హొసపేటె: హంపీ విరుపాక్షేశ్వర స్వామి, చంద్రమౌళేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం గురువారం సాయంత్రం 4.45 గంటలకు జరుగనుంది. రథోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మరథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు తగిన వ్యవస్థను కల్పించినట్లు ఆలయం కమిటీ సభ్యులు తెలిపారు.

బైక్‌ను టిప్పర్ ఢీకొని యువతి మృతి

హుబ్లీ: నగరంలో బైక్‌ను టిప్పర్ లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఓ యువతి మృతి చెందింది. వివరాలు.. అమరగోళ ఆశ్రయ కాలనీ నివాసి గంగవ్వ(23) అనే యువతి బైక్‌పై వెళుతుండగా హుబ్లీ- ధార్వాడ ప్రధాన రహదారిలో అమరగోళ ఏపీఎంసీ వద్ద పెట్రోల్ బంక్ వద్ద ధార్వాడ నుంచి హుబ్లీ వైపు వేగంగా వెళుతున్న టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో యువతి తీవ్రంగా గాయపడి ఘటన స్థలంలోనే మృతి చెందింది. టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. ఉత్తర ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పొలంలో నవజాత శిశువు

బనశంకరి: తల్లిగర్భం నుంచి బయట పడిన శిశువు పొలం పాలైంది. ఈ అమానుష ఘటన ఆనేకల్ తాలూకా హుల్లహళ్లిలో వెలుగు చూసింది. హుల్లహళ్లి సిద్ధలింగారెడ్డి పొలంలో మంగళవారం ఉదయం పసికందు ఏడుపు వినిపించగా స్థానికులు వెళ్లి పరిశీలించగా మగబిడ్డ కనిపించింది. అక్కున చేర్చుకొని బన్నేరుఘట్ట పోలీసులకు సమాచారం అందించారు. శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి కవిత, ఎస్ఐ ఉమామహేశ్ చేరుకుని పసికందును స్వాధీనం చేసుకొని జిగణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వాణీ విలాస్‌ఆసుపత్రికి తరలించారు.

వీబీటీఎం క్యాంపస్ ఇంటర్వ్యూలు



క్యాంపస్ సెలెక్షన్‌కు హాజరైన యువతీ యువకులు

కంప్లి: నిరుద్యోగ యువత క్యాంపస్ ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలని వీబీటీఎం ప్రిన్సిపల్ కృష్ణవైద్య తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో సంస్థ ఏర్పాటు చేసిన క్యాంపస్ సెలెక్షన్‌కు హాజరైన యువతీ యువకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వంద మంది ఉద్యోగ ఆకాంక్షులు హాజరు కాగా వారిలో 40 మంది ఎంపికయ్యారు. బళ్లారి ఐసీఐసీఐ బ్యాంక్ హెచ్‌ఆర్ ప్రముఖులు హనుమనగౌడ, వలయ వ్యవస్థాపకులు శ్రీనిధి, ఆయోజకులు సంధ్యా విప్రిద్, దర్శన్, ప్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అశ్వవాహనోత్సవం



మాలూరు: చిక్కతిరుపతిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో బ్రహ్మరథోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి అశ్వవాహనోత్సవ సేవలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రవి, ఎస్.శ్రీధర్ నేతృత్వంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని అశ్వవాహనంలో ఉంచి సాంప్రదాయబద్ధంగా ఊరేగించారు. భక్తుల గోవిందనామ స్మరణ మధ్య అశ్వవాహనోత్సవం సాగింది. ఊరేగింపు రాత్రి 12 గంటలకు ముగిసింది.

పలువురికి జేడీఎస్ తీర్థం



శ్రీనివాసపురం: గుడిపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలు మూకుమ్మడిగా ఆ పార్టీని వీడి జేడీఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జేడీఎస్ అభ్యర్థి వెంకటశివారెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నా లేకున్నా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించానన్నారు. తమ పార్టీ పంచరత్న పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ సౌకర్యాలను అందిస్తోందన్నారు. జిల్లాకు శాశ్వత నీటిపారుదల సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తేవడానికి ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా 40 కుటుంబాలు కాంగ్రెస్ నుంచి జేడీఎస్ పార్టీలో చేరాయి.

అంగన్‌వాడీ వేళలు మార్చరూ

రాయచూరు రూరల్: జిల్లాలో ఎండలు తీవ్రంగా ఉన్నందున అంగన్‌వాడీ కేంద్రాల పని వేళలను మార్చాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి కార్యాలయం వద్ద జిల్లాధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత 40 డిగ్రీలను దాటుతుందన్నారు. అందువల్ల అంగన్‌వాడీ కేంద్రాల పనివేళలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మార్చాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

క్లుప్తంగా

గుంతలో పడి వ్యక్తి మృతి

దొడ్డబళ్లాపురం: ప్రమాదవశాత్తు వ్యవసాయ గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన దొడ్డ తాలూకా దొడ్డబెళవంగల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జ్యోతిపుర గ్రామానికి చెందిన రాజేశ్(27) మోటర్‌ను రిపేరీ చేస్తూ కాలుజారి పక్కనే ఉన్న నీటి గుంతలో పడి మృతిచెందాడు. అగ్నిమాపకదళం సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు. దొడ్డబెళవంగల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

లోకాయుక్త అధికారినంటూ బ్లాక్‌మెయిల్

శివమొగ్గ: లోకాయుక్త అధికారినంటూ ఒక అధికారికి ఫోన్ కాల్ చేసి లక్షలాది రూపాయలు డిమాండ్‌చేసిన వంచకుడి ఉదంతంపై భద్రావతి హళేనగర పోలీసు స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని భద్రావతి శిశు యోజనాభివృద్ధి అధికారి (సీడీపీవో) సురేశ్ మొబైల్‌కు ఒక వ్యక్తి కాల్ చేసి తాను శివమొగ్గ లోకాయుక్త ఎస్సై అని పరిచయం చేసుకున్నాడు. అంగన్‌వాడీ ఆహార పంపిణీ విషయంలో మీపై ఆరోపణలు వచ్చాయని, కేసు నమోదైందని చెప్పాడు. బెంగళూరు నుంచి విచారణాధికారులు వచ్చారని, నిన్ను కాపాడాలంటే రూ.1.20 లక్షలు గూగుల్ పే చేయాలని బెదిరించాడు. దీంతో సురేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నిందితుల అరెస్ట్

దొడ్డబళ్లాపురం: మండ్యకు చెందిన ట్రక్ డ్రైవర్ ఇద్రిస్ బాషా మృతి కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు పునీత్ కెరెహళ్లి, మరో నలుగురు నిందితులను పోలీసులు రాజస్థాన్‌లో అరెస్టు చేశారు. నిందితులను అరెస్టు చేయడంలో ఆలస్యం కావడంతో విపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. దీంతో కేసును సీరియస్‌గా తీసుకున్న రామనగర జిల్లా ఎస్పీ కార్తిక్‌రెడ్డి.. నాలుగు బృందాలను ఏర్పాటుచేసి నిందితులను అరెస్ట్ చేశారు.

8న 'రన్ విత్ జీసస్ క్రైస్ట్'

శివాజీనగర: గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ మధ్యలో శనివారం రోజున క్రైస్తవులు రన్ ఫర్ జీసస్, రన్ విత్ జీసస్ క్రైస్ట్ కార్యక్రమాలు చేపట్టి ఆధ్యాత్మికంగా బలోపేతం అవుతున్నారు. అందులో భాగంగా ఈనెల 8న ఇండియన్ యునైటెడ్ క్రిస్టియన్ ఫెడరేషన్, బెంగళూరు వివిధ చర్చీల సహకారంతో బెంగళూరులోని ఆవలహళ్లిలో 4వ సంవత్సరపు రన్ విత్ జీసస్ క్రైస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ ఫెడరేషన్ ప్రతినిధులు బుధవారం తెలిపారు. ఆవలహళ్లి పాత మద్రాస్ రోడ్డులో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అరవింద లింబావళి ప్రారంభిస్తారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే పరుగు కార్యక్రమం రామపురం, బిదరి మీదుగా ఆవలహళ్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణంలోకి చేరుకొని ప్రార్థనతో ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

జగ్జీవన్‌రామ్‌తో దళితులకు సామాజిక న్యాయం


బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తుమకూరు: సామాజిక న్యాయం కోసం పోరాడిన ధీశాలి మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం అని జిల్లాధికారి వైఎస్ పాటిల్ అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో బుధవార జగ్జీవన్ రామ్ జయంతిని సరళంగా నిర్వహించారు. కలెక్టర్ హాజరై జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పించిమాట్లాడారు. దళితులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని ధారపోసిన మహా వ్యక్తి అని కొనియాడారు.

మైసూరు: మైసూరు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నగర రైల్వే స్టేషన్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లాధికారి డాక్టర్ కేవీ రాజేంద్ర పుష్పాంజలి ఘటించారు. పాలికె మేయర్ లక్ష్మీకాంత్ రెడ్డి, సీఈవో కేఎం గాయత్రి, నగర పోలీసు కమిషనర్ రమేశ్ బానోత్, ఎస్పీ సీమా లాట్కర్ తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ అభ్యర్థిపై కేసు

దొడ్డబళ్లాపురం: ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేశారనే ఆరోపణలపై దొడ్డబళ్లాపురం జేడీఎస్ అభ్యర్థి మునేగౌడతోపాటు మరో నలుగురిపై ఎన్నికల అధికారులు కేసు నమోదుచేశారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం దొడ్డ తాలూకా మధురనహొసహళ్లి వద్ద కార్యాచరణ జరుపుతుండగా వికాస్, జయంత్, నాగరాజు అనే వ్యక్తుల వద్ద రూ.9వేల విలువైన జేడీఎస్ సింబల్, జేడీఎస్ అభ్యర్థి మునేగౌడ ఫోటో ఉన్న హ్యాండ్ బిల్లులు, పాకెట్ క్యాలెండర్లు లభించాయి.

తుమకూరులో ఐటీ దాడులు..

తుమకూరు: ఐటీ శాఖ, ఎన్నికల అధికారులు సోదాలు చేశారు. బుధవారం బెంగళూరు నుంచి మూడు వాహనాల్లో వచ్చిన 8 మందికి పైగా అధికారుల తుమకూరు నగరంలో ఒక ఇంటిపై అధికారులు ఆడిచేసి నగదు, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బీహెచ్ రోడ్డులో ఉన్న మనోజ్ టైమ్ జోన్, సెల్యూలార్ పాయింట్, మొబైల్ దుకాణం, గాంధీనగరలోని నిర్మాణంలో ఉన్న భవనంలో 9గంటలపాటు సోదాలు చేశారు.

కాంగ్రెస్ నేత ఇంటిలో..

బనశంకరి: నగరంలో నివాసం ఉంటున్న కాంగ్రెస్ టికెట్ రేసులో ఉన్న ఒక కాంగ్రెస్ నేత ఇంటిపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడిచేసి పలు ఫైళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ దాడులను సదరు నేత ఖండించారు. సోదాలు జరగలేదన్నారు.

పూల కరగకు విశేష పూజలు


పూల కరగకు పూజలు


కరగతో పూజారి జ్ఞానేంద్ర

- నేటి అర్ధరాత్రి నుంచి ఊరేగింపు

బనశంకరి: చారిత్రక ప్రసిద్ధి గాంచిన బెంగళూరు ధర్మరాయస్వామి కరగ మహోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు సాగుతున్నాయి. చైత్రమాసం పౌర్ణమి గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు తిగళరపేటే ధర్మరాయ స్వామి ఆలయం నుంచి పూల కరగ ఊరేగింపు అరంభమవుతుంది. బుధవారం సాయంత్రం నుంచి భక్తులు ధర్మరాయస్వామి ఆలయానికి వచ్చి పూల కరగకు పూజలు చేశారు. దేవస్థానం ప్రాకారం , రాజవీధుల్లో విద్యుత్ అలంకరణ చేశారు. పూల కరగ బయలుదేరే సమయంలో భక్తులు మల్లెపూలు చల్లి భక్తిబావం చాటుకుంటారు.

మత సామరస్యానికి నిదర్శనం..

కరగ ఉత్సవం శాంతి సామరస్యానికి ప్రతీక. కరగ ఉత్సవం రోజు అర్ధరాత్రి అక్కిపేటే మస్తాన్ సాహెబ్ దర్గాలో పూజలు నిర్వహిస్తారు. ఎలాంటి మత భేదం లేకుండా హిందూ ముస్లింలు ఉత్సవంలో పాల్గొంటారు. పూల కరగ ఊరేగింపు తిగళరపేటే ధర్మరాయదేవస్థానం నుంచి బయలుదేరి హలసూరు ఆంజనేయస్వామి,శ్రీరామదేవాలయ, ప్రసన్నగంగాధరేశ్వరస్వామి దేవస్థానాల్లో పూజలు స్వీకరిస్తారు. కరగ పూజారి జ్ఞానేంద్ర వీరకుమారులతో కలిసి ధర్మరాయ దేవస్థానం నుంచి బయలుదేరి కబ్బన్‌పార్కులోని కరగకుంట వెళ్లి కరగకు పూజలు నిర్వహించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు.

నోరూరించే హలీం రెడీ


హలీం తయారు చేస్తున్న వంటమాస్టర్లు


హలీం

- నగరంలో విక్రయాలు

శివాజీనగర: రంజాన్ పవిత్ర మాసం ప్రారంభం కాగానే హలీం వంటకం స్ఫురణకు వస్తుంది. సాయంత్రం ఉపవాసం విడిచాక హలీంను ఆరగించడం చాలామందికి ఇష్టం. ధర ఎక్కువగా ఉండడం వల్ల నిత్యం కాకపోయినా అప్పుడప్పుడు ఆరగిస్తామని కొందరు తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాదీ హలీం బెంగళూరులోనూ లభ్యమవుతోంది. సుమారు 50 చోట్ల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసి నోరూరించే హలీం అందజేస్తున్నారు.

స్వచ్ఛమైన దినుసులతో..

హలీం తయారీకి మటన్, స్వచ్ఛమైన నెయ్యి, వెన్న, గోధుమలు, జీడిపప్పు, బాదం, పిస్తా, షాజీరా, యాలకులతో, ఉల్లిపాయలు, పుదీనా, కొత్తిమీర వంట 30 రకాల వివిధ రుచికరమైన వంట పదార్థాలు వాడుతామని నిర్వాహకులు తెలిపారు. బెంగళూరులో శివాజీనగర, ఫ్రేజర్‌టౌన్, కోరమంగల, మారతహళ్లి, సంజయ్ నగర తదితర ప్రాంతాల్లో హలీం సెంటర్లు వెలిశాయి. ఈ సెంటర్లలో హలీంతో పాటుగా హైదరాబాద్ దమ్ మటన్, చికెన్ బిరియానీలను కూడా విక్రయిస్తున్నారు.

ఈతకు వెళ్లి యువకుల జల సమాధి


రాజు, విజయ్ (ఫైల్)

యశవంతపుర: చెరువులో ఈతకు వెళ్లిన ఇద్దరు యువకులు జల సమాధి అయ్యారు. ఈ ఘటన దావణగెరె జిల్లా జగళూరు తాలూకా చిక్కమల్లనహొళెలో జరిగింది. గ్రామానికి చెందిన విజయ్(21) గొర్రెల కాపరిగా ఉన్నాడు.వరుసకు సోదరుడైన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా ఆలూరుకు చెందిన రాజు(19) పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సెలవు కావడంతో రాజు చిక్కమల్లనహొళెకు వచ్చాడు. వీరిద్దరూ బుధవారం గ్రామ సమీపంలోని చెరువు సమీపంలోకి గొర్రెలను తీసుకెళ్లారు. సరదాగా ఈత కొట్టేందుకు చెరువులోకి దిగి మధ్యలోకి వెళ్లి అడుగున ఉన్న గుంతలో కూరుకుపోయి మృతి చెందారు. జగళూరు పోలీసులు మృతదేహాలను వెలికితీసి ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

దంపతుల అనుమానాస్పద మృతి




ఆత్మహత్యకు పాల్పడిన వెంకటేష్ , రక్త గాయాలతో రాధమ్మ మృతదేహం, రాధమ్మ(ఫైల్)

మడకశిర రూరల్: దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. భర్త ఉరి వేసుకున్న ప్రాంతంలోనే రక్తపు గాయాలతో భార్య మృతదేహం లభ్యం కావడంతో ఇరువైపులా కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వివరాలు.. మడకశిర మండలం ఎగువ రామగిరి గ్రామానికి చెందిన చింతగుట్లప్ప, నింకమ్మ దంపతుల కుమారుడు వెంకటేష్ (42)కు 14 ఏళ్ల క్రితం కర్ణాటకలోని పావగడ తాలూకా ఈర్లగొంది గ్రామానికి చెందిన బొమ్మక్క కుమార్తె రాధమ్మ (35)తో వివాహమైంది. వీరికి 12 ఏళ్ల వయసున్న కుమార్తె ఉంది. పరిగిలోని గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికురాలిగా రాధమ్మ పనిచేస్తోంది. మంగళవారం అర్ధరాత్రి గ్రామ శివారులోని రోడ్డు పక్కన చెట్టుకు వెంకటేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ పక్కనే రాధమ్మ రక్తగాయాలతో విగతజీవిగా పడి ఉంది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన వారు మృతదేహాలను గమనించి, సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతం నిండిపోయింది. భార్యను హత్య చేసి, అనంతరం వెంకటేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. సమాచారం అందుకున్న సీఐ సురేష్‌బాబు, ఎస్ఐ నాగేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. ద్విచక్రవాహనం, కట్టె, తాడు స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను వెంకటేష్ హతమార్చి ఉంటాడనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేశారు.


రోదిస్తున్న మృతురాలి బంధువు

పథకం ప్రకారమే.. : ఘటనపై రాధమ్మ తల్లి బొమ్మక్క మాట్లాడుతూ.. పథకం ప్రకారమే తన కుమార్తెను అల్లుడు హతమార్చాడని, అనంతరం పోలీసులకు భయపడి ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించింది. మంగళవారం రాత్రి ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కుమార్తెను గ్రామ శివారులోకి పిలుచుకెళ్లి, కట్టెతో కొట్టి హతమార్చినాడని బోరున విలపించింది. గ్రామంలో ఈ నెల 10న జాతర ఉందని, ఖర్చులకు డబ్బు కావాలంటే కొంత మొత్తాన్ని కూడా ఇచ్చినట్లు గుర్తు చేసింది. గతంలోనూ కుమార్తెను వేధిస్తుండడంతో పావగడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పట్లో స్టేషన్‌లో రాజీ చేశారని, అయినా అల్లుడిలో మార్పు రాలేదని పేర్కొంది. రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని కుమార్తెతో గొడవపడేవాడని, ఈ క్రమంలోనే భార్యను పథకం ప్రకారమే వెంకటేష్ హతమార్చి, ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఓటు హక్కుపై ర్యాలీ



శిడ్లఘట్ట: ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని టీపీ ఈఓ, స్వీప్ సమితి అధ్యక్షుడు మునిరాజు పిలుపునిచ్చారు. ఓటు హక్కుపై ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని బుధవారం ఆయన స్థానిక నెహ్రూ మైదానం వద్ద ప్రారంభించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

దొడ్డబళ్లాపురం: అతి వేగం తదితర కారణాలు యమగండాలుగా మారి వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. బెంగళూరుకు చెందిన గిరీష్(22),యశ్వంత్(23) బెంగళూరు మాకళి వద్ద ఉన్న ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. మాగడి తాలూకాలోని హెబ్బళలు గ్రామంలో జాతర చూసుకుని బెంగళూరు వస్తుండగా మార్గం మధ్యలో సూరప్పనహళ్లి సమీపంలో 75వ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. కుదూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ను కారు ఢీకొని..

మరో ప్రమాదంలో నెలమంగల తాలూకా బసవనహళ్లి గ్రామానికి చెందిన శ్రీనాథ్(49) మృతి చెందాడు. కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఈయన బైక్‌పై వెళ్తుండగా అరిశినకుంటె వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ శ్రీనాథ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నెలమంగల ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని..

దొడ్డ తాలూకా తళగవార గ్రామానికి చెందిన టీజీ మంజునాథ్(54) బైక్‌పై లింగనహళ్లికి వెళ్లి తిరిగివస్తుండగా రాజఘట్ట చెరువు వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. కిందపడ్డ మంజునాథ్‌పై లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దొడ్డ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపు తప్పి....

యశవంతపుర: తలఘట్టపుర ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కెంగేరి నివాసి శ్రీనివాసమూర్తి(39) మృతి చెందాడు. కారు డ్రైవర్‌గా షోరూంలో పని చేస్తున్న ఈయన మంగళవారం రాత్రి బైకులో ఇంటికి వెళ్తుండగా కరిష్మా హిల్ వద్ద అదుపుతప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

వంద స్థానాల్లో ఆర్‌పీఐ (బీ) పోటీ

శివాజీనగర: ఆర్‌పీఐ(బీ) 'రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బీ) అభ్యర్థుల తొలి జాబితాను బుధవారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మూర్తి విడుదల చేశారు. వంద స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశామని పేర్కొన్నారు. తొలి జాబితాలో కొందరి పేర్లు ప్రకటించారు. తురువెకెరె-ఎన్.అట్టియ్య, కుష్టిగి-గవిసిద్దనగౌడ చెన్ననగౌడ మాలిపాటిల్, యలబుర్గ-రామలింగప్ప, కనకగిరి-డాక్టర్ బీ.జ్ఞానసుందర, గంగావతి-పద్మావతి, హగరిబొమ్మనహళ్లి-జీ.నందకుమార్, రాయచూరు నగర-శాంతప్ప చిత్రాలి, రాయచూరు గ్రామీణ- రవికుమార్ నాయక గోనాళ, మాన్వి-వీరేశ్ నాయక నీరమానవి, మస్కి-ఎస్.మారుతి నాయక, లింగసూగూరు-బసవరాజ కుణికల్లూరు, సింధనూరు -బసవరాజ సింధనూరులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

దంపతులపై పిడుగు..భర్త మృతి


వెంకటేశ్ మృతదేహం

బాగేపల్లి: దంపతులపై పిడుగుపడి భర్త మరణించగా భార్య తీవ్రంగా గాయపడింది. బాగేపల్లి తాలూకా మిట్టేమరి హోబళి కనంపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. పొలంలో ఉన్న దంపతులు వెంకటేశ్, ఆదిలక్ష్మమ్మ ప్లాస్టిక్ షీట్ కిందకు వెళ్లారు. ఇదే సమయంలో పిడుగు పడటంతో వెంకటేశ్ మరణించగా ఆదిలక్ష్మమ్మ స్పృహ తప్పింది. పక్కనే ఉన్న బీన్స్ కుప్పకు కూడా మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు ఇద్దరిని మంటల నుంచి బయట పడేశారు. ఆ తర్వాత గాయపడిన ఆదిలక్ష్మమ్మను ఆస్పత్రికి తరలించారు.

నన్ను ఓడించడం ఎవరి తరం కాదు

బాగేపల్లి: దేవుని అనుగ్రహం, ప్రజల ఆశీర్వాదం వల్ల తనను ఎన్నికల్లో ఓడించడం ఎవరి వల్ల కాలేదని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి అన్నారు. బాగేపల్లి నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించి అధికారంలోకి వస్తుందని చెప్పారు. మిట్టేమరి సభాంగణంలో కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బాగేపల్లి ప్రజలు తనపైనమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపిస్తున్నారన్నారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పనులు చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసినట్లు చెప్పారు.

తనిఖీలు ముమ్మరం చేయండి

శివమొగ్గ: అక్రమ మద్యం రవాణాను నివారించేందుకు చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని అధికారులకు జిల్లాధికారి డాక్టర్ సెల్వమణి సూచించారు. నియోజకవర్గాల ఎంసీసీ నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

హోసూరు వార్తలు..

లారీని కొనలేక డ్రైవర్ ఆత్మహత్య

హోసూరు: లారీ కొనుక్కొనేందుకు డబ్బు సర్దుబాటు కాకపోవడంతో బాధపడి లారీ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మత్తూరు వద్ద జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా మత్తూరు సమీపంలోని కొడమాన్‌పట్టి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ శంకర్ (45) సొంతంగా లారీ కొనాలని తీర్మానించుకొన్నాడు. లారీ కొనుగోలుకు సరిపడా డబ్బును పోగుచేసుకోలేకపోయాడు. ఎప్పటికీ లారీ యజమానిని కాలేనని విరక్తి చెందిన శంకర్ మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. మత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో మహిళ...

క్రిష్ణగిరి: కుటుంబ కలహాలు మహిళ ప్రాణాల్ని తీశాయి. ఈ ఘటన వేపనపల్లి వద్ద చోటుచేసుకొంది. వివరాల మేరకు వేపనపల్లి సమీపంలోని గంగమడుగుకు చెందిన తిమ్మరాజ్ భార్య దేవమ్మ (22), ఈ దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. మంగళవారం రాత్రి ఏర్పడిన గొడవల్లో జీవితంపై విరక్తి చెందిన దేవమ్మ అదే ప్రాంతంలోని ఒక పొలంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకొంది. వేపనపల్లి పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

భర్త నిర్లక్ష్యం.. భార్య బలవన్మరణం

హోసూరు: కుటుంబ ఖర్చులకు భర్త డబ్బులివ్వకపోవడంతో మహిళ ప్రాణాలు తీసుకుంది. వివరాల మేరకు ధర్మపురి జిల్లా పెన్నాగరం సమీపంలోని ఓట్టుమలై గ్రామానికి చెందిన పెరుమాళ్ కూతురు అభి(23) కి క్రిష్ణగిరి జిల్లా బర్గూరు సమీపంలోని సెందారపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసన్‌తో ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గత కొద్ది నెలలుగా కుటుంబ పోషణకు డబ్బులివ్వకుండా నిర్లక్ష్యంగా తిరిగేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అభి మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. బర్గూరు పోలీసులు చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. పెళ్లి జరిగి ఐదేళ్లు మాత్రమే కావడంతో కేసును క్రిష్ణగిరి సబ్ కలెక్టర్ బాబు విచారణ చేపట్టారు.

గెలుపుకోసం అగ్నిగుండం ప్రవేశం


నిప్పుకణికల్లో నడుస్తున్న మాజీ మంత్రి మల్లికార్జున్

యశవంతపుర: విధానసభ ఎన్నికల్లో గెలుపు సాధించాలంటూ రాజకీయ నేతలు ఆలయాలకు వెళ్లి పూజలు చేస్తున్నారు. ఈక్రమంలో దావణగెరెలో మాజీ మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ బుధవారం హళేపేటలోని వీరభద్రేశ్వర సన్నిధిలో అగ్నిగుండ ప్రవేశం చేశారు. తొలుత భార్య, కుమారుడితో కలసి ఆలయంలో పూజలు చేశారు. తర్వాత కుమారుడితో కలిసి నిప్పుల్లో నడిచారు.

ఆకతాయికి దేహశుద్ధి


పోలీసులకు అప్పగించిన దృశ్యం

యశవంతపుర: విద్యార్థినిని వేధించిన రోడ్ రోమియోకు ప్రజలు దేహశుద్ధి చేశారు. హాసనలో డిగ్రీ చదువుతున్న ఓ విద్యార్థిని రోజూ ఇంటినుంచి కాలేజీకి రాకపోకలు సాగించేది. ఈక్రమంలో ఓ యువకుడు నిత్యం ఆ యువతి వెంటపడి వేధించేవాడు. మంగళవారం కూడా వెంట పడటంతో స్థానికులు గమనించి ఆ యువకుడికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

టెన్త్ ప్రైవేటు విద్యార్థులకు ఊరట

- మాతృభాషలో పరీక్ష రాయొచ్చు

హోసూరు: తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాల్గొనే ప్రైవేట్ విద్యార్థులు వారి వారి మాతృభాషలో పరీక్షలు రాసేందుకు తమిళనాడు విద్యాశాఖ అనుమతినిచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రస్తుతం పాఠశాలల్లో చదువుతున్న మైనార్టీ విద్యార్థులు మాత్రమే పబ్లిక్ పరీక్షల్లో మాతృభాషలో రాసేందుకు అర్హులని, ప్రైవేట్‌గా పరీక్షలు రాసే మైనార్టీ విద్యార్థులకు అనుమతి లేదని విద్యాశాఖ ప్రకటించడంతో ప్రైవేటు విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఈ విషయంపై రాష్ట్రేతర తెలుగు సమాఖ్య చైర్మన్ ఎం.ఎస్. విజయ్‌కుమార్, తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు ఎం.ఎస్.రామస్వామిరెడ్డి, తెలుగు సంఘ నాయకుడు సీతారామయ్య తదితరులు జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలోని జిల్లా ప్రధాన విద్యాశాఖాధికార్ల వద్ద చర్చించారు. చెన్నైలో లింగ్విస్ట్ నాయకుడు సీఎంకే రెడ్డి విద్యాశాఖాధికార్లతో సంప్రదించారు. విద్యార్థుల వెతలపై సాక్షి దినపత్రికలోనూ వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యార్థులు వారి మాతృభాషల్లో పరీక్షలు రాసేందుకు విద్యాశాఖ అనుమతినిచ్చింది.

అలరించిన బాలల నృత్యాలు


బాలలతో అతిథులు

హోసూరు: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని బిన్నమంగలం ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీవిద్యార్థులందరికీ బహుమతుల ప్రధానం చేశారు. ఎస్ఎంసి ఆధ్యక్షులు నేత్ర, హోసూరు విద్యా జిల్లా విద్యాధికారి మునిరాజ్, బీఈవోలు విజయ కరుణాకరణ్, పాల్‌రాజ్, హెచ్ఎం మురుగేష్, రంగారెడ్డి, జనార్దనరెడ్డి పాల్గొన్నారు.

అన్నా డీఎంకేలోకి చేరికలు


యడపాడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యకర్తలు

హోసూరు: వివిధ పార్టీల నుంచి వైదొలగిన కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి యడపాడి పళనీస్వామి సమక్షంలో అన్నాడీఎంకే పార్టీలో చేరారు. అన్నాడీఎంకే పార్టీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి, యూనియన్ కార్యదర్శి, జిల్లా కౌన్సిలర్ ఆర్.కే. రవికుమార్ అధ్యక్షతన పెద్ద ఎత్తున కార్యకర్తలు సేలంలోని యడపాడి పళనీస్వామి స్వగృహానికి చేరుకొని అన్నాడీఎంకే తీర్థం పుచ్చుకొన్నారు. కొత్తగా చేరినవారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

జల్లికట్టులో పాల్గొన్న అపార జనసందోహం


జనసంద్రమైన జల్లికట్టు

కెలమంగలం: డెంకణీకోట పట్టణ పంచాయతీలో మొట్టమొదటిసారిగా జరిగిన జల్లికట్టు అత్యంత సందోహంగా సాగింది. పట్టణంలోని తేరుపేటలో వెలసిన ప్రసిద్ధి పొందిన శ్రీ బేటరాయస్వామి ఆలయ రథోత్సవం ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ప్రభుత్వ అనుమతితో ఉదయం 8 గంటల నుంచి జల్లికట్టును ప్రారంభించారు. పట్టణ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాస్, హోసూరు మేయర్ ఎస్.ఏ.సత్య పచ్చజెండా ఊపి ప్రారంభించారు. హోసూరు, సూళగిరి, బాగలూరు, బేరికె, అంచెట్టి, తళి, రాయకోట, కెలమంగలం తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వృషభాలను తీసుకెళ్లి జల్లికట్టులో పరుగెత్తించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొని పరుగెత్తుతున్న ఎద్దులను నిలువరించారు. జల్లికట్టును తిలకించేందుకు వేలాది మంది ప్రజలు వచ్చారు. గొడవలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

హుండీ నిధులతో షాదీ మహల్ నిర్మాణం తగదు

మైసూరు: షాదీ మహల్ నిర్మాణం కోసం నంజనగూడు శ్రీ కంఠేశ్వరస్వామి ఆలయ హుండీ డబ్బును వినియోగించడం సరికాదని శ్రీరామసేన వ్యవస్థాపకుడు ప్రమోద్ ముతాలిక్ మండిపడ్డారు. బుధవారం ఆయన మైసూరులో మీడియాతో మాట్లాడుతూ హుండీ నిధులను హిందూ ఆలయాల అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలన్నారు. కాగా విధానసభ ఎన్నికల్లో ఉడుపి జిల్లా కార్కళ విధానసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాకు గుడ్డ చుట్టి చోరీ

- పూజారిపై అనుమానాలు

దొడ్డబళ్లాపురం: సీసీ కెమెరాకు గుడ్డ చుట్టి హుండీలో నగదు చోరీ చేశారని, ఈఘటనలో పూజారిపై అనుమానం ఉందని చెన్నపట్టణ తాలూకా నీలసంద్ర గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడి భైరవేశ్వరస్వామి దేవాలయంలో ఇటీవల జాతర జరిగింది. వేలాదిగా భక్తులు తరలిరావడంతో హుండీలో భారీగా నగదు, కానుకలు పడ్డాయి. ఈక్రమంలో పూజారి కెమెరాకు గుడ్డ చుట్టి సుమారు రూ.2 లక్షలు నగదు దోచాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి పూజారి ఆలయంలో తిరిగి దృశ్యాలు రికార్డయ్యాయి.

క్లుప్తంగా...

ఉత్తరాంధ్ర ద్రోహి చంద్రబాబు

చంద్రబాబు విమర్శలపై మంత్రి అమర్‌నాథ్ మండిపాటు



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల పాటు పనిచేసిన చంద్రబాబు ఉత్తరాంధ్ర ప్రాంతానికి వెన్నుపోటు పొడిచి.. ఇప్పుడు వెన్న పూయడానికి విశాఖకు వచ్చారా అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిలదీశారు. పరిపాలన రాజధానిని అడ్డుకుంటున్న ఉత్తరాంధ్ర ద్రోహి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. బుధవారం విశాఖ సర్క్యూట్ హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీని పులివెందులలో ఓడిస్తానంటున్న చంద్రబాబుకు అంత దమ్ముంటే కుప్పంలో రాజీనామా చేసి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. ఏ పార్టీతో పొత్తు లేకుండా 175 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేసే దమ్ముందా అని నిలదీశారు. ఐదేళ్లలో అమరావతి పేరుతో ప్రజలకు భ్రమలు కల్పించి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి రైతుల నుంచి భూములు లాక్కున్న చంద్రబాబు అదే రీతిలో విశాఖలో కూడా హుద్‌హుద్ పేరిట రికార్డులు తారుమారు చేసి ప్రభుత్వ భూములు దోచుకున్నారన్నారు.

ముందస్తుపై తొందరెందుకు?

ముందస్తు ఎన్నికలు ఉండవని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నిసార్లు చెప్పినా.. చంద్రబాబు ముందస్తుపై ఎందుకంత వెంపర్లాడుతున్నారని అమర్‌నాథ్ నిలదీశారు. 2024 ఎన్నికల్లో టీడీపీ పూర్తిగా భూస్థాపితం కావడం ఖాయమన్నారు. దత్తపుత్రుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని ఢిల్లీకి పంపించి సరికొత్త డ్రామాకు చంద్రబాబు తెరలేపాడన్నారు. ఢిల్లీకి వెళ్లినా బీజేపీ పెద్దలు, ప్రధాని మోదీ పట్టించుకోలేదని కుంటిసాకులు చెప్పి బీజేపీతో బంధాన్ని తెంచుకుని టీడీపీతో బంధాన్ని పెంచుకునేందుకు పవన్ కల్యాణ్ సరికొత్త డ్రామా ఆడుతున్నారన్నారు.

బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించండి

కేంద్రానికి ఆర్.కృష్ణయ్య బృందం విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బృందం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. సంఘ నేతలు గుజ్జ కృష్ణ, భూపేష్ సాగర్, వేముల రామకృష్ణ, కె.రాము, బాషయ్య ఈ మేరకు ఆర్థిక మంత్రిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధికి బడ్జెట్ కేటాయించకుండా కేంద్రం అన్యాయం చేస్తోందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించిన అంశాన్ని తెలిపామన్నారు. 'మండల కమిషన్ సిఫార్సుల ప్రకారం రిజర్వేషన్లు, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ప్రారంభించలేదు. రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వడం లేదు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు అమలు చేస్తున్నాయి. ఈ పథకాలకు కేంద్రం పూర్తి గ్రాంటు ఇవ్వాలి. క్రీమీలేయర్ నిబంధన సడలించి పేద వర్గాలకు న్యాయం చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో మాదిరిగా ఎస్సీ/ఎస్టీ/ బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలి. కుల, చేతివృత్తుల వారు స్వయం ఉపాధి నిమిత్తం కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలి. ఉద్యోగార్థుల పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి జిల్లాకు ఒకటి చొప్పున బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలి' అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి భవనాల నిర్మాణాలకు గ్రాంట్లు, విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు. బీసీల న్యాయబద్ధమైన 14 డిమాండ్లు నెరవేరేలా సహకరించాలని వివిధ పార్టీలకు చెందిన 92 మంది ఎంపీలను కోరామన్నారు.

ధరలు తెలిస్తే నీళ్లు నమలాల్సిందే

ఫైవ్, 7 స్టార్ హోటళ్లతో పాటు ధనికులు, సెలబ్రిటీలు, క్రీడాకారులు అధిక వినియోగం

బిందె నీటిని రూ.2కు కొంటున్నారని పాతికేళ్ల క్రితం పత్రికల్లో వస్తే 'నీళ్లు కొనాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయన్న మాట' అని చాలామంది నోళ్లు నొక్కుకున్నారు. ఆ తర్వాత ఎక్కడికక్కడ వాటర్ బాటిళ్లు వచ్చేశాయి. ప్రస్తుతం ఏ హోటల్‌కు వెళ్లినా నీటిని కొనాల్సిందే. ఉచితంగా మంచినీళ్లు ఇచ్చే పరిస్థితులు దాదాపు ఏ హోటల్, రెస్టారెంట్‌లోనూ కనిపించటం లేదు. ప్రజల ఆర్థిక పరిస్థితులు బాగా మెరుగుపడటంతో సురక్షిత నీటి కోసం ఎంత ఖర్చయినా వెనుకాడటం లేదు. భారతదేశంలో 2018 వరకూ మినరల్ వాటర్ బాటిళ్ల వ్యాపారం ఏటా రూ.16 వేల కోట్లు ఉండేది. 2022లో రూ.33 వేల కోట్లకు చేరింది. 2023లో రూ.43 వేల కోట్ల బిజినెస్ జరుగుతోందని మార్కెట్ వర్గాల అంచనా. బిస్లరీ, కిన్లే, ఆక్వాఫినా, టాటా వాటర్ ప్లస్, బెయిలీ, రెయిల్ నీర్, ఆక్సీరిచ్ వాటర్ వినియోగం ఎక్కువ. ఇప్పుడు వీటికంటే ఖరీదైన నీరు మార్కెట్‌కు చేరింది. దేశంలో లీటర్ నీళ్ల ధర కనిష్ఠంగా రూ.20 ఉండగా.. గరిష్ఠంగా రూ.12 వేల వరకూ ఉంది. జపాన్, జర్మనీతో పాటు దేశాల్లో ఇంతకంటే ఖరీదైన మినరల్ వాటర్ కూడా ఉంది. వీటిని ఆన్‌లైన్‌లో కూడా కొనుగోలు చేయొచ్చు.

-సాక్షి ప్రతినిధి, కర్నూలు



ఖరీదైన బ్రాండ్లు ఇవీ

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని హవాయి సముద్రం నుంచి 3వేల అడుగుల లోతులో నీటిని సేకరించి ప్రాసెస్ చేస్తారు. ఇందులో సముద్రపు మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. 'కోనదీప్' పేరుతో ఈ నీళ్లు మన దేశంలోనూ దొరుకుతున్నాయి. భారత్‌లో లభిస్తున్న అత్యంత ఖరీదైన నీరు ఇదే. 'వోస్ ఆర్టేషియన్' అనే మరో కంపెనీ దక్షిణ నార్వే నుంచి నీటిని సేకరిస్తోంది. మంచుకొండలో అతి చివరి పొర నుంచి ఈ నీటిని సేకరిస్తారు. భారత్‌లోని అత్యంత ఖరీదైన రెస్టారెంట్లు, లాంజ్‌లలో మాత్రమే వీటిని విక్రయిస్తున్నారు. 800 మిల్లీలీటర్ల బాటిల్ ధర రూ.6,600 నుంచి రూ.12వేల వరకూ ఉంది. 'ఆవా' పేరుతో మరో కంపెనీ ఆల్కలైన్ వాటర్ ఇస్తోంది. ఇందులో పీహెచ్ 8+ ఉంటుంది. కాల్షియం, మెగ్నీషియం లాంటి ఫోర్టిఫైడ్ మినరల్స్ కూడా ఇందులో ఉంటాయి. ఆరావళి, తరంగ పర్వతాల నుంచి ఈ నీటిని సేకరిస్తారు. 'ఈవియన్' అనే మరో బ్రాండ్ నీటిలో మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. మంచుకొండల్లో వర్షం కురిసినప్పుడు మంచుపై పారే నీటిని సేకరిస్తారు. ఇందులో పీహెచ్ 7.2 ఉంటుంది. ఇండియాలో ఎక్కువగా క్రీడాకారులు, సెలబ్రిటీలు ఈ నీటినే వినియోగిస్తున్నారు. టాటా హిమాలయా బ్రాండ్ నీటిని హిమాలయాల్లో శివలేక్ పరిధిలో ఉన్న మంచు పర్వతాల నుంచి సేకరిస్తారు. 100 శాతం స్వచ్ఛమైన నేచురల్ మినరల్స్ ఇందులో ఉంటాయి. ఈ నీటిని సేకరించే ప్రాంతంలో మనుషుల సంచారం, కాలుష్యం ఉండదు. బాక్టీరియా కూడా ఉండదు.

ఫిలికో వాటర్ రూ.1.14 లక్షలు

ప్రపంచంలోని టాప్-10 బ్రాండ్లలో కనిష్ఠంగా 27 డాలర్ల నుంచి గరిష్ఠంగా 1,390 వరకు లీటర్ నీటి ధర ఉంది. ఇందులో జపాన్ కంపెనీకి చెందిన ఫిలికో లీటర్ వాటర్ ధర 1,390 డాలర్లు (రూ.1.14 లక్షలు). జర్మనీకి చెందిన నివాస్ ధర1,180 డాలర్లు (రూ.96,760). టాప్ బ్రాండ్లలో కనిష్ఠంగా ఆస్ట్రేలియాలోని టాస్మానియా కంపెనీ బీఎల్‌వీడీ నీటి ధర 27 డాలర్లు (రూ.2,214).

కొత్తగా వచ్చింది 'బ్లాక్ వాటర్'



'ఇవాకస్' పేరిట మార్కెట్‌లోకి కొత్తగా బ్లాక్‌వాటర్ వచ్చింది. ఇందులో 70పైగా నేచురల్ మినరల్స్ ఉన్నట్టు చెబుతున్నారు. శరీరం డీహైడ్రేషన్ కాకుండా ఉండటంతో పాటు ఎసిడిటీని తగ్గిస్తుంది. చర్మం ముడతలు పడకుండా మృదువుగా ఉంచుతుందట. వయసు ప్రభావం కన్పించదని చెబుతున్నారు.

భారత్‌లో టాప్-10 బ్రాండ్లు.. వాటి ధరలు

బ్రాండ్	ధర (రూపాయల్లో)
కోనదీప్	4,795
వోస్ ఆర్టేషియన్	6,600 (800 మి.లీ.)
ఆవా	162.25
వోస్ టాంజీరిన్	540
ఈవియన్ ప్యూర్ నేచురల్	275
తాజ్ ఆక్వా	120
టాటా హిమాలయ	816
ఇవోకస్	1,600
క్వా	60
వారాహి మూన్‌లైట్	100



ప్రపంచంలో టాప్-10 బ్రాండ్స్

బ్రాండ్	తయారీ దేశం	లీటర్ ధర (యూఎస్ డాలర్లలో)
ఫిలికో	జపాన్	1,390
నివాస్	జర్మనీ	1,180
బ్లింగ్ హెచ్2ఓ	యూఎస్	219
శ్వాల్‌బారియో	నార్వే	185
ఓ అమెజాన్	బ్రెజిల్	110
ఉస్గిసోర్స్	స్కాట్లాండ్, యూకే	94
రాయ్	స్లోవెనియా	59
మినస్181	జర్మనీ	50
బెర్గ్	కెనడా	46
బీఎల్‌వీడీ	టాస్మానియా, ఆస్ట్రేలియా	27

కేజిన్నర బంగారం దోపిడీ

- మహిళపై దాడిచేసి అపహరించుకుపోయిన దుండగులు
- జ్యువెలరీ షాపు నుంచి ఇంటికి తీసుకెళ్తుండగా ఘటన

గుడిపాల (చిత్తూరు జిల్లా): జనం చూస్తుండగానే ఓ మహిళపై దాడిచేసి.. బ్యాగ్‌లో ఉన్న కేజిన్నర బంగారాన్ని దుండగులు దోచుకెళ్లిన ఘటన చిత్తూరు జిల్లా గుడిపాల మండలం వసంతాపురంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వసంతాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు, ఉష దంపతులు గుడిపాలలో జ్యూవెలరీ దుకాణం నడుపుతున్నారు. వీరు ప్రతిరోజూ ఇంటి నుంచి బంగారాన్ని తీసుకుని దుకాణానికి తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. మిగిలిన ఆభరణాలను రాత్రివేళ ఇంటికి తీసుకొచ్చి జాగ్రత్త చేస్తుంటారు. బుధవారం రాత్రి 7:30 గంటలకు దుకాణం నుంచి కారులో బంగారు ఆభరణాలు తీసుకుని ఇంటికి వచ్చారు. ఇంటివద్ద వెనుక వైపున భర్త కారు పార్కింగ్ చేస్తుండగా.. ఉష బంగారు ఆభరణాలున్న బ్యాగ్ పట్టుకుని నిలబడింది. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఉషపై దాడి చేశారు. ఆమె చేతిలో ఉన్న బంగారం బ్యాగ్‌ను గుంజుకుని పారిపోయారు. దీనిని గమనించిన భర్త, స్థానికులు ఆమె వద్దకు చేరుకోగా.. అప్పటికే దుండగులు పరారయ్యారు. నిందితులు మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో గల ద్విచక్ర వాహనంపై వచ్చారని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుల్ని వీలైనంత త్వరగా పట్టుకుంటామని డీఎస్పీ శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. సీసీ కెమెరాల సాయంతో నిందితుల జాడను గుర్తించేందుకు చర్యలు చేపట్టామని, తమిళనాడు సరిహద్దులో వాహన తనిఖీ చేపట్టామని చెప్పారు.



బంగారం దోపిడీ కావడంతో విలపిస్తున్న ఉష

టీడీపీని కలుపుకుందామని బీజేపీని కోరాం

- జనసేన నేత నాదెండ్ల మనోహర్ పరోక్షంగా వెల్లడి
- ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే మా నిర్ణయాన్ని తెలియజేశాం
- వాళ్లు ముందుకొస్తారని మాకు నమ్మకముంది
- పొత్తులపై సరైన సమయంలో పవన్ నిర్ణయం తీసుకుంటారు
- అంతకంటే ముందు బాధ్యతతో మా నిర్ణయాన్ని బీజేపీకి తెలియజేశాం
- రాష్ట్రంలో బీజేపీ ఇంకా బలపడాలి

సాక్షి, అమరావతి: టీడీపీని కూడా పొత్తులో కలుపుకుపోదామని బీజేపీ పెద్దలను కోరినట్లు జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ పరోక్షంగా వెల్లడించారు. ఢిల్లీ పర్యటన అనంతరం ఆయన బుధవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. టీడీపీతో పొత్తు గురించి బీజేపీ నాయకులతో మాట్లాడారా? అని మీడియా ప్రశ్నించగా.. నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ.. 'రాజకీయాలు అన్నాక అన్ని అంశాలూ చర్చకు వస్తాయి' అని జవాబిచ్చారు. 'బీజేపీ పెద్దలతో పవన్‌కళ్యాణ్ భేటీలో భాగంగా రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడాం. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని మేము తీసుకున్న నిర్ణయాన్ని వారికి వివరించాం. వాళ్లు కూడా అర్థం చేసుకున్నారు. మా నిర్ణయాన్ని స్వాగతించి ముందుకొస్తారని నమ్మకం ఉంది. త్వరలోనే అన్ని పార్టీలూ కలిసి వైఎస్సార్‌సీపీ విముక్త ఏపీ కోసం పనిచేసే విధంగా ముందుకు వెళ్తాం' అని మనోహర్ చెప్పారు. పొత్తులపై తమ పార్టీ అధినేత పవన్ సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అంతకంటే ముందు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని ఎందుకు నిర్ణయం తీసుకున్నామో అందరికీ వివరించాల్సిన బాధ్యత ఉందని.. అది నెరవేర్చామని చెప్పారు. కాగా, టీడీపీతో పొత్తుకు బీజేపీ పెద్దలు అంగీకరించడం లేదని వార్తలు వస్తున్నాయని ప్రశ్నించగా.. 'అది మీడియా ఎవరో ఒకరు చెబుతున్న మాటే' అని బదులిచ్చారు.

బీజేపీ వాళ్ల అవగాహన లోపం..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షంగా ఉండి కూడా జనసేన మద్దతు తెలపలేదన్న బీజేపీ నేత మాధవ్ వ్యాఖ్యలను నాదెండ్ల వద్ద ప్రస్తావించగా.. 'అది వాళ్ల అవగాహన లోపం' అని బదులిచ్చారు. 'మేం (జనసేన) సంస్థాగతంగా బలపడుతున్నాం. వాళ్లు (బీజేపీ) కూడా సంస్థాగతంగా బలపడాలి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పోటీ చేయలేదు. మా పార్టీ స్టాండ్‌ను ముందుగానే ప్రకటించాం' అని నాదెండ్ల చెప్పారు. రానున్న రోజుల్లో పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్తామని తెలిపారు.

మా పొత్తు జనసేనతో మాత్రమే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

సాక్షి, అమరావతి: బీజేపీ, జనసేన పార్టీలు మాత్రమే కలిసి ముందుకెళ్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఢిల్లీ పర్యటన, టీడీపీతో పొత్తు గురించి మీడియా ప్రశ్నించగా.. సోము వీర్రాజు జవాబిచ్చారు. బీజేపీ, జనసేన కలిసే ఉన్నాయని.. కలిసే ముందుకెళ్తాయని చెప్పారు. అందువల్లే పవన్‌కళ్యాణ్ ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిని, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిని కలిశారని పేర్కొన్నారు. పవన్‌ను చంద్రబాబు, చంద్రబాబును పవన్ కలిసినంత మాత్రాన.. వాళ్లు రాజకీయంగా ఒక్కటైనట్టు కాదన్నారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో చంద్రబాబు వద్ద తాను కూడా కూర్చున్నానని గుర్తు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ, జనసేన కలిసి పోరాడతాయని తెలిపారు. రాజకీయాల్లో ఏదీ వ్యూహం ప్రకారం జరగవన్నారు.

రాజ్యసభలో | **ఏపీ ఇన్ పార్లమెంట్**

జూన్‌కల్లా తిరుపతి ఐఐటీ క్యాంపస్ సిద్ధం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి ఐఐటీ క్యాంపస్ నిర్మాణాలన్నీ జూన్ 30 కల్లా సిద్ధం చేస్తామని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుభాష్ సర్కార్ తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి దేశంలోని ఐఐటీలకు రూ.9,361 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.407 కోట్లు కేటాయించాలని తిరుపతి ఐఐటీ యాజమాన్యం కోరిందని, అయితే ఎంత కేటాయించాలన్నది పరిశీలిస్తున్నామని చెప్పారు.

అప్‌గ్రేడ్ కానున్న 2 లక్షల అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు పిల్లలకు మెరుగైన పోషకాహారం అందించడం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి సేవలను బలోపేతం చేసే లక్ష్యంతో ఏడాదికి 40 వేల చొప్పున దేశవ్యాప్తంగా ఐదేళ్లలో రెండులక్షల అంగన్‌వాడీ కేంద్రాలను సాక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు కేంద్ర మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రిబదులిస్తూ.. ఈ ఏడాది ఆశావహ జిల్లాల పరిధిలో 40 వేల అంగన్‌వాడీ కేంద్రాలను సాక్షం అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేయబోతున్నట్లు చెప్పారు. సాక్షం అంగన్‌వాడీల్లో ఇంటర్నెట్, వైఫై, ఎల్‌ఈడీ స్క్రీన్లు, స్మార్ట్ లెర్నింగ్, ఆడియో విజువల్ పరికరాలు, చైల్డ్-ఫ్రెండ్లీ లెర్నింగ్ పరికరాలను సమకూర్చనున్నట్లు వివరించారు.

ఏపీలో 16 ఆర్‌ఎస్‌ఈటీఐ కేంద్రాలు



ఆంధ్రప్రదేశ్‌లో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఎస్ఈటీఐ)లు 16 అమల్లో ఉన్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి నిరంజన్ జ్యోతి తెలిపారు. ఈ కేంద్రాల్లో 1,46,298 మంది శిక్షణ పొందగా 1,06,163 మంది సెటిల్ అయ్యారని తెలిపారు. స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం (ఎస్‌వీఈపీ)లో ఏపీలో ఎనిమిది బ్లాకులు ఆమోదించగా 17,495 మంది ఎంటర్‌ప్రైజెస్‌కు మద్దతు కల్పిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

లోక్‌సభ

పేటెంట్ కార్యాలయాల్లో 500 పోస్టులు అదనంగా మంజూరు



2022-23లో దేశవ్యాప్తంగా పేటెంట్ కార్యాలయాల్లో 500 పోస్టులు అదనంగా మంజూరు చేసినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సహాయమంత్రి సోంప్రకాశ్ చెప్పారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు గొడ్డేటి మాధవి, చింతా అనూరాధ ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

16 గతిశక్తి కార్గో టెర్మినళ్ల ఏర్పాటుకు గుర్తింపు



ఆంధ్రప్రదేశ్‌లో గతిశక్తి కార్గో టెర్మినళ్లు ఏర్పాటు చేయడానికి 16 ప్రాంతాలు గుర్తించినట్లు రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

సౌత్ సూడాన్ బృందంతో చర్చల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ సత్యవతి

సౌత్ సూడాన్, భారతదేశం మధ్య సహాయసహకారాలు, సత్సంబంధాలపై ఆ దేశ స్పీకర్ బృందంతో బుధవారం నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి పాల్గొన్నారు. సభాపతి ఓం బిర్లా ఆహ్వానం మేరకు ఆమె ఈ సమావేశానికి హాజరయ్యారు.

అభ్యర్థులు లేకపోవడంతోనే పొత్తులకు వెంపర్లాట

- టీడీపీ, జనసేనను ఉద్దేశించి మంత్రి ఆదిమూలపు సురేశ్ వ్యాఖ్య
- పవన్‌ది రాజకీయ వ్యభిచారం
- నిలకడ లేదు.. సిద్ధాంతం, భావజాలం అసలే లేవు

ఒంగోలు: 'పవన్‌కళ్యాణ్ నిలకడలేని మనిషి. ఆయనకు ఒక సిద్ధాంతం, భావజాలం లేవు. ఆయన చేస్తున్నది రాజకీయంలా అనిపించడం లేదు. రాజకీయ వ్యభిచారంలా ఉంది' అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్ అన్నారు. బుధవారం ఒంగోలులో ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ ఒకవైపు బీజేపీతో అంటకాగుతూ.. మరోవైపు టీడీపీతో ఒప్పందంలో ఉంటారని విమర్శించారు. ఆయన ఏ పార్టీతో పొత్తులో ఉన్నారో కనీసం ప్రజలకైనా స్పష్టత ఇవ్వాలన్నారు. 175 నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేకపోవడం వల్లే టీడీపీ, జనసేన పార్టీలు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయని విమర్శించారు. ఇలాంటి వారు గుంపులు గుంపులుగా వచ్చినా.. వైఎస్ జగన్ నేతృత్వంలో 175 నియోజకవర్గాల్లో గెలిచి తీరుతామన్నారు. తాము చేసిన సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలపై ఉన్న నమ్మకంతోనే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడుతున్నామని.. ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తున్నామని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే.. వాటిని తెలుసుకొని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకొని వెళ్తారని ప్రశ్నించారు. బాబు వస్తే జాబు వస్తుందని నమ్మించి.. యువతను చంద్రబాబు మోసం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు అండ్ కో.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.300 కోట్లకు పైగా సొమ్మును కాజేసిందని మండిపడ్డారు.

రాష్ట్రంలో కనిపించని అభివృద్ధి

టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

కూడేరు: రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడంలేదని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. నారా లోకేశ్ యువగళం పేరిట చేపట్టిన పాదయాత్ర బుధవారం అనంతపురం జిల్లా కూడేరు మండలంలో కొనసాగింది. కూడేరులో సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత తమదేనని గొప్పలు చెప్పుకుంటున్నారని తెలిపారు. కానీ తమ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పలు పథకాలను రద్దు చేశారని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు. ఉరవకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాల్వ శ్రీనివాసులు పాల్గొన్నారు.

175 స్థానాల్లో పోటీ చేస్తామని నీకెందుకు చెప్పాలి?

- 175 సీట్లలో ఓడిస్తాం.. పులివెందులలో కూడా..
- టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు



సాక్షి, విశాఖపట్నం: 'రాష్ట్రంలో 175 స్థానాల్లో పోటీ చేస్తామని నీకెందుకు చెప్పాలి. నువ్వెవరు నన్నడగడానికి. 175 స్థానాల్లోను ఓడిస్తాం. పులివెందులలో కూడా. టీడీపీని లేకుండా చేయడం జగన్ వల్లే కాదు. ఆయన్ని పుట్టించిన దేవుడి వల్ల కూడా కాదు..' అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన టీడీపీ ఉత్తరాంధ్ర జోనల్-1 సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీతో పెట్టుకున్న జగన్ పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చాక తాడేపల్లిలో జగన్ ప్యాలెస్ కూల్చడానికి నిమిషం పట్టదని చెప్పారు. ముందస్తు ఎన్నికలు వచ్చినా, 2024లో వచ్చినా గెలిచేది తెలుగుదేశమేనని చెప్పారు. నాలుగేళ్ల బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు ఏమీ చేయలేకపోయారని చెప్పారు. మోసాలు చేసేవాళ్లని చిత్తుగా ఓడించే మనస్తత్వం ఉత్తరాంధ్ర ప్రజలకుందన్నారు. భోగాపురం విమానాశ్రయం 90 శాతం భూములు సేకరించి శంకుస్థాపన చేశామని చెప్పారు. ఐదేళ్లలో మూడుసార్లు సీఐఐ సదస్సులు పెట్టి రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు, గిరిజన ప్రాంతాల్లో కాఫీ పంటలు తీసుకొచ్చిన పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు. మద్యం దుకాణాల్లో నంబర్-2 అకౌంట్ ఉందని, అది నేరుగా తాడేపల్లి పాలెస్‌కి చేరుతుందని విమర్శించారు. విశాఖలో రూ.45 వేల కోట్ల భూముల్ని కొల్లగొట్టారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సిట్ వేసి ఎవరి భూములు వారికి వచ్చేలా చేస్తామని చెప్పారు. టీడీపీ హయాంలో చేసిన పనుల వద్ద సెల్ఫీతీసి చాలెంజ్ చెయ్యండని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో పోలవరం పనుల్ని 72 శాతం పూర్తిచేశామని, తామే అధికారంలో ఉంటే 2020 నాటికి పూర్తిచేసేవాళ్లమని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఎవరు వచ్చినా పార్టీలో చేర్చుకుందామన్నారు. పార్టీలో విభేదాలు సృష్టించాలని చూస్తున్నవారు.. పార్టీలో గ్రూపులు పెడితే పదవులు రావన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో 40 శాతం సీట్లు యువతకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, చినరాజప్ప, అనిత, గంటా, బుద్ధా వెంకన్న పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా ట్యాబ్‌లకు రిపేర్లు

- వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు ప్రత్యేక బాధ్యతలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేసిన ట్యాబ్‌లలో ఏదైనా సమస్య వస్తే.. వాటిని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పరిష్కరించనున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రభుత్వం 8వ తరగతి చదువుతున్న 5,18,750 మంది పిల్లలకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. అయితే వాటిలో ఏదైనా సమస్య వస్తే.. విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశముంది. ఈ పరిస్థితిని నివారించేందుకు ట్యాబ్‌ల సర్వీసు అంశాల పర్యవేక్షణ కోసం సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలను నోడల్ అధికారులుగా నియమించారు. అలాగే ట్యాబ్‌ల సర్వీస్ అంశాల పర్యవేక్షణకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక వెబ్‌పోర్టల్‌ను కూడా రూపొందించింది. ట్యాబ్ రిపేర్ ప్రక్రియపై కలెక్టర్లు, సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్లతో పాటు అన్ని గ్రామ, వార్డు సచివాలయాలకు ఆ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఏ సచివాలయంలోనైనా ట్యాబ్ సర్వీస్ పొందే వీలు..

- ▲ సమస్య ఏర్పడిన ట్యాబ్‌ను విద్యార్థి గానీ తలిదండ్రులు లేదా పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఎవరో ఒకరు తమకు సమీపంలోని సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు అందజేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని ఏ సచివాలయంలోనైనా ఈ సేవను విద్యార్థులు ఉపయోగించుకోవచ్చు.
- ▲ ట్యాబ్ రిపేరు ప్రక్రియకు సంబంధించిన సమాచారం కోసం ఫోన్ నంబర్‌ను కూడా నమోదు చేస్తారు. ట్యాబ్ సమస్య పరిష్కారమైన తర్వాత సంబంధిత సచివాలయ సిబ్బందే దానిని సేకరించి.. తిరిగి విద్యార్థికి అందజేస్తారు.
- ▲ ట్యాబ్ రిపేర్ చేయడానికి వీలుపడకపోతే 'వారంటీ' నిబంధనలకు లోబడి ఆ సర్వీసు సెంటర్ నుంచే కొత్త ట్యాబ్‌ను సంబంధిత సచివాలయ సిబ్బంది సేకరించి విద్యార్థికి అప్పగిస్తారు.

కాగా, ఈ ప్రక్రియపై అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు 8 విడతలలో శిక్షణ ఇచ్చారు.

గ్రామీణ-పట్టణ కుటుంబాల్లో పోషకాహార లేమి ఏ విధంగా ఉందో మూలాల నుంచి క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కరీంనగర్ వాసి శిరీష జునుతులకు ఇన్నోవేటివ్ మెథడ్స్ అండ్ మెట్రిక్స్ ఫర్ అగ్రికల్చర్ అండ్ న్యూట్రిషన్ ఆక్షన్స్ (ఇమ్మన)నుంచి యాభై లక్షల రూపాయల ఫెలోషిప్ లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ఫెలోషిప్‌ను ఆరుగురు అందుకోగా వారిలో మన దేశం నుంచి శిరీష ఒక్కరే కావడం విశేషం. ఫెలోషిప్ వివరాలతో పాటు అగ్రికల్చర్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగాల్లో తను చేస్తున్న కృషి గురించి వివరించింది శిరీష.


శిరీష

ఆరుగురిలో ఒకరు

పోషకాహారంపై అధ్యయనానికి గుర్తింపు

అవగాహన ముఖ్యం

మాది కరీంనగర్ జిల్లా. బొంతుపల్లి గ్రామం. వ్యవసాయం కుటుంబం. బిఎస్సీ హోమ్‌సైన్స్ చేశాక ఎమ్మెస్సీకి ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌ను ఎంచుకున్నాను. ఆ తర్వాత పీహెచ్‌డి చేస్తున్నప్పుడే ఎన్ఐఆర్‌డిలో జరిగిన మీటింగ్‌లో ఈ ఫెలోషిప్‌కి అప్లయ్ చేసుకోవచ్చు అని తెలిసి అప్లయ్ చేశాను. దాదాపుగా నా చదువు అంతా ఫెలోషిప్స్‌తోనే గడిచింది. మా అన్నయ్య ఇచ్చే గైడ్‌లైన్స్ కూడా బాగా సహాయపడ్డాయి.

‘‘ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో పీహెచ్‌డీ చేశాను. మేనేజ్‌లో రెండేళ్లుగా వర్క్ చేస్తున్నాను. అర్బన్ ఫార్మింగ్, మైక్రో గ్రీన్స్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్‌లో ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేశాను. ఇప్పుడు ఈ ఫెలోషిప్ అగ్రికల్చర్, న్యూట్రిషన్, హెల్త్ ఈ మూడు విభాగాల్లో చేసిన ప్రాజెక్ట్‌కి వచ్చింది. ఇలా వచ్చిన నగదు మొత్తాన్ని ప్రాజెక్ట్ వర్క్‌కే వాడతాను. నేను గ్రామీణ, గిరిజన స్థాయిల్లో చేసిన ప్రాజెక్ట్ రిజల్ట్‌ని ఇక్రిశాట్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో ప్రెజెంట్ చేశాను. స్వీడన్, మలావిల్లోనూ ఈ విశేషాలు తెలియజేయబోతున్నాను. అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తులో ప్రెజెంటేషన్‌కి అవకాశం వచ్చిందంటే దీని ప్రాముఖ్యత ఈ సమయంలో చాలా ఉందని అర్థమవుతోంది. కష్టమైన టాస్క్ అయినప్పటికీ సకాలంలో పూర్తి చేయగలిగానని ఆనందంగా ఉంది.

గ్రామీణ స్థాయికి వెళ్లాలి...

వ్యవసాయం అనగానే మన జనాభాకు సరిపడా ఆహారోత్పత్తి జరగాలనే ఇన్నాళ్లుగా ఆలోచిస్తున్నాం. ఇప్పటివరకు మన దేశం ఈ విషయంలో రెండవ స్థానంలో ఉంది. పోషకాహారలోపంలో మాత్రం మొదటి స్థానంలో ఉంది. మన దగ్గర చాలా మంది పోషకాహార లేమి సమస్యను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయానికి సంబంధించిన అధికారులకు గైడ్‌లైన్స్ ఇవ్వడం వల్ల, వారు సులువుగా ప్రజల్లోకి తీసుకెళతారు. ఈ అధికారులు చెప్పడం వల్ల దీని ప్రభావం కూడా బాగుంటుంది. ఏ సాగు చేయాలి, ఎలాంటి పంటలు వేయాలి, కుటుంబాన్ని బట్టి, వారి పోషకాహార స్థాయిలను బట్టి దిగుబడి చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి అనే విషయాల మీద ఇంకా సరైన అవగాహన రావాల్సి ఉంది. దీనివల్ల రక్తహీనత, పోషకాహారం లేమి వంటివి తగ్గించవచ్చు.

గిరిజనుల ఆహారం

అంగన్‌వాడీలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల పోషకాహార స్థాయిలు ఎలా ఉన్నాయి.. అనే దానిమీద స్టడీ చేశాను. మిల్లెట్స్‌ని ఆహారంగా తీసుకోవడం ఇటీవల పట్టణాల్లోనూ పెరిగింది. అయితే, గిరిజనులు ఎప్పటి నుంచో వీటిని తీసుకుంటున్నారు. దీనివల్ల వారి రోగనిరోధకశక్తి పట్టణాల్లో వారికన్నా మెరుగ్గా ఉంది. ఈ విషయాన్ని నేరుగా తెలుసుకోవడానికి తెలంగాణలోని గిరిజనుల కుటుంబాలను కలుసుకొని స్టడీ చేశాను. రాగి అంబలి, జొన్నరొట్టె, ఆకుకూరలు వారి ఆహారంలో ప్రధానంగా ఉంటాయి. అదే గ్రామాల్లో అయితే అవగాహన తక్కువే. ఈ విషయంగా అవగాహన సదస్సులు జరగాల్సిన అవసరం ఉంది. మార్పు తీసుకురావడానికి అందరి కృషి అవసరం’’ అని వివరించింది శిరీష.

– నిర్మలారెడ్డి


ఇక్రిశాట్‌లో అవార్డు అందుకుంటూ...

గెలుపు దారి


భర్త రాకేష్‌తో రేఖా ఝున్‌ఝున్‌వాలా


భర్త సైరస్ మిస్త్రీతో రోహిక మిస్త్రీ

రోహిక మిస్త్రీ, రేఖా ఝున్‌ఝున్‌వాలాల మధ్య ఉన్న ప్రధాన సారూప్యత ఏమిటంటే...
ఇద్దరూ పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని నిలబడ్డారు.
తడబడకుండా ధైర్యంగా అడుగు ముందుకు వేశారు.
తమ తెలివితేటలు, కార్యదక్షతతో విజయపరంపరను ముందుకు తీసుకు వెళుతున్నారు.
తాజాగా ఫోర్బ్స్ వరల్డ్స్ బిలియనీర్స్ జాబితాలో మన దేశం నుంచి చోటు సంపాదించిన న్యూకమర్స్‌లో ఈ ఇద్దరూ ఉన్నారు...

దుఃఖనది దాటి గెలిచారు

సైరస్ మిస్త్రీ పరిచయం అక్కరలేని పేరు. లండన్ బిజినెస్ స్కూల్‌లో మాస్టర్స్ చేసిన మిస్త్రీ ఆతరువాత కుటుంబవ్యాపారంలోకి వచ్చాడు. 2012లో టాటా గ్రూప్ ఛైర్మన్ అయ్యాడు.

మిస్త్రీ జీవితంలో జయాపజయాలు ఉన్నాయి.

‘నిర్దేశిత లక్ష్యాల విషయంలో మిస్త్రీ విఫలమయ్యాడు’ అంటూ కొద్దికాలానికి ఛైర్మన్ పదవి నుంచి మిస్త్రీకి ఉద్వాసన పలికింది టాటా గ్రూప్.

న్యాయపోరాటం సంగతి ఎలా ఉన్నా మిస్త్రీ ధైర్యాన్ని కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో భర్తకు అండగా నిలబడి ఎంతో శక్తిని ఇచ్చింది రోహిక.

ప్రచారానికి దూరంగా ఉండే రోహిక గురించి బయట పెద్దగా ఎవరికి తెలియదు. అయితే భర్త నోటి నుంచి ‘రోహిక’ పేరు వినిపించేది.

దిగ్గజ న్యాయవాది ఇక్బాల్ చాగ్లా కుమార్తె అయిన రోహిక కొన్ని ప్రైవెట్, పబ్లిక్ కంపెనీలలో డైరెక్టర్‌గా పనిచేసింది.

ఒకసారి రోహికను క్లైమెన్‌టైన్ స్పెన్సర్ చర్చిల్‌తో పోల్చాడు సైరస్ మిస్త్రీ.

చర్చిల్ భార్య అయిన క్లైమెన్‌టైన్ ధైర్యశాలి. ముందుచూపు ఉన్న వ్యక్తి. భర్తకు ఎన్నో సందర్భాలలో అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చింది. తప్పులను సున్నితంగా ఎత్తి చూపింది. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడడం తన నైజం.

వర్క్-ఫ్యామిలీ లైఫ్‌లో సమన్వయాన్ని కోల్పోతున్న మిస్త్రీని దారిలోకి తెచ్చింది రోహిక.

‘సమస్యలు ఉన్నాయని సరదాలు వద్దనుకుంటే ఎలా!’ అంటూ భర్తను విహారయాత్రలకు తీసుకెళ్లేది. ఆ యాత్రలలో వ్యాపార విషయాలు అనేవి చివరి పంక్తిలో మాత్రమే ఉండేవి.

54 ఏళ్ల వయసులో సైరస్ మిస్త్రీ ఒక రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రోహికకు ఊహించని షాక్!

దుఃఖసముద్రంలో మునిగిపోయిన రోహిక తనకు తాను ధైర్యం చెప్పుకొని ఒడ్డుకు వచ్చింది. మైదానంలో అడుగు పెట్టి ఆట మొదలు పెట్టింది.

‘నువ్వే నా ధైర్యం’ అనేవాడు రోహికను ఉద్దేశించి మిస్త్రీ.

భర్త జ్ఞాపకాలనే ధైర్యం చేసుకొని, శక్తిగా మలచుకొని ముందుకు కదిలింది రోహిక.

‘మిస్త్రీల శకం ముగిసింది’ అనుకునే సందర్భంలో ‘నేనున్నాను’ అంటూ వచ్చి గెలుపు జెండా ఎగరేసింది రోహిక మిస్త్రీ.

స్టాక్ మార్కెట్ చరిత్రలో ‘స్టార్’గా మెరిశాడు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా. పెట్టుబడి పాఠాల ఘనాపాఠీ రాకేష్‌కు భార్య ఎన్నో పాఠాలు చెప్పింది. అవి ఆరోగ్య పాఠాలు కావచ్చు. ఆత్మీయ పాఠాలు కావచ్చు. రేసులకు వెళ్లి ఏ అర్ధరాత్రో ఇంటికి వచ్చే భర్తను ఆ అలవాటు మానిపించింది. సిగరెటు అలవాటును దూరం చేసింది. ఆరోగ్యకరమైన జీవనశైలి దిశగా భర్తను అడుగులు వేయించింది.

తన పేరు, భార్య పేరులోని కొన్ని ఆంగ్ల అక్షరాలతో తన స్టాక్ బ్రోకింగ్ కంపెనీకి ‘రేర్’ అని పేరు పెట్టాడు రాకేశ్.

భర్త హఠాన్మరణం రేఖను కుంగదీసింది. చుట్టూ అలముకున్న దట్టమైన చీకట్లో వెలుగు రేఖ కరువైంది. అలాంటి దురదృష్టపు రోజుల్లో వేధించే జ్ఞాపకాలను పక్కనపెట్టి వెలుగు దారిలోకి వచ్చింది రేఖ.

‘ఆరు నెలలు సహవాసం చేస్తే వారు వీరవుతారు’ అనే సామెత ఉంది.

అది నిజమో కాదో తెలియదుగానీ ‘యూనివర్శిటీ ఆఫ్ ముంబై’లో చదువుకున్న రేఖ భర్త రాకేశ్‌లో ఒక విశ్వవిద్యాలయాన్ని దర్శించింది. అక్కడ ఎన్నో పాఠాలు నేర్చుకుంది.

భర్త బాటలోనే ఇన్వెస్టర్‌గా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనమైన విజయాలు సాధిస్తోంది రేఖ ఝున్‌ఝున్‌వాలా.

బ్యూటిప్స్

ముఖం మెరుపులీనాలంటే..?



టమాటాను గుండ్రంగా కట్ చేసి ఒక ముక్కను తీసుకుని పంచదారలో ముంచాలి. తరువాత ఈ ముక్కను ముఖంపై సున్నితంగా రుద్దాలి. పదినిమిషాల తరువాత నీళ్లతో కడుక్కోవాలి. తరువాత స్పూను శనగ పిండి, అరస్పూను అలోవెరా జెల్, రెండు స్పూన్ల టొమాటో రసం, అర స్పూను తేనె వేసి పేస్టులా కలుపుకోవాలి. ఈపేస్టుని ముఖానికి ఫేస్‌ప్యాక్‌లా వేసుకుని ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేస్తే ముఖంపై ఉన్న మృత కణాలు, ట్యాన్ పోయి ముఖం కాంతిమంతమవుతుంది.

భ్రమణ కాంక్ష


శశి, గునీత్, అనుష

పర్వత పుత్రికలు

హిమాలయాలు... వింధ్య పర్వతాలు... వీటిని చూడాలని ఎవరికి ఉండదు? రాబోయే వేసవి సెలవుల్లో పర్వత సౌందర్యం చూడాలని చాలామంది అనుకుంటారు. కాని ఆరోగ్య, వయసు సమస్యలు, దివ్యాంగ పరిమితులు కొందరిని భయపెట్టవచ్చు. అయితే ఎవరికైనా సరే పర్వతాలను దగ్గరుండి చూపిస్తాం అంటున్నారు ముగ్గురు మహిళా ట్రెక్ గైడ్లు – శశి, గునిత్, అనుష. పిల్లల నుంచి వృద్ధుల వరకూ అందరికీ వీరు ఆపరేట్ చేస్తున్న ట్రెక్ టూర్లు అద్భుత పర్వత దర్శనం చేయిస్తున్నాయి.

‘కలగను.. కనుగొను’ అనే ట్యాగ్‌లైన్ ఉంటుంది అనుష, శశి, గునీత్ నడిపే ‘బొహెమియన్ అడ్వంచర్స్’ అనే ట్రెకింగ్ ఏజెన్సీకి. లోకాన్ని చూసి రావాలన్న కలను నెరవేర్చుకోవడానికి దారిని కనుగొనమని, ఆ దారి కనుగొనడంలో తాము సాయం చేస్తామని అంటారు వీరు ముగ్గురు.

మన దేశంలో పూర్తిగా స్త్రీలు మాత్రమే నడుపుతున్న ట్రెకింగ్ ఏజెన్సీలలో వీరిది ఒకటి. అయితే వీరి ప్రత్యేకత అంతా పర్వతాలే. ‘డెహరాడూన్‌లో మా ఆఫీస్ ఉంటుంది. ఉత్తరాఖండ్‌లో, లద్దఖ్‌లో, హిమాలయాల బేస్ క్యాంప్ వరకు, వింధ్య పర్వతాల్లో మేము పర్వతారోహణకు తీసుకెళతాం. ప్రతి ముగ్గురు టూరిస్టులకు ఒక గైడ్ అనే పద్ధతిని మేము పాటిస్తాం.అందుకే వృద్ధులు, పిల్లలు, ఒంటరి స్త్రీలు... ఎవరైనా సరే క్షేమంగా మాతో పాటు ట్రెకింగ్ చేయవచ్చు. మా గైడ్లు కూడా స్త్రీలే. అందుకే మేము నిర్వహించే పర్వత యాత్రలకు విశేషంగా టూరిస్టులు వస్తారు’ అంటుంది శశి బహుగుణ.

2013లో మొదలు

బ్యాంకింగ్ రంగంలో పని చేసే శశి బహుగుణది డెహ్రాడూన్. పబ్లిషింగ్ రంగంలో పని చేసిన గునిత్ పురిది రుద్రపూర్ (ఉత్తరాఖండ్). గతంలో బిజినెస్ జర్నలిస్ట్‌గా పని చేసిన అనుష సుబ్రమణియన్‌ది ముంబై. వీరు ముగ్గురికీ పర్వతారోహణ అంటే చాలా ఇష్టం. తరచూ చేసే ట్రెక్కింగ్‌లో ఒకరికి ఒకరు పరిచయం అయ్యారు. అయితే 2013లో ఉత్తరాఖండ్‌లో వచ్చిన వరదలు వీరు ముగ్గురిని కదిలించాయి. వెంటనే పనులన్నీ ఆపి వరద ప్రాంతాలకు చేరుకుని సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యాటకులను కాపాడారు. ఆ సమయంలోనే వారికి అనిపించింది పర్యాటకులను సురక్షితంగా ఉంచే పర్వతారోహణ యాత్రలను నడిపే సంస్థను ప్రారంభించాలని. ‘అబ్రహం లింకన్‌ను గుర్తు చేసుకున్నాం. పర్వతాల వలన పర్వతాల చేత పర్వతాల కొరకు ఇకపై బతకాలని నిర్ణయించుకున్నాం’ అంది శశి బహుగుణ. ట్రెకింగ్‌ను ఎక్కువగా శశి ప్లాన్ చేస్తుంది. గునిత్ వాహనాలు నడపడంలో ఎక్స్‌పర్ట్. వంటలో కూడా. అనుష మంచి గైడ్. ‘అందువల్ల మేము కారులో హిమాలయాల్లోని ప్రతి మూల తిరిగాము. మాకు తెలియని పర్వత దారులు లేవు’ అంటారు వారు.

ప్రతి ఒక్కరికి హక్కుంది

‘పర్వతారోహణ అంటే వయసు, ఆరోగ్యం ఉన్నవాళ్లనే అందరూ అనుమతిస్తారు. కాని మేము ఆ నియమం పెట్టుకోలేదు. ఇన్‌క్లూజివ్ ట్రెకింగ్స్‌ను నిర్వహించాలనుకున్నాం. అనారోగ్యం ఉన్నవారిని, దివ్యాంగులను కూడా ఆరోహణకు తీసుకెళ్లాలనుకున్నాం. ఎందుకంటే పర్వతాలు అందరివి. అందరికీ వాటిని చూసే హక్కుంది. అందుకే పర్వతాలు చూడాలనుకుని వచ్చేవారి హెల్త్ హిస్టరీ అంతా చెక్ చేస్తాం. వారికి ఇవ్వాల్సిన శిక్షణ ఇస్తాం. అంధులను కూడా చేయి పట్టి 50 కిలోమీటర్ల దూరం మేరకు ట్రెకింగ్‌కు తీసుకెళ్లిన అనుభవం మాకు ఉంది. పార్కిన్‌సన్ వ్యాధి ఉన్నవాళ్లను కూడా తీసుకెళ్లాం. డయాబెటిక్ పేషెంట్లు కూడా వచ్చారు. అయితే ప్రతి దశలో ఆరోగ్యం చెక్ చేయిస్తూ తీసుకెళతాం. మరీ జటిలంగా మారితే వెంటనే హెలికాప్టర్ తెప్పించి వెనక్కు పంపించేస్తాం’ అంటారు వారు.


పర్వతాల మధ్య క్యాంప్

పహాడీ గైడ్లు

అనుష, శశి, గునిత్‌లు తాము నడుపుతున్న ట్రెకింగ్‌ల కోసం స్థానిక యువతులను గైడ్లుగా తీసుకుని వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ‘అందరూ కొండప్రాంతం వారే. లోకల్ గిరిజన యువతులు. వారికి పర్వతాలు కొట్టిన పిండి. అందుకని వారికి తగిన శిక్షణ ఇచ్చి మా టీమ్‌లో కలుపుకున్నాం. మా దృష్టి ముఖ్యంగా 40 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న స్త్రీలపై ఉంటుంది. వీరు పిల్లలు ఎదిగొచ్చాక పర్యటనలకు వెళదామనుకుంటారు. అటువంటి వారికి సురక్షితమైన ఏజెన్సీలు ఉన్నాయని తెలియాలి. వారు ఊపిరి పీల్చుకుంటే కుటుంబ కార్యక్రమాల్లో మళ్లీ ఫ్రెష్‌గా పడతారు. మా విన్నపం ఏమంటే ఒంటరిగా తిరగాలనుకున్నా మంచి ఏజెన్సీలను చూసి వెళ్లండి వెళ్లనివ్వండి అని చెప్పడమే’ అంటారు.

పర్వతాలను చూపడానికి చుక్కానులుగా మారిన ఈ ముగ్గురు అభినందనీయులు.

సైబర్ టాక్

మీ ఫాలోవర్స్ అసలా? నకిలీనా?


ప్రతీకాత్మక చిత్రం

సౌజన్య (పేరుమార్చబడినది) సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటుంది. రాత్రి తను చేసిన పోస్ట్‌కు ఉదయం విపరీతంగా లైక్స్ రావడం, ఫాలోవర్స్ పెరగడం చూసి తెగ సంతోషించింది. ఒకట్రెండు రోజులు సజావుగా సాగినా ఆ తర్వాత నుంచి ప్రచార వస్తువుల గురించి ప్రకటనలు పెరిగాయి. తన చేసిన పోస్ట్‌లకు చెడుగా కామెంట్స్ పెడుతున్నారు. దీని వల్ల తన పేరు దెబ్బతింటుందనే ఆందోళన ఆమెను విపరీతమైన టెన్షన్‌కు గురిచేసింది.

సోషల్ మీడియా సొసైటీలో ఫాలోవర్స్, లైక్స్, కామెంట్స్‌ను బట్టి విలువకట్టే రోజులు ఇవి. సినిమా స్టార్స్‌తోపాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు కూడా పెద్ద సంఖ్యలో అభిమానులు ఉంటారు. ఈ ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ సేవల గురించే కాదు, వస్తువుల బ్రాండ్‌లతో వినియోగదారులను ఆకట్టుకుంటుంటారు. అయితే, బ్రాండ్ ఎండార్స్‌మెంట్లను నిర్వహించే వ్యాపారాల దృష్టిని ఆకర్షించడానికి స్టార్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఫాలోవర్స్‌ను కొనుగోలు చేస్తుంటారు. ఇది ఒక పోటీలా మారుతుంటుంది. దీనిని గుర్తించిన నకిలీ ఫాలోవర్స్ అధిక సంఖ్యలో పుట్టుకొస్తుంటారు. తమ మోసాలకు కొత్త తెర తీస్తుంటారు. దీనివల్ల ఆదాయ మార్గాలకు గండికొట్టడం, పేరు ప్రతిష్ఠలు దెబ్బతీయడం వంటివి జరుగుతుంటాయి.

నిజమైన ఫాలోవర్స్‌ను ఎలా పొందాలంటే..

● ఆకర్షణీయమైన కంటెంట్‌ను సృష్టించాలి. మీ కంటెంట్ ప్రేక్షకులకు సమాచారంగా, వినోదాత్మకంగా, చూడటానికి ఆకర్షణీయంగా ఉండాలి. క్వాలిటీ ఫొటోలు, వీడియోలు వాడాలి. ●ట్రెండింగ్ హ్యాష్‌ట్యాగ్‌ను ఉపయోగించాలి. ● క్రమం తప్పకుండా పోస్ట్ చేయడం వల్ల మీ ప్రేక్షకులు మీ కంటెంట్‌పై ఆసక్తిని కలిగి ఉంటారు. ● వ్యాఖ్యలు, సందేశాలకు ప్రతిస్పందించడం, అభిప్రాయాలను అడగడం, సంభాషణలను ప్రారంభించడం ద్వారా వీక్షకులతో సన్నిహితంగా ఉండాలి. ఇది ఫాలోవర్స్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి సహాయపడుతుంది. ● పోటీలు, బహుమానాలను ప్రకటించడం వల్ల కొత్త ఫాలోవర్లు పెరుగుతారు. మీ ఫాలోవర్లకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించవచ్చు. ● మీ వెబ్‌సైట్, ఇతర సోషల్ మీడియా అకౌంట్స్‌ను ప్రచారం చేసేలా ఉండాలి. దీనివల్ల చూసేవారి సంఖ్య పెరగడంతోపాటు కొత్త ఫాలోవర్లను ఆకర్షించడానికి సహాయపడుతుంది.

నకిలీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు...

● ఇతరులను కించపరిచేలా ప్రతికూల కథనాలను, సమీక్షలు రాస్తారు.
● వారి వ్యూవర్‌షిప్‌ను పెంచడానికి మోసపూరిత ఫొటోలను పోస్ట్ చేస్తారు.
● నకిలీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, పెట్టుబడులు పెట్టాలని సిఫార్సు చేస్తూ, అవి తమకు తాముగా ప్రయోజనం పొందేలా చూస్తారు.

నకిలీ ఫాలోవర్లు ఏం చేస్తారంటే..

● కృత్రిమంగా ఫాలోవర్లను పెంచే ప్రయత్నంలో సోషల్ మీడియా ఖాతాలను ఫాలో అవడానికి ఆటోమేటెడ్ అకౌంట్స్‌ను రూపొందిస్తారు. ● ఫాలోవర్ కౌంట్, లైక్స్, కామెంట్స్ మళ్లించేందుకు వాస్తవంగా కంటే ఎక్కువ జనాదరణ లేదా ప్రభావవంతమైనదిగా కనిపించేలా చేయడానికి అకౌంట్లు సృష్టించబడతాయి. వీటిని థర్డ్‌పార్టీ ప్రొవైడర్ల నుంచి కొనుగోలు చేయచ్చు. లేదా నకిలీ ఖాతాలను సృష్టించే ప్రక్రియను ఆటోమేట్ చేసే సాఫ్ట్‌వేర్ సాధనాలను ఉపయోగించి సృష్టించవచ్చు. ● నకిలీ ఫాలోవర్లు అనైతికంగా ప్రవర్తిస్తారు. భవిష్యత్తులో మీ బ్రాండ్‌నేమ్‌ని దెబ్బతీస్తారు. వినియోగదారులు నిజమైన వ్యక్తులతో సన్నిహితంగా ఉండేలా ఫేక్ అకౌంట్స్‌ను క్రమం తప్పకుండా తొలగించాలి.

నకిలీ అకౌంట్స్‌ను గుర్తించవచ్చు..

సోషల్ మీడియా ఫాలోవర్లను గుర్తించడం సవాల్‌గా ఉంటుంది. అయితే, నిజమైన వినియోగదారుల నుండి వీరిని వేరు చేయడంలో సహాయపడే కొన్ని సూచికలు...

● నకిలీ ఖాతాలో ప్రొఫైల్ సమాచారం ఉండదు. ప్రొఫైల్ ఫొటో సరైనది ఉండదు. బయో, లొకేషన్ వంటి అసంపూర్ణమైన లేదా ఖాళీ ప్రొఫైల్ ఉంటుంది.
● వీరి ఖాతాలో అతి సాధారణ కంటెంట్ ఉంటుంది. పోస్ట్‌కు ప్రతిస్పందనగా ఎమోజీలు ఉంటాయి. లేదా సంబంధం లేని వెబ్‌సైట్ లింక్‌లతో స్పామ్ కామెంట్స్ వదిలేయవచ్చు. ● వీరి ఖాతాలకు చాలా తక్కువ మంది ఫాలోవర్లు ఉంటారు. కానీ, వీరు పెద్ద సంఖ్యలో ఇతర ఖాతాలను ఫాలో చేస్తుంటారు. ● ఇతరులతో ఎలాంటి ఇంటరాక్షన్ ఉండదు. కంటెంట్‌ను షేర్ చేయడం లేదా ఇతర యూజర్స్‌కి మెసేజ్‌లు, పోస్ట్‌లు.. అప్‌లోడ్ చేయడం నకిలీ అకౌంట్స్ వారు చేయరు.
● ఫాలోవర్ కౌంట్‌లో ఆకస్మిక పెరుగుదల ఉంటే అనుమానించాలి.

నకిలీ ఖాతాల గురించి రిపోర్ట్ చేయడానికి...

మీ డేటాను యాక్సెస్ చేయకుండా అకౌంట్‌ను బ్లాక్ చేయవచ్చు.
లేదంటే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు నివేదించవచ్చు.

https://www.facebook.com/help/306643639690823
https://help.twitter.com/en/rules-and-policies/platform-manipulation
https://www.linkedin.com/help/linkedin/answer/a1338436/report-fake-profiles?lang=en
https://help.instagram.com/446663175382270



ఇన్‌పుట్స్: అనిల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

నేడు, రేపు ఎండ ఎక్కువే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. ఉపరితలద్రోణి ప్రభావంతో నాలుగైదు రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదు కాగా... ప్రస్తుతం సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురు, శుక్రవారాల్లో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నారాయణపేట్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని సూచించింది. బుధవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 39.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్, హకీంపేట్‌లో 21.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	41.9	20.2
రెంటచింతల	41.4	26.3
ఆదిలాబాద్	39.8	22.2
భద్రాచలం	39.5	26.5
ఖమ్మం	39.2	25.0
నిజామాబాద్	39.1	24.8
మహబూబ్‌నగర్	38.8	25.0
మెదక్	38.4	21.5
కడప	38.2	26.2
రామగుండం	38.0	23.8
హనుమకొండ	37.0	23.5
నల్లగొండ	37.0	22.6
హకీంపేట్	36.1	21.5
దుండిగల్	36.0	23.3
హైదరాబాద్	36.2	24.7
విజయవాడ	36.0	26.0

క్లుప్తంగా...

కాణిపాకంలో శాస్త్రోక్తంగా తిరుమంజన సేవ



తిరుమంజనం సేవకు ముందు ఆలయాన్ని శుద్ధి చేస్తున్న ఈవో వెంకటేశు తదితరులు

యాదమరి(చిత్తూరు జిల్లా): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో తిరుమంజన సేవను బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ముందుగా మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకటేశు మాట్లాడుతూ ప్రతి బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తిరుమంజన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నీ కాల్మొక్తా సార్.. నా కొడుకు భవిష్యత్ కాపాడండి

- హెచ్‌ఎం కాళ్లపై పడి రోదించిన విద్యార్థి తల్లి



హెచ్‌ఎం పవన్‌కుమార్ కాళ్లపైపడి రోదిస్తున్న సునీత, పక్కన తరుణ్, రమేష్

కారేపల్లి: ''నీ కాల్మొక్తా సార్.. నా కొడుకు భవిష్యత్‌ను కాపాడండి.. ఎలాగైనా సరే నా కొడుకు పదో తరగతి పరీక్ష రాసేలా చేయండి సార్'' అంటూ ఓ తల్లి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి కాళ్లపై పడి రోదించింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం వెంకిట్యాతండాకు చెందిన గుగులోతు రమేష్ – సునీత దంపతుల కుమారుడు తరుణ్.. గతేడాది కారేపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదివాడు. అయితే గణితంలో ఫెయిల్ అయ్యాడు. దీంతో ఈ ఏడాది పరీక్ష రాసేందుకు హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ సులోచనకు పరీక్ష ఫీజు రూ.150తో పాటు ఆలస్యమైనందుకు అదనపు రుసుము రూ.వెయ్యి కూడా చెల్లించాడు. అయితే, ఆమె సెలవులో వెళ్తూ హెచ్‌ఎం పవన్‌కుమార్‌కు ఫీజు ఇచ్చినట్లుగా చెబుతోంది. బోర్డుకు మాత్రం ఫీజు అందకపోవడంతో తరుణ్‌కు హాల్‌టికెట్ రాలేదు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులు స్కూల్లో అడగ్గా.. ఎవరికి వారు తమకు సంబంధం లేదని చెబుతూ చివరకు తాము బోర్డుకు ఫీజు చెల్లించలేదని ఒప్పుకున్నారు. ఏం చేయాలో తెలియని తరుణ్ తల్లిదండ్రులు బుధవారం కారేపల్లి హైస్కూల్‌కు చేరుకుని హెచ్‌ఎం పవన్‌కుమార్ కాళ్లపై పడి రోదిస్తూ ఎలాగైనా తమ కుమారుడి భవిష్యత్‌ను కాపాడాలని వేడుకున్నారు.

డాలర్ డౌన్‌ఫాల్!

దొడ్డ శ్రీనివాసరెడ్డి



➤ గ్లోబల్ కరెన్సీగా అమెరికన్ డాలర్‌కు ఉన్న పట్టు క్రమంగా సడలిపోతోంది. డాలర్‌కు వ్యతిరేకంగా సొంత కరెన్సీలను బలోపేతం చేసుకోవాలనుకుంటున్న దేశాల సంఖ్య పెరిగిపోయింది. ఈ దేశాల జాబితాలో ఇప్పుడు భారత్ కూడా చేరింది. ప్రస్తుతం దాదాపు అన్ని దేశాల విదేశీ మారకద్రవ్య నిల్వల్లో అమెరికన్ డాలర్లే 60 శాతానికి పైగా ఉన్నాయి. అంతర్జాతీయ వాణిజ్యం, రుణాలు, సెక్యూరిటీల లావాదేవీల్లో సగానికి పైగా డాలర్లలోనే సాగుతున్నాయి. ఇక విదేశీ కరెన్సీల ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లలో మొత్తం అన్ని కరెన్సీలను కలుపుకొన్నా 90 శాతం ట్రేడింగ్ అమెరికన్ డాలర్ల ద్వారానే జరుగుతోంది. ఇక ముందు ఈ పరిస్థితి మారబోతోంది. డాలర్‌పై ఆధారపడటం మాని సొంత కరెన్సీలను బలోపేతం చేసుకోవాలనే కోరికతో అనేక దేశాలు ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకుంటున్నాయి. సమీప భవిష్యత్‌లోనే గ్లోబల్ కరెన్సీ స్థానాన్ని అమెరికన్ డాలర్ కోల్పోయే ప్రమాదం వచ్చింది.

ఇలా మొదలైంది..

➤ బ్రెట్టన్‌వుడ్ ఒప్పందంతో అమెరికన్ డాలర్ పెత్తనం మొదలైంది.రెండో ప్రపంచ యుద్ధ కాలంలో కుదేలైన అనేక దేశాలు ముఖ్యంగా యూరప్ దేశాలు అనేకానేక ఉత్పత్తుల కోసం అమెరికాపై ఆధారపడాల్సి వచ్చింది. వాణిజ్య ఒప్పందాల్లో డాలర్ విలువ ఎలా ఉండాలనే విషయమై ఐక్యరాజ్యసమితి ద్రవ్య, ఆర్థిక సదస్సు అమెరికా న్యూ హాంప్‌షైర్‌లోని బ్రెట్టన్‌వుడ్‌లో జరిగింది. 44 దేశాలు పాల్గొన్న ఈ సమావేశంలో అంతర్జాతీయంగా బంగారు ధరలను డాలర్ విలువకు జతచేస్తూ ఒప్పందం చేసుకున్నాయి. దాంతో ఇతర కరెన్సీల విలువను డాలర్ మారక విలువ కోసం ఈ ఒప్పందం ప్రాతిపదికైంది. ఒక డాలర్ విలువ ఒక ఔన్స్ (31.1034768 గ్రాములు) బంగారంతో సమానమైంది. 1970లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ డాలర్ విలువను బంగారు ధరకు జత చేయడాన్ని రద్దు చేసినప్పటికీ అప్పటికే డాలర్ నిల్వలు అన్ని దేశాల్లో పెరిగిపోయి గ్లోబల్ కరెన్సీగా అవతరించింది. పనామా, ఎల్ సాల్వడార్, జింబాబ్వే లాంటి 11 దేశాలు ఇప్పటికీ అమెరికన్ డాలర్‌నే తమ దేశాల్లో అధికారిక కరెన్సీగా చెలామణి చేస్తున్నాయి. డాలర్ శక్తిసామర్థ్యంతో రెచ్చిపోయిన అమెరికా అనేక సందర్భాల్లో ఆ డాలర్‌నే ఆయుధంగా వాడుకుంది. ఉక్రెయిన్‌లో భాగమైన క్రిమియాను రష్యా ఆక్రమించుకున్నప్పుడు వివిధ బ్యాంకుల్లో రష్యా నిల్వ చేసిన 64,000 కోట్ల డాలర్లను అమెరికా జప్తు చేసింది. రష్యా విదేశీ మారక నిల్వల్లో ఇది సగానికి పైగా ఉంది. ఇలాంటి ప్రయోగమే వివిధ సందర్భాల్లో అఫ్గానిస్తాన్, ఇరాన్, వెనెజులా వంటి దేశాలపై అమెరికా ప్రయోగించింది. అమెరికా ఆంక్షలను ఉల్లంఘించిన బ్యాంకులపై పెద్ద మొత్తంలో జరిమానాలు కూడా విధించింది.



'గ్లోబల్ కరెన్సీ' ప్రాభవం కోల్పోతున్న అమెరికన్ డాలర్

➤ క్రిమియా ఆక్రమణ నేపథ్యంలో అమెరికా విధించిన ఆంక్షలను ఎదుర్కొనడానికి 2014లో రష్యా చైనాతో చేతులు కలిపి డాలర్‌కు వ్యతిరేకంగా వాణిజ్య ఒప్పందాలు చేసుకుంది. దీంతో గ్లోబల్ కరెన్సీగా చెలామణి అవుతున్న అమెరికన్ డాలర్‌కు పెద్ద సవాల్ మొదలైంది. రష్యా, చైనా మధ్య జరిగే అన్ని వ్యాపార లావాదేవీల్లో మారక ద్రవ్యంగా రూబుల్-యువాన్‌లు వినియోగించాలని ఈ రెండు దేశాలు నిర్ణయించాయి. అంతేకాదు రష్యా తన విదేశీ మారకద్రవ్య నిల్వల్లో అధికశాతం చైనా యువాన్ కరెన్సీని సమకూర్చుకోవాలని కూడా నిర్ణయించింది. దాంతో గత ఏడాదికి రష్యా విదేశీ మారక నిల్వల్లో యువాన్ 60 శాతానికి పెరిగినట్లు రష్యా ఆర్థిక శాఖ ప్రకటించింది. అలాగే డాలర్ స్థానంలో తమ సొంత కరెన్సీల్లోనే వ్యాపారం నిర్వహించాలని ఇటీవల చైనా, బ్రెజిల్ నిర్ణయించాయి. లాటిన్ అమెరికాలో అతిపెద్ద ఆర్థికశక్తి అయిన బ్రెజిల్‌తో చైనా చేసుకున్న ఒప్పందం కారణంగా డాలర్ పెత్తనానికి మరో పెద్ద సవాల్ ఏర్పడింది. బ్రెజిల్ రీస్ చైనా యువాన్ బంధం డాలర్ ఆధిపత్యాన్ని నిలువరించింది. గత ఏడాది ఈ రెండు దేశాల మధ్య 15,000 కోట్ల డాలర్ల విలువైన వాణిజ్యం జరిగింది. డాలర్, యూరో, యెన్, పౌండ్‌లకు బదులు తమ దేశాల కరెన్సీలతోనే వ్యాపారం సాగించాలనే ఏకైక ఎజెండాతో ఆగ్నేయాసియా దేశాల ఆర్థిక మంత్రిత్వ శాఖలు, ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు ఇటీవల అధికారిక సమావేశం నిర్వహించాయి.

తొలుత రష్యాలో..

➤ గత జనవరిలో దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి నలెది పాండోర్ ఒక ఇంటర్వ్యూలో 'బ్రిక్, (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయ మారకాన్ని ఆవిష్కరించాలని కోరుకుంటున్నాయి'అని వెల్లడించారు. సౌదీ అరేబియా ఆర్థిక మంత్రి మహమ్మద్ అల్-జదాన్ ఇటీవల మరో బాంబు పేల్చారు. చమురు వ్యాపారంలో డాలర్‌కు ఇతర కరెన్సీల వినియోగంపై చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. అమెరికా మిత్ర దేశమైన సౌదీ అరేబియా నుంచి ఇలాంటి ప్రకటన రావడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపింది. అంతర్జాతీయంగా చమురు వాణిజ్యం దాదాపుగా అమెరికన్ డాలర్లలోనే జరుగుతుంది. అందుకే దాన్ని పెట్రోడాలర్‌గా పిలుస్తారు. చమురు ఎగుమతుల్లో ఒపెక్ (చమురు ఉత్పత్తి చేసే దేశాలు) దేశాల్లో అగ్రస్థానంలో నిలిచే సౌదీ అరేబియా ఇతర కరెన్సీల్లో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తే అమెరికన్ డాలర్ ఆధిపత్యానికి చరమగీతం పాడినట్లేనని అంతర్జాతీయ నిపుణుల అభిప్రాయం. భారత్-రష్యా మధ్య కూడా వాణిజ్యం అమెరికన్ డాలర్‌లో కాకుండా ఇతర కరెన్సీల్లో జరుగుతోంది. భారతీయ సంస్థలు రష్యా నుంచి చేసుకున్న దిగుమతులకు అరబ్ ఎమిరేట్స్ కరెన్సీ దినార్‌ను వినియోగించేవి. ఇప్పుడు రూబుల్‌లో చెల్లింపులు చేస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభానికి వివిధ దేశాల విదేశీ మారక నిల్వల్లో అమెరికన్ డాలర్ వంతు 59 శాతానికి తగ్గిపోయింది. ఇది 1999 నాటికి 70 శాతం ఉండేదని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పేర్కొంది.

70 శాతం నుంచి 59 శాతానికి..

➤ భారత్ కూడా తన రూపాయిని అంతర్జాతీయ కరెన్సీగా ఆవిష్కరించే దిశలో చర్యలు మొదలుపెట్టింది. అనేక దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయాన్ని వెతుకుతున్న తరుణంలో డాలర్, యూరో, యెన్, పౌండ్‌లతో దీటుగా రూపాయిని గ్లోబల్ కరెన్సీగా చెలామణి చేసేందుకు తొలి అడుగులు వేసింది. రూపాయిని మారక విలువగా వినియోగించేందుకు వీలుగా ఆర్‌బీఐ రష్యా, శ్రీలంకతోపాటు మొత్తం 18 దేశాల్లోని 60 బ్యాంకుల్లో వోస్ట్రో అకౌంట్లను ప్రారంభించింది. అంతర్జాతీయ

ఇక భారత్ వంతు..

వాణిజ్య లావాదేవీలను రూపాయి ద్వారా నిర్వహించడానికి వీలుగా ఆర్‌బీఐ ఈ అకౌంట్లను ప్రారంభించిందని భారత ఆర్థిక శాఖ సహాయమంత్రి భగవత్ కరాడ్ ప్రకటించారు. రూపాయితో వ్యాపారం చేయడానికి ఒప్పుకున్న దేశాల్లో బ్రిటన్, మలేషియా, రష్యా, సింగపూర్, న్యూజిలాండ్, శ్రీలంక, మయన్మార్, బోట్స్వానా, ఇజ్రాయెల్, ఫిజీ, ఒమన్, జర్మనీ, కెన్యా, గయానా, మారిషస్, టాంజానియా, ఉగాండా దేశాలున్నాయి. అమెరికా వాల్‌స్ట్రీట్‌లో 'డాక్టర్ డూమ్'గా పేరుపడ్డ ఆర్థికవేత్త నౌరియల్ రుబిని 'రానున్న రోజుల్లో భారత రూపాయి అంతర్జాతీయ విపణిలో అతి ముఖ్యమైన విదేశీ మారకద్రవ్యంగా అవతరించబోతోంది'అన్నారు.

14లోగా సర్కారు స్పందిస్తుందా?

- పేస్కేల్ కోసం ఎన్నో ఏళ్లుగా 23వేల మంది వీఆర్‌ఏ కుటుంబాల ఎదురుచూపులు
- ప్రభుత్వం చర్చలు జరిపి 100 రోజులు దాటుతున్నా పట్టింపు లేదు
- అంబేడ్కర్ జయంతి నాటికి ప్రభుత్వం ప్రకటిస్తుందన్న ఆశ
- లేదంటే మళ్లీ ప్రత్యక్ష కార్యాచరణకి సిద్ధమంటున్న వీఆర్‌ఏ జేఏసీ

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ)గా పనిచేస్తున్న రాష్ట్రంలోని 23వేల మంది రెవెన్యూ సిబ్బంది కష్టాలు ఎప్పటికి తీరుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా.. నిరవధిక సమ్మె చేపట్టినా.. నిర్వేదంతో ప్రాణాలపై ఆశలు వదులుకుంటున్నా ప్రభుత్వం మాత్రం తమపై కనికరం చూపడం లేదని వీఆర్‌ఏలు వాపోతున్నారు. సమ్మె పూర్తయి ఆరునెలలు అవుతున్నా నేటికీ తమ డిమాండ్లు హామీలుగానే మిగిలిపోయాయని, ప్రభుత్వం కనీసం ఇప్పటికైనా స్పందించి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతున్నారు.

మూడే ప్రధాన డిమాండ్లు

వీఆర్‌ఏలు చాలా రోజుల నుంచి మూడంటే మూడే డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. తమకు పేస్కేల్ వర్తింపజేయాలని, అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, 50 ఏళ్లపైబడిన వీఆర్‌ఏల వారసులకు కారుణ్య ఉద్యోగాలు ఇవ్వాలన్న మూడు డిమాండ్లను ప్రభుత్వం ముందు పెడుతున్నారు. సాక్షాత్తూ సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలు, మంత్రి కేటీఆర్, అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్ సమక్షంలో జరిగిన చర్చలు ఫలితాన్ని ఇవ్వకపోగా, గత ఏడాదిలో 80 రోజుల పాటు చేసిన నిరవధిక సమ్మె తర్వాత కూడా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మిగిలిపోయిందని వాపోతున్నారు. ఇన్నాళ్లూ తమ గోడు ప్రభుత్వానికి చెప్పే ఉన్నతాధికారి (సీసీఎల్‌ఏ) లేరని భావించామని ఇప్పుడు కొత్త సీసీఎల్‌ఏగా నవీన్ మిత్తల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా పరిస్థితి అలానే ఉందంటున్నారు.

అంబేడ్కర్ జయంతి నాటికి

సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై మరోమారు ఒత్తిడి పెంచాలని వీఆర్‌ఏల జేఏసీ భావిస్తోంది. అంబేడ్కర్ జయంతి (ఏప్రిల్14) సందర్భంగానైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు. అప్పుడు కూడా ప్రభుత్వం స్పందించని పక్షంలో మరోసారి ప్రత్యక్ష కార్యాచరణకు దిగాలని భావిస్తున్నారు. అంబేడ్కర్ జయంతి తర్వాత ఏప్రిల్15న సమావేశమై భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించాలనే యోచనలో ఉన్నారు.

సీఎంపై ఇంకా నమ్మకముంది

తరతరాలుగా ఈ ఉద్యోగం చేస్తున్న తమను గుర్తించి తెలంగాణ రాగానే జీతాలు పెంచింది సీఎం కేసీఆరే. వీఆర్‌ఏలను పేస్కేల్ ఉద్యోగులుగా గుర్తిస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చింది కూడా ఆయనే. కొన్ని అనివార్య పరిస్థితుల దృష్ట్యా ఆలస్యం జరుగుతున్నప్పటికీ మాకు కేసీఆర్‌పై నమ్మకం ఉంది. రాష్ట్రంలోని 23వేల మంది వీఆర్‌ఏలకు ఆయన న్యాయం చేస్తారనే భరోసాతో ఉన్నాం.

– కర్ణకంటి రాజేశ్, డైరెక్ట్ రిక్రూటీ వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

తెలంగాణ నుంచి 1.5 లక్షల మంది విద్యార్థులు ● రాష్ట్రంలో 17 కేంద్రాల్లో పరీక్ష



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ విద్యా సంస్థలైన ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు గురువారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జరుగుతాయి. తెలంగాణలో ఈ పరీక్షల కోసం 17 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. జేఈఈ పరీక్షలకు సంబంధించి తొలుత విడుదల చేసిన షెడ్యూల్‌లో ఈ నెల 6వ తేదీనుంచి 12వ తేదీవరకు నిర్వహించనున్నట్టు పేర్కొంది. అయితే అభ్యర్థుల సంఖ్య పెరగడంతో 13, 15 తేదీల్లో కూడా ఈ పరీక్షను నిర్వహించేలా తాజాగా అడ్మిట్‌కార్డుల్లో పొందుపరిచింది. మొత్తంగా ఈనెల 6, 8, 10, 11, 12, 13, 15 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి.

రెండో సెషన్‌కే ఎక్కువమంది హాజరు

తొలిరోజు పరీక్ష రాసే వారి అడ్మిట్‌కార్డులను ఎన్‌టీఏ ముందు విడుదల చేసింది. తదుపరి రోజులకు సంబంధించి పరీక్షలు రాసే వారి అడ్మిట్‌కార్డులను వరుసగా ముందు రోజుల్లో వెబ్‌సైట్లలో పొందుపర్చనున్నారు. అభ్యర్థులు తమ పుట్టిన తేదీ, అప్లికేషన్ నెంబర్‌ను నమోదు చేయడం ద్వారా ఈ అడ్మిట్‌కార్డులను డౌన్లోడ్ చేసుకోవచ్చునని ఎన్‌టీఏ పేర్కొంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఈ అడ్మిట్‌కార్డు కాపీలతో పాటు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డును కూడా తీసుకురావాలని సూచించింది. జనవరిలో నిర్వహించిన మొదటి సెషన్ పరీక్షలకన్నా రెండో సెషన్‌కు ఎక్కువమంది హాజరుకానున్నారని ఎన్‌టీఏ విడుదల చేసిన అడ్మిట్ కార్డుల నోట్‌లో పేర్కొంది. జేఈఈ మెయిన్ తొలిసెషన్ పరీక్షలకు 8.6 లక్షల మంది హాజరు కాగా ఈసారి 9.4 లక్షల మంది పరీక్ష రాయనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 1.5 లక్షల మంది పరీక్ష రాసే వీలుంది. జనవరిలో నిర్వహించిన తొలి సెషన్ సమయంలో ఇంటర్ పరీక్షల సన్నద్ధతతో పాటు ప్రాక్టికల్ పరీక్షలు కూడా ఉండడంతో పరీక్ష రాసిన విద్యార్థుల సంఖ్య తక్కువే. అప్పుడు పరీక్ష రాయని వారితోపాటు రాసిన వారు కూడా రెండో సెషన్‌లో పరీక్షలు రాయనున్నారు.



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ శ్రీనివాస్‌రావుల సమక్షంలో బాధ్యతలు చేపట్టిన హైకోర్టు న్యాయవాదుల సంఘ నూతన కార్యవర్గ ప్రతినిధులు

వైభవంగా ముగిసిన శ్రీవారి వసంతోత్సవాలు



వసంత మండపానికి ఊరేగింపుగా బయలుదేరిన ఉత్సవమూర్తులు

తిరుమల: 3 రోజులుగా తిరుమలలోని వసంతోత్సవ మండపంలో వైభవంగా నిర్వహించిన సాలకట్ల వసంతోత్సవాలు బుధవారం పరిసమాప్తమయ్యాయి. తొలిరోజు, రెండవరోజు శ్రీ మలయప్ప స్వామివారు ఉభయ దేవేరులతో కలసి వసంతోత్సవంలో పాల్గొన్నారు. చివరిరోజున శ్రీ భూ సమేత మలయప్పస్వామితో పాటు శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వారు, శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు వసంతోత్సవంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి, సీతా రామలక్ష్మణ ఆంజేయస్వామి, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుల వారిని ఒకే వేదికపై భక్తులు దర్శించుకున్నారు.

'ఐడియాస్ ఫర్ ఇండియా' సదస్సుకు మంత్రి కేటీఆర్

- లండన్‌లో మే 11, 12 తేదీల్లో ద్వితీయ వార్షిక సదస్సు
- 'హౌస్ ఆఫ్ కామన్స్'లో కీలకోపన్యాసం చేయాలని ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: లండన్‌లో మే 11, 12 తేదీల్లో జరగనున్న 'ఐడియాస్ ఫర్ ఇండియా'ద్వితీయ సదస్సులో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఆర్థిక, వ్యూహాల సలహాల సంస్థ ఈపీజీ నుంచి ఆహ్వానం అందింది. తెలంగాణ ప్రభుత్వం సాధిస్తున్న ఆర్థిక పురోగతిని తెలుసుకునేందుకు కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఆయనకు పంపిన ఆహ్వాన లేఖలో ఈపీజీ పేర్కొంది. సదస్సుతో పాటు బ్రిటన్ లేబర్ పార్టీకి చెందిన ఎంపీ సీమా మల్హోత్రా హౌస్ ఆఫ్ కామన్స్‌లో నిర్వహించే విందుకు రావాలని, అలాగే యూకే కేబినెట్ మంత్రితో పాటు కీలకోపన్యాసం చేయాలని ఆహ్వానించారు. బ్రిటన్ వ్యాప్తంగా ఇండియా వీక్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సుమారు 800 మందికి పైగా వ్యాపార, వాణిజ్య, మీడియా, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

23 రోజుల పాపకు సీపీఆర్

ప్రాణం కాపాడిన 108 సిబ్బంది



చిన్నకోడూరు(సిద్దిపేట):పాపకు స్నానం చేయిస్తుండగా వేడి నీళ్లు మింగడంతో శ్వాస ఆగిపోయింది. 108 సిబ్బంది సీపీఆర్ చేసి పాప ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లాలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బిహార్‌కు చెందిన ప్రేమ్‌నాథ్ యాదవ్, కవిత దంపతులు పనిచేస్తున్నారు. వీరికి 23 రోజుల వయసున్న బేబీ సుబ్బలక్ష్మి ఉంది. ఆ పాపకు స్నానం చేయిస్తుండగా వేడి నీళ్లు మింగింది. దీంతో శ్వాస ఆగిపోయింది. వెంటనే గ్రామానికి చెందిన ఏఎన్‌ఎం తిరుమల, ఆశావర్కర్ సుగుణ 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అశోక్, వెంకట్ అక్కడకు చేరుకుని పరీక్షించి.. బేబీ గుండె, నాడీ కొట్టుకోవడం లేదని గమనించారు. వెంటనే ఈఆర్‌సీపీ డాక్టర్ చక్రవర్తికి విషయం చెప్పి, ఆయన సూచనల ప్రకారం ప్రథమ చికిత్స (సీపీఆర్) చేస్తూ సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బేబీ ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని బంధువులు, హాస్పిటల్ సిబ్బంది అభినందించారు.

పోటెత్తిన కొండగట్టు

వైభవంగా హనుమాన్ చిన్నజయంతి వేడుకలు



భక్తజన సంద్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలు

కొండగట్టు(చొప్పదండి):జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ చిన్నజయంతి వేడుకలు బుధవారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాలకు చెందిన దీక్షాస్వాములు, మాలలు ధరించిన భక్తులు, సాధారణ భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకున్న తర్వాత దీక్ష, మాల విరమణ చేశారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నా రు. బుధవారం అర్ధరాత్రి వరకు సుమారు లక్షమంది భక్తులు తరలివచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కోటికి చేరువలో కంటి పరీక్షలు

- 28 శాతం మందికి కళ్ల సమస్యలు
- రెండో విడత కంటి వెలుగులో గుర్తింపు
- తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కంటి సమస్యలు ఉన్నవారు గణనీయంగానే ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కంటి పరీక్షల్లో పలు సమస్యలు వెలుగుచూస్తున్నాయి. ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల్లో వివిధ రకాల కంటి సమస్యలు ఉన్నవారు 28.28 శాతం ఉన్నారని తేలింది. ఈ ఏడాది జనవరి 18న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా రెండో విడత కంటి వెలుగు ప్రారంభమైన సంగతి తెలిసిందే. 48 పనిదినాల్లో ఇప్పటి వరకు 99.81 లక్షల మందికి కంటి పరీక్షలు చేయగా, ఇందులో 48.83 లక్షల మంది పురుషులు, 52.88 లక్షల మంది స్త్రీలు, 3279 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారు. వివిధ రకాల కంటి సమస్యలున్నవారిలో 16.11 లక్షల మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేశారు. చత్వారీ సమస్యలున్న 12.11 లక్షల మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులు ఇవ్వాలని నిర్ణయించారు. వీరే 28.28 శాతం ఉన్నారు. కాగా, 71.58 లక్షల మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్ధారించారు.

ప్రిస్కిప్షన్ గ్లాసుల పంపిణీలో జాప్యం

కంటి డాక్టర్లు రాసిన ప్రిస్కిప్షన్ గ్లాసులను నెల రోజుల్లో ఇవ్వాల్సి ఉండగా, చాలాచోట్ల ఆలస్యం అవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. వాటిని నిర్ణీత సమయంలో తెప్పించడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలున్నాయి. కాగా, దృష్టి లోపాలు సవరించేందుకు 2018 ఆగస్టు 15న తొలి విడత కంటి వెలుగు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ కార్యక్రమం 8 నెలలపాటు కొనసాగింది. కోటిన్నర మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. 50 లక్షల కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఇదే స్ఫూర్తితో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని వంద పని దినాల్లో పూర్తి చేసి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలని వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో శుబ్‌మన్ గిల్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన బ్యాటింగ్ తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ ఒక స్థానం పురోగతి సాధించి ఐదు నుంచి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. భారత్‌కే చెందిన విరాట్ కోహ్లి ఆరో ర్యాంక్‌లో, రోహిత్ శర్మ ఎనిమిదో ర్యాంక్‌లో ఉన్నారు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.



కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో జేసన్ రాయ్

ఇంగ్లండ్ జట్టు డాషింగ్ ఓపెనర్ జేసన్ రాయ్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు రూ. 2 కోట్ల 80 లక్షలకు కొనుగోలు చేసింది. ఈనెల 9న గుజరాత్ టైటాన్స్‌తో జరిగే మ్యాచ్‌కు జేసన్ రాయ్ జట్టుతో కలుస్తాడు. గాయంతో ఐపీఎల్ టోర్నీకి దూరమైన శ్రేయస్ అయ్యర్ స్థానంలో రాయ్‌ను తీసుకున్నారు.రాయ్ 2017లో గుజరాత్ లయన్స్ తరఫున, 2021లో సన్‌రైజర్స్ తరఫున ఐపీఎల్ టోర్నీలో ఆడాడు. ఇంగ్లండ్ జట్టుకు 64 టి20 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించిన రాయ్ 1,522 పరుగులు చేశాడు.

హంపికి ఆరో స్థానం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి టోర్నమెంట్‌ను భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఆరో స్థానంతో ముగించింది. గొర్యాక్చినా (రష్యా)తో బుధవారం జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హంపి 32 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. ఓవరాల్‌గా హంపి 4.5 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక 3.5 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో నిలిచింది. షువలోవా (రష్యా)తో జరిగిన చివరి గేమ్‌లో హారిక 66 ఎత్తుల్లో ఓటమి చవిచూసింది. భారత్‌కే చెందిన వైశాలి రెండు పాయింట్లతో పదో ర్యాంక్‌తో సరిపెట్టుకుంది.

భారత మాజీ క్రికెటర్ సుధీర్ నాయక్ మృతి



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ ఓపెనర్, వాంఖెడే స్టేడియం క్యూరేటర్ సుధీర్ నాయక్ బుధవారం మృతి చెందారు. ముంబైకి చెందిన 78 ఏళ్ల సుధీర్ నాయక్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సునీల్ గావస్కర్, అజిత్ వాడేకర్, దిలీప్ సర్దేశాయ్, అశోక్ మన్కడ్‌లాంటి స్టార్స్ జట్టుకు అందుబాటులో లేని సమయంలో సుధీర్ తన నాయకత్వంలో ముంబై జట్టును 1971 సీజన్‌లో రంజీ చాంపియన్‌గా నిలబెట్టారు. 1974–1975లలో ఆయన భారత్ తరఫున మూడు టెస్టులు ఆడి 141 పరుగులు, రెండు వన్డేలు ఆడి 38 పరుగులు చేశారు.

'కింగ్స్' మరో పంజా

ఐపీఎల్ క్లైమాక్స్ డ్రామా ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. భారీ లక్ష్యం ముందుంటే 124 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన రాజస్తాన్ రాయల్స్ విజయానికి దూరమైంది. 18 బంతుల్లో 53 పరుగుల సమీకరణం అసాధ్యమనిపించింది. కానీ హిట్టర్ హెట్‌మైర్ (18 బంతుల్లో 36; 1 ఫోర్, 3 సిక్సర్లు)... 'ఇంపాక్ట్ ప్లేయర్' ధ్రువ్ జురెల్ (15 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ ఆటతో గెలుపు ఆశలు చిగురించాయి. ఆఖరి ఓవర్లో విజయానికి కావాల్సిన 16 పరుగుల్ని పంజాబ్ సీమర్ సామ్ కరన్ తెలివైన బౌలింగ్‌తో అడ్డుకున్నాడు. దీంతో పంజాబ్ కింగ్స్ 5 పరుగులతో గట్టెక్కింది.

- చెలరేగిన ప్రభ్‌సిమ్రాన్, ధావన్
- 5 పరుగులతో రాజస్తాన్‌పై పంజాబ్ గెలుపు
- సామ్సన్, హెట్‌మైర్ మెరుపులు వృథా



ధావన్

గువాహటి: పంజాబ్ కింగ్స్ భారీ స్కోరుతో మరో విజయం సాధించింది. ఐపీఎల్‌లో బుధవారం జరిగిన పోరులో శిఖర్ ధావన్ బృందం 5 పరుగులతో రాజస్తాన్ రాయల్స్‌పై గెలిచింది. మొదట పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 197 పరుగులు చేసింది. ధావన్ (56 బంతుల్లో 86 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (34 బంతుల్లో 60; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడారు. హోల్డర్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 192 పరుగులు చేయగలిగింది. సామ్సన్ (25 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాథన్ ఎలిస్ 4 వికెట్లు తీశాడు.

శుభారంభం...

తొలి ఓవర్లోనే బౌండరీతో తన ఉద్దేశాన్ని చాటిన ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ క్రీజులో ఉన్నంత సేపూ అదే జోరు కొనసాగించాడు. ఆసిఫ్ వేసిన నాలుగో ఓవర్లో 3 ఫోర్లు, మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాదాడు. అనుభవజ్ఞుడైన అశ్విన్‌ను దించినా... బౌండరీలతో తన ఎదురుదాడి కొనసాగించాడు. పవర్ ప్లేలో పంజాబ్ 63/0 స్కోరు చేసింది. కాసేపటికే ప్రభ్‌సిమ్రాన్ 28 బంతుల్లో అర్ధసెంచరీ (7 ఫోర్లు, 2 సిక్సర్లు) పూర్తి చేసుకున్నాడు. ఓపెనింగ్ భాగస్వామ్యానికి ఎట్టకేలకు పదో ఓవర్లో బ్రేక్ పడింది. ప్రభ్‌సిమ్రాన్‌ను హోల్డర్ అవుట్ చేయడంతో 90 పరుగుల వద్ద తొలి వికెట్ కూలింది. ధావన్ పవర్‌ఫుల్ షాట్ రాజపక్స కుడి మోచేతికి బలంగా తగలడంతో రిటైర్డ్‌హర్ట్ అయ్యాడు. తర్వాత జితేశ్ శర్మ (16 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్)అండతో ధావన్ రెచ్చిపోయాడు.

వణికించిన హెట్‌మైర్, ధ్రువ్

ఆరంభంలోనే ఓపెనర్లు అశ్విన్ (0), యశస్వి జైస్వాల్ (11)లను... పవర్‌ప్లేలోనే బట్లర్ (11 బంతుల్లో 19; 1 ఫోర్, 1 సిక్స్)లాంటి హిట్టర్ వికెట్లను కోల్పోయిన రాజస్తాన్‌కు కొండంత లక్ష్యం ఛేదించడం అసాధ్యమైంది. చివర్లో హెట్‌మైర్, ధ్రువ్ ఏడో వికెట్‌కు చకచకా జోడించిన 62 పరుగుల భాగస్వామ్యం పంజాబ్ శిబిరాన్ని వణికించింది. రాజస్తాన్‌ను గెలుపు వైపునకు తీసుకెళ్లింది. కానీ ఆఖరి ఓవర్ వేసిన కరన్ కింగ్స్‌ను గెలిపించాడు.

స్కోరు వివరాలు: పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రాన్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 60; ధావన్ (నాటౌట్) 86; రాజపక్స (రిటైర్డ్‌హర్ట్) 1; జితేశ్ శర్మ (సి) పరాగ్ (బి) చహల్ 27; సికందర్ (బి) అశ్విన్ 1; షారుఖ్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 11; సామ్ కరన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 197. వికెట్ల పతనం:** 1-90, 2-158, 3-159, 4-196. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-38-0, ఆసిఫ్ 4-0-54-0, అశ్విన్ 4- 0-25-1, హోల్డర్ 4-0-29-2, చహల్ 4- 0-50-1.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) సబ్-షార్ట్ (బి) అర్ష్‌దీప్ 11; అశ్విన్ (సి) ధావన్ (బి) అర్ష్‌దీప్ 0; బట్లర్ (సి అండ్ బి) ఎలిస్ 19; సామ్సన్ (సి) సబ్-షార్ట్ (బి) ఎలిస్ 42; పడిక్కల్ (బి) ఎలిస్ 21; పరాగ్ (సి) షారుఖ్ (బి) ఎలిస్ 20; హెట్‌మైర్ (రనౌట్) 36; ధ్రువ్ (నాటౌట్) 32; హోల్డర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 192. వికెట్ల పతనం:** 1-13, 2-26, 3-57, 4-91, 5-121, 6-124, 7-186. **బౌలింగ్:** కరన్ 4-0-44-0, అర్ష్‌దీప్ 4-0-47-2, హర్‌ప్రీత్ 2-0-15-0, ఎలిస్ 4-0-30-4, చహర్ 4-0-31-0, సికందర్ 2-0-24-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	2	2	0	4	0.700
పంజాబ్	2	2	0	4	0.333
బెంగళూరు	1	1	0	2	1.981
రాజస్తాన్	2	1	1	2	1.675
లక్నో	2	1	1	2	0.950
చెన్నై	2	1	1	2	0.036
కోల్‌కతా	1	0	1	0	-0.438
ఢిల్లీ	2	0	2	0	-1.703
ముంబై	1	0	1	0	-1.981
హైదరాబాద్	1	0	1	0	-3.600

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x బెంగళూరు (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మిథాలీ, ధోని, యువరాజ్‌లకు ఎంసీసీ జీవితకాల సభ్యత్వం



లండన్: క్రికెట్ నియమావళికి కేంద్ర బిందువైన విఖ్యాత మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) 17 మంది మేటి క్రికెటర్లకు జీవితకాల సభ్యత్వం కల్పించింది. ఈ జాబితాలో భారత్ నుంచి ఐదుగురు క్రికెటర్లు ఉన్నారు. అంతర్జాతీయ మహిళల క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్న భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, పేస్ బౌలర్ జులన్ గోస్వామిలతో పాటు ఎమ్మెస్ ధోని, యువరాజ్ సింగ్, సురేశ్ రైనాలకు ఈ గౌరవం దక్కింది. ధోని నాయకత్వంలో భారత్ 2007 టి20 వరల్డ్‌కప్, 2011 వన్డే వరల్డ్‌కప్ టైటిల్స్ సాధించింది. యువరాజ్ సింగ్ ఈ రెండు గొప్ప విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. సురేశ్ రైనా తన 13 ఏళ్ల కెరీర్‌లో మూడు ఫార్మాట్‌లలో కలిపి 7,988 పరుగులు సాధించాడు. హైదరాబాద్‌కు చెందిన మిథాలీ రాజ్ వన్డేల్లో అత్యధిక పరుగులు (7,805) చేసిన మహిళా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది. అత్యధిక మ్యాచ్‌ల్లో (155) కెప్టెన్‌గా వ్యవహరించిన ప్లేయర్‌గానూ ఆమె గుర్తింపు పొందింది. జులన్ వన్డేల్లో అత్యధిక వికెట్లు (255) తీసిన బౌలర్‌గా ఘనత వహించింది.

సైనా, సాయిప్రణీత్ ఓటమి

న్యూఢిల్లీ: ఓర్లియాన్స్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్స్ సైనా నెహ్వాల్, సాయిప్రణీత్ నిరాశ పరిచారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సైనా 16-21, 14-21తో తుర్కియే షట్లర్ నిష్లిహాన్ యిగిట్ చేతిలో... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రణీత్ 20-22, 17-21తో లీంగ్ జున్ హావో (మలేసియా) చేతిలో ఓడిపోయారు.

ముష్ఫికర్ సెంచరీ



ముష్ఫికర్

మిర్పూర్: ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌పై బంగ్లాదేశ్ రెండో రోజే పట్టు బిగించింది. ఫలితాన్ని శాసించే స్థితిలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 34/2తో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 80.3 ఓవర్లలో 369 పరుగులకు ఆలౌటై 155 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ముష్ఫికర్ రహీమ్ (166 బంతుల్లో 126; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించగా... షకీబ్ అల్ హసన్ (94 బంతుల్లో 87; 14 ఫోర్లు) శతకాన్ని చేజార్చుకున్నాడు. మెహదీ హసన్ మిరాజ్ (80 బంతుల్లో 55; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), లిటన్ దాస్ (41 బంతుల్లో 43; 8 ఫోర్లు) రాణించారు. ఐర్లాండ్ బౌలర్ ఆండీ మెక్‌బ్రైన్ 118 పరుగులిచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు. మార్క్ అడైర్, బెన్ వైట్ రెండేసి వికెట్లు పడగొట్టారు. 155 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఐర్లాండ్ ఆట ముగిసే సమయానికి 27 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.



వరుసగా రెండో ఏడాది విశ్వ విజేతగా నిలిచిన తెలంగాణ మహిళా బాక్సర్ నిఖత్ జరీన్‌కు జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) తరఫున సీఎండీ (అడిషనల్ చార్జ్) అమితవ ముఖర్జీ రూ. 5 లక్షల చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎండీసీ డైరెక్టర్ (ప్రొడక్షన్) దిలీప్ కుమార్ మొహంతి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

మిల్నే మెరిసె...

రెండో టి20లో శ్రీలంకపై న్యూజిలాండ్ ఘనవిజయం



డ్యూనెడిన్: పేస్ బౌలర్ ఆడమ్ మిల్నే 26 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడంతో... శ్రీలంకతో బుధవారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిల్నే నిప్పులు చెరిగే బంతులతో హడలెత్తించాడు. దాంతో దాసున్ షనక బృందం 19 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ పెరీరా (32 బంతుల్లో 35; 2 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వా (26 బంతుల్లో 37; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం న్యూజిలాండ్ ఆడుతూ పాడుతూ కేవలం 14.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 146 పరుగులు చేసి గెలిచింది. టిమ్ సీఫెర్ట్ (43 బంతుల్లో 79 నాటౌట్; 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ చేశాడు. ఈ గెలుపుతో న్యూజిలాండ్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. నిర్ణాయక మూడో మ్యాచ్ శనివారం క్వీన్స్‌టౌన్‌లో జరుగుతుంది.

సినిమా

సెప్టెంబరులో స్టార్ట్?



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచరస్ డ్రామాగా రూపుదిద్దుకోనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. షూటింగ్‌ను సెప్టెంబరులో ఆరంభించాలని రాజమౌళి అనుకుంటున్నారట. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు ఓ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబరుకల్లా దాదాపు పూర్తవుతుందట. ఆ తర్వాత రాజమౌళి సినిమా చిత్రీకరణలో పాల్గొనేలా మహేశ్‌బాబు ప్లాన్ చేసుకుంటున్నారట. ఇక త్రివిక్రమ్‌తో మహేశ్‌బాబు చేస్తున్న సినిమా వచ్చే జనవరి 13న విడుదల కానుంది.

● మహేశ్‌బాబు

జోరుగా.. హుషారుగా...



● రజనీకాంత్

ఏడుపదుల వయసులోనూ రజనీకాంత్ జోరుగా హుషారుగా సినిమాల మీద సినిమాలు కమిట్ అవుతూ, బిజీగా ఉంటున్నారు. ఇప్పటికే 'జైలర్' చిత్రంలో హీరోగా, 'లాల్‌సలామ్' చిత్రంలో అతిథి పాత్ర చేస్తున్నారాయన. ఇవి కాకుండా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ నిర్మించనున్న చిత్రం అంగీకరించారు. తాజాగా మరో సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడానికి రెడీ అవుతున్నారట. ప్రస్తుతం తమిళ చిత్ర పరిశ్రమలో మంచి ఫామ్‌లో ఉన్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఇటీవల రజనీకాంత్‌ను కలిసి ఓ కథ వినిపించారని, ఈ స్క్రిప్ట్ రజనీకాంత్‌కి నచ్చిందని టాక్. ఈ కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వచ్చే అవకాశం ఉందంటోంది చెన్నై సినిమా సర్కిల్. ఈ చిత్రాన్ని కమల్‌హాసన్ నిర్మించనున్నారని సమాచారం.

బాలీవుడ్ వార్‌లో...



● ఎన్టీఆర్

బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థల్లో ఒకటైన యశ్ రాజ్ ఫిలింస్ (వైఆర్ఎఫ్) స్పై యూనివర్స్‌లో ఎన్టీఆర్ భాగం కానున్నట్లు తెలుస్తోంది. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్యా చోప్రా నిర్మించిన స్పై యాక్షన్ ఫిల్మ్ 'వార్'. 2019 అక్టోబరు 2న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో 'వార్ 2'ను నిర్మించడానికి వైఆర్ఎఫ్ రెడీ అవుతోంది. హృతిక్ రోషన్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకోనుందని ఆల్రెడీ బీటౌన్‌లో బలమైన ప్రచారం సాగుతోంది. తాజాగా ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఓ లీడ్ రోల్ చేయనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. హృతిక్, ఎన్టీఆర్ స్క్రీన్ షేర్ చేసుకుంటే ఇండియన్ సినీ ఫ్యాన్స్‌కు పండగే అంటూ కామెంట్స్ చేస్తున్నారు కొందరు నెటిజన్లు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభం కానుందట. మరి.. ఎన్టీఆర్ నటించే విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

మీ ప్రేమకు కూడా దూరమైతే!



● సమంత, దేవ్‌మోహన్

'లేడి కన్నులు.. నెమలి నడక.. సివంగి నడుము...' అంటూ నటుడు దేవ్ మోహన్ డైలాగ్‌తో 'శాకుంతలం' సినిమా ట్రైలర్ విడుదలైంది. సమంత టైటిల్ రోల్‌లో దేవ్ మోహన్ ప్రధాన పాత్రలో గుణశేఖర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించారు. ఈ నెల 14న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రిలీజ్ ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్. 'మనసెటు పోతే అటు పోరాదని ముని వాక్కు', 'పుట్టగానే తల్లిదండ్రుల ప్రేమకు దూరమయ్యాను.. మీ ప్రేమకు కూడా దూరమైతే' (సమంత), 'నీ కష్టానికి కన్నీళ్లు పెట్టగలమే కానీ.. నీ కర్మను పంచుకోలేం' (గౌతమి) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, మధుబాల, గౌతమి, అదితీ బాలన్, అనన్య నాగళ్ల, జిస్సు సేన్ గుప్తా తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, అడిషనల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: టబ్బీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: హేమాంబర్ జాస్తి, కొమ్మినేని వెంకటేశ్వరరావు, లైన్ ప్రొడ్యూసర్: యశ్వంత్.

బ్లాక్ బస్టర్ గ్యారంటీ

- నిర్మాత అభిషేక్ నామా

'రావణాసుర' లాంటి సినిమాను రవితేజగారు ఇప్పటివరకూ చేయలేదు. ఈ సినిమా చూసిన తర్వాత ఆయన ఇలా కూడా చేయగలుగుతారా? అని ఆడియన్స్ థ్రిల్‌కి, షాక్‌కి గురవుతారు. మా సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన మా సినిమా వర్కవుట్ అయితే మరికొందరు హీరోలు ఇలాంటి కథలు ప్రయత్నిస్తారు'' అని నిర్మాత అభిషేక్ నామా అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అభిషేక్ నామా మాట్లాడుతూ– ''థ్రిల్లర్ జానర్ సినిమా చూసినప్పుడు షాక్‌కి గురి చేసే, వావ్ అనిపించే సన్నివేశాలుంటాయి. వాటి గురించి ముందే ప్రేక్షకులకు తెలిసిపోతే ఆ కిక్కు రాదు.. అందుకే 'రావణాసుర' కథ గురించి బయటికి చెప్పడం లేదు. ఈ సినిమాలో సుశాంత్‌ని చాలా కొత్తగా చూస్తారు. గతంలో నేను–సుధీర్ వర్మ చేసిన 'కేశవ' సినిమా వాణిజ్యపరంగా నాకు వర్కవుట్ అయ్యింది. అయితే బ్లాక్ బస్టర్ మిస్ అయ్యింది. కానీ, 'రావణాసుర'తో గ్యారంటీగా వంద శాతం బ్లాక్ బస్టర్ కొడతాం. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో సొంతంగా నేనే విడుదల చేస్తున్నాను. నేను తీసిన 'సాక్ష్యం' సినిమాకి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకునిగా చేశాడు. రవితేజగారికి చెప్పి 'రావణాసుర'కి మరోసారి అవకాశం ఇచ్చాను. 'కాంతార' లాంటి సినిమా చూసినప్పుడు మనం వావ్ అన్నాం. అయితే అలాంటి మూవీ ఇక్కడ చేయాలంటే వర్కవుట్ అవుతుందా? లేదా అని ఆలోచిస్తాం. కానీ 'రావణాసుర'తో రవితేజగారు అవన్నీ బ్రేక్ చేసేశారు. ఈ సినిమా కథా రచయిత శ్రీకాంత్ విస్సాతో దర్శకుడిగా తన మొదటి సినిమాని నా బ్యానర్‌లోనే చేయాలని చెప్పాను.. ఓకే అన్నాడు. ప్రస్తుతం మా బేనర్‌లో నిర్మించిన 'ప్రేమ విమానం' మూవీని మేలో రిలీజ్ చేస్తాం. అలాగే 'డెవిల్' సినిమా క్లయిమాక్స్ షూటింగ్ జరుగుతోంది'' అన్నారు.





● రామ్‌చరణ్, ఉపాసన

ఇటీవల స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో దుబాయ్‌లో రామ్‌చరణ్ భార్య ఉపాసన బేబీ షవర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ వేడుకలో రామ్‌చరణ్–ఉపాసన దిగిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఓ కల ట్రైలర్ బాగుంది

- 'దిల్' రాజు

గౌరీశ్ యేలేటి, రోషిణి, ప్రాచీ ఠక్కర్ హీరో హీరోయిన్లుగా దీపక్ కొలిపాక దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఓ కల'. లక్ష్మీ నవ్య మోటూరు, రంజిత్ కుమార్ కొడాలి, ఆదిత్యా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ –''ఓ కల' ట్రైలర్ చూశాను. బాగుంది'' అని అన్నారు. ''కమర్షియల్ ఎలిమెంట్స్‌తో మంచి ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను తెరకెక్కించాం'' అన్నారు దీపక్. ఈ చిత్రానికి సంగీతం: నీలేష్ మందలపు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మహేశ్ మోటూరు.



● 'దిల్' రాజు, దీపక్

మీటర్‌తో మాస్ హిట్ రావాలి

- గోపీచంద్ మలినేని



● నవీన్, బుచ్చిబాబు, గోపీచంద్, కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి

''రవితేజ, నానీగార్ల తర్వాత ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాడు కిరణ్. అతని ప్రధాన బలం సహజమైన నటన, డైలాగ్ డెలివరీ. 'మీటర్'తో తనకి మాస్ హిట్ రావాలి'' అని డైరెక్టర్ గోపీచంద్ మలినేని అన్నారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రమేష్ కడూరి దర్శకత్వం వహించిన చిత్రం 'మీటర్'. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''అసలు సిసలైన కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. రమేష్‌గారు ఈ సినిమాలో నన్ను వైవిధ్యంగా చూపించారు. ఏప్రిల్ 7న మీటర్లు బ్లాస్ట్ అవుతాయి.. నన్ను నమ్మండి'' అన్నారు. ''మీటర్' ప్రీమియర్ చూశాను.. చాలా బావుంది. ఈ వేసవిలో మంచి కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్ ఇది'' అన్నారు నవీన్ యెర్నేని. ''ఈ సినిమా అందరికీ కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు డైరెక్టర్ బుచ్చిబాబు. ''ఈ సినిమా ఫుల్ మీల్స్‌లా ఉంటుంది'' అన్నారు రమేష్ కడూరి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	583	59,689
నిఫ్టీ ▲	159	17,557

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,966	▽	161
డోజోన్స్	33,436	▲	34
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,663	▲	28
డాక్స్	15,520	▽	83
షాంఘై (మంగళవారం ముగింపు)	3,313	▲	16
నికాయ్	27,813	▽	476

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (24 క్యారట్)	60,781
బంగారం (22 క్యారట్)	60,538
వెండి (కిలో)	73,834

మార్చిలో 'సేవలు' అంతంతే..!

ఫిబ్రవరితో పోల్చితే డౌన్



న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం మార్చిలో పేలవ పనితీరును కనబరిచింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఫిబ్రవరికన్నా తక్కువకు పడిపోయి 57.8కి చేరింది. సూచీ ఫిబ్రవరిలో 12 నెలల గరిష్ట స్థాయి 59.4ను చూసిన సంగతి తెలిసిందే. కొత్త బిజినెస్ ఆర్డర్లు అంతంత మాత్రంగానే పెరిగినట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలియానా డి లిమా పేర్కొన్నారు. కాగా, సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన వరుసగా 20 నెలల నుంచి సూచీ వృద్ధి ధోరణిలో పయనిస్తోంది.

తయారీ–సేవల రంగం కలిపినా డౌన్!

కాగా, తయారీ–సేవల రంగం కలిపినా ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ ఫిబ్రవరిలో 59.0 వద్ద ఉంటే, మార్చిలో 58.4కు పడిపోయింది. మరోవైపు ఒక్క తయారీ రంగం చూస్తే మార్చిలో మంచి పురోగతి కనబరచింది. ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) మార్చిలో మూడు నెలల గరిష్ట స్థాయిలో 56.4కు వద్దకు చేరింది. డిమాండ్ ఊపందుకోవడంతో కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి పెరిగినట్లు నెలవారీ సర్వే పేర్కొంది. ద్రవ్యోల్బణం ఒత్తిడులు తగ్గినట్లూ వివరించింది. ఫిబ్రవరిలో పీఎంఐ 55.3గా నమోదయ్యింది. 400 మంది తయారీదారుల ప్యానెల్‌లో కొనుగోళ్లు జరిపే మేనేజర్‌ల స్పందన ఆధారంగా ఈ సూచీ కదలికలను నమోదు చేస్తారు. భారత్ ఎకానమీలో సేవల రంగం వాటా 60%. పరిశ్రమల రంగం వాటా దాదాపు 15% అయితే, అందులో తయారీ రంగం వెయిటేజ్ 70% ఉంటుంది.

ఫ్యాంటసీ స్పోర్ట్స్ ఆదాయం 35 శాతం అప్

- ఈ ఐపీఎల్ సీజన్‌లో రూ. 3,100 కోట్లకు
- రెడ్‌సీర్ స్ట్రాటెజీ కన్సల్టెంట్స్ అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2023 క్రికెట్ టోర్నమెంటు సీజన్‌లో ఫ్యాంటసీ స్పోర్ట్స్ విభాగం ఆదాయం రూ. 2,900–3,100 కోట్లకు చేరనుంది. గతేడాది సీజన్‌తో పోలిస్తే 30–35 శాతం పెరగనుంది. మార్కెట్ రీసెర్చ్ సంస్థ రెడ్‌సీర్ స్ట్రాటెజీ కన్సల్టెంట్స్ ఈ విషయాలు వెల్లడించింది. గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై 6.5–7 కోట్ల మంది యూజర్లు లావాదేవీలు జరపవచ్చని అంచనా వేసింది. గత 4–5 ఏళ్లుగా ఫ్యాంటసీ స్పోర్ట్స్ యూజర్ల సంఖ్య ఏటా 20% మేర పెరుగుతుండగా, ఈ ఏడాది 20–30% స్థాయిలో పెరగవచ్చని సంస్థ పార్ట్‌నర్ ఉజ్వల్ చౌదరి తెలిపారు. ప్రతి యూజరుపై ఆదాయం గత ఐపీఎల్ సీజన్‌లో రూ. 410గా ఉండగా ఈ సీజన్‌లో రూ. 440కి చేరవచ్చని పేర్కొన్నారు. మార్కెటింగ్‌పై గణనీయంగా ఖర్చు చేస్తుండటంతో ఫ్యాంటసీ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్‌లపై అవగాహన పెరుగుతోందని చౌదరి చెప్పారు. 'నిబంధనలు, జీఎస్‌టీపై స్పష్టత వచ్చింది. గూగుల్ కూడా తమ ప్లేస్టోర్‌లో ప్రయోగాత్మకంగా కొన్ని ఫ్యాంటసీ ప్లాట్‌ఫామ్‌లను అనుమతిస్తుండటం మరో సానుకూలాంశం. ఇవన్నీ కూడా భారత్‌లో ఈ స్పోర్ట్స్‌కు అనుకూలమైన పరిణామాలే' అని పేర్కొన్నారు. పైలట్ ప్రోగ్రాం కింద డ్రీమ్11, మై11సర్కిల్, ఎంపీఎల్ రమ్మీ, ఫ్యాంటసీ క్రికెట్ లాంటి కొన్ని ప్లాట్‌ఫామ్‌లను గూగుల్ తమ ప్లేస్టోర్‌లో అనుమతించింది. మార్చి 31తో ప్రారంభమైన ఐపీఎల్ 2023 క్రికెట్ టోర్నీ.. మే నెలాఖరు వరకు కొనసాగనుంది. రెడ్‌సీర్ గణాంకాల ప్రకారం.. ఏడాది మొత్తం మీద ఫ్యాంటసీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు వచ్చే ఆదాయంలో ఐపీఎల్ సీజన్ వాటా 35–40% ఉంటుంది.

4 ఐపీవోలకు సెబీ గ్రీన్‌సిగ్నల్

- జాబితాలో సైయంట్ డీఎల్‌ఎం, రాశి పెరిఫెరల్స్
- హెల్త్‌విస్టా ఇండియా, జాగిల్ ప్రీపెయిడ్ ఓషియన్
- వర్కింగ్ క్యాపిటల్, రుణ చెల్లింపులకు నిధుల బదిలీ



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా నాలుగు కంపెనీల నిధుల సమీకరణ ప్రణాళికలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో సైయంట్ డీఎల్‌ఎం, రాశి పెరిఫెరల్స్, హెల్త్‌విస్టా ఇండియా, జాగిల్ ప్రీపెయిడ్ ఓషియన్ సర్వీసెస్ ఉన్నాయి. ఇవన్నీ 2022 జులై– 2023 జనవరి మధ్య సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. తద్వారా పబ్లిక్ ఇష్యూలు చేపట్టేందుకు మార్చి 29–31 మధ్య అనుమతి పొందాయి. వెరసి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు దారి ఏర్పడింది.

ఐటీ సొల్యూషన్స్

సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందించే రాశి పెరిఫెరల్స్ ఐపీవోలో భాగంగా రూ. 750 కోట్లను సమీకరించే యోచనలో ఉంది. పూర్తిగా షేర్ల జారీ ద్వారా నిధులను సమకూర్చుకోనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 400 కోట్లను రుణ చెల్లింపులు, రూ. 200 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

ఎలక్ట్రానిక్స్ తయారీ

పబ్లిక్ ఇష్యూలో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ సర్వీసుల సంస్థ సైయంట్ డీఎల్‌ఎం సైతం రూ. 740 కోట్లు సమకూర్చుకోవాలని చూస్తోంది. ఇందుకు అనుగుణంగా తాజా ఈక్విటీ జారీకి తెరతీయనుంది. ఈ నిధులను మూలధన అవసరాలు, విస్తరణ వ్యయాలు, రుణ చెల్లింపులు, ఇతర కంపెనీల కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

హెల్త్‌కేర్ సేవలు

పోర్టీ బ్రాండుతో ఆసుపత్రుల బయట ఆరోగ్య పరిరక్షణ సేవలందించే హెల్త్‌విస్టా ఇండియా ఐపీవో ద్వారా రూ. 1,000 కోట్ల సమీకరణపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా రూ. 200 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 5.62 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ మెడీబిజ్ ఫార్మా వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, రుణ చెల్లింపులు, మెడికల్ పరికరాల కొనుగోళ్లు, ఇతర కంపెనీల కొనుగోళ్లకు వినియోగించనుంది.

ఫైనాన్షియల్ సేవలు

ఐపీవోలో భాగంగా ఫైనాన్షియల్ సేవలందించే ఫిన్‌టెక్ కంపెనీ జాగిల్ ప్రీపెయిడ్ ఓషియన్ సర్వీసెస్ రూ. 490 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి అదనంగా కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు 1.05 కోట్ల షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వినియోగదారులను పెంచుకోవడం, టెక్నాలజీ, ప్రొడక్టుల అభివృద్ధి, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

"సెలెస్ట్ ఎక్స్ సచిన్ టెండూల్కర్" పేరుతో ఆభరణాల శ్రేణి



ముంబై: టాటా గ్రూప్‌నకు చెందిన తనిష్క్ "సెలెస్ట్ ఎక్స్ సచిన్ టెండూల్కర్" పేరుతో ప్రత్యేక కలెక్షన్ ఆవిష్కరించింది. భిన్న సమ్మేళనం, ఖచ్చితత్వం, పరిపూర్ణతతో రూపొందించిన ఈ ఆభరణ శ్రేణిలో ఉంగరాలు, చెవి రింగులు, బ్రాస్‌లైట్లు ఉన్నాయి. అరుదైన ఈ కలెక్షన్‌ను లెజెండరీ క్రికెటర్ సచిన్ 50వ సంవత్సరంలో, వంద అంతర్జాతీయ సెంచరీల రికార్డుకు గుర్తుగా తీసుకొస్తున్నట్లు కంపెనీ తెలిపింది. తనిష్క్ రూపొందించిన ప్రత్యేక లిమిటెడ్ ఎడిషన్ కలెక్షన్ కోసం వారితో భాగస్వామ్యం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని సచిన్ టెండూల్కర్ అన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-4-2023	
విశాఖ	420–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403–00
విజయవాడ	403–00
5-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	385–00
వరంగల్	387–00

నాలుగోరోజూ బుల్ జోరు

- సెన్సెక్స్ 582 పాయింట్లు ప్లస్
- 17,550 స్థాయిపై ముగిసిన నిఫ్టీ
- ఐటీ, ఫైనాన్స్, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు డిమాండ్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో నాలుగో రోజూ బుల్ జోరు కొనసాగింది. ఐటీ, ఫైనాన్స్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు ఒకశాతం లాభపడ్డాయి. ప్రపంచ బ్యాంకింగ్ రంగంపై ఆందోళనలు తగ్గుముఖం పట్టడంతో పాటు దేశీయంగా నెలకొన్న సానుకూలాంశాలు సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. ఐదోరోజూ విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగడం, కార్పొరేట్ క్యూ4 ఆర్థిక ఫలితాలపై ఆశావహ అంచనాలు, అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షేర్లు మూడుశాతం ర్యాలీ, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి బలపడటం తదితర అంశాలు కలిసొచ్చాయి. సూచీలు ఉదయం బలహీనంగా ప్రారంభమైనప్పటికీ..., వెంటనే తేరుకొని లాభాల్లోకి మళ్లాయి. ట్రేడింగ్ ఆద్యంతం స్థిరంగా కదలాడి దాదాపు ఇంట్రాడే గరిష్టం వద్ద ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 11 పాయింట్ల స్వల్ప నష్టంతో 59,095 మొదలైంది. ఇంట్రాడేలో 59,094 వద్ద కనిష్టాన్ని, 59,747 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 583 పాయింట్లు ఎగసి 59,689 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24 పాయింట్లు పెరిగి 17,422 వద్ద మొదలైంది. రోజంతా 17,403 – 17,571 శ్రేణిలో ట్రేడైంది. బలపడి 159 పాయింట్ల లాభంతో 17,557 వద్ద నిలిచింది. విద్యుత్, ఆటో, ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. చిన్న రంగాల షేర్లకు అధిక డిమాండ్ లభించడంతో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒకశాతం ర్యాలీ చేసింది. ఎఫ్‌పీఐలు రూ.807 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.947 కోట్ల షేర్లను అమ్మేశారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అవుతున్నాయి.

42 పైసలు బలపడిన రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 42 పైసలు బలపడి 81.90 స్థాయి వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ రెండు నెలల కనిష్టానికి దిగిరావడంతో పాటు మన మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల భారీగా కొనుగోళ్లతో దేశీయ కరెన్సీకి డిమాండ్ పెరిగింది. ఫలితంగా 42 పైసలు బలపడి ఇంట్రాడే గరిష్టం 81.90 వద్ద ముగిసింది.

నాలుగు రోజులు : రూ.9.45 లక్షల కోట్లు

సెన్సెక్స్ నాలుగు రోజుల్లో 2,076 పాయింట్లు ర్యాలీ చేయడంతో బీఎస్‌ఈలో 9.45 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఫలితంగా ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.261.31 లక్షల కోట్లకు చేరింది. "దేశీయ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బలమైన త్రైమాసిక గణాంకాల నమోదు, విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు అంశాల ప్రభావంతో ప్రపంచ మార్కెట్లలోని బలహీనతలను విస్మరిస్తూ దేశీయ ఈక్విటీ మార్కెట్ మెరుగైన ప్రదర్శన కనబరిచింది. అలాగే యూఎస్‌లో కార్మిక మార్కెట్ డేటా, ఫ్యాక్టరీ ఆర్డర్ల తగ్గుదల పరిణామాలు ఫెడ్ వడ్డీరేట్ల యథాతథ నిర్ణయానికి దారి తీయొచ్చనే అంచనాలు సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి" అని జియోజిత్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఆటో షేర్లలో లాభాల స్వీకరణతో అశోక్ లేలాండ్ 4 శాతం పతనమైన రూ.135 వద్ద స్థిరపడింది.
- కంపెనీలో అగ్రస్థాయి యాజమాన్యం రాజీనామాతో సైయంట్ షేరు ఆరుశాతం నష్టపోయి రూ.1,057 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 8% క్షీణించి రూ.1,064 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది.
- ఫైనాన్స్ షేర్ల ర్యాలీ భాగంగా అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు మూడుశాతం బలపడి రూ.1654 వద్ద ముగిసింది.

సౌందర్య సంరక్షణ విభాగంలోకి రిలయన్స్ రిటైల్

టిరా యాప్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ: రిలయన్స్ రిటైల్ తాజాగా సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల విభాగంలోకి ప్రవేశించింది. టిరా పేరిట రిటైల్ ప్లాట్‌ఫాంను ఆవిష్కరించింది. యాప్, వెబ్‌సైట్‌తో పాటు ముంబైలో తొలి టిరా రిటైల్ స్టోర్‌ను కూడా ప్రారంభించింది. 100 పైచిలుకు నగరాల్లో వీటిని ఏర్పాటు చేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ బ్రాండ్‌తో రిలయన్స్ ఇకపై హెచ్‌యూఎల్, నైకా, టాటా, ఎల్‌వీఎంహెచ్ మొదలైన దిగ్గజాలతో పోటీ పడనుందని పేర్కొన్నాయి. అన్ని వర్గాల వినియోగదారులకు మెరుగైన అంతర్జాతీయ, దేశీయ సౌందర్య సంరక్షణ బ్రాండ్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు టిరా ఉపయోగపడగలదని రిలయన్స్ రిటైల్ వెంచర్స్ ఈడీ ఈషా అంబానీ తెలిపారు. ఆన్‌లైన్ మార్కెట్ డేటా రీసెర్చ్ సంస్థ స్టాటిస్టా ప్రకారం దేశీయంగా బ్యూటీ, పర్సనల్ కేర్ మార్కెట్ 2023లో 27.23 బిలియన్ డాలర్లుగా ఉండనుంది. ఇందులో 12.7 శాతం వాటా ఆన్‌లైన్ అమ్మకాల ద్వారా రానుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 100 ఉద్యోగాలు

వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్పీడీసీఎల్)లో ఖాళీగా ఉన్న 100 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **విద్యుత్ సర్కిళ్లు:** వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్.
- **అర్హత:** బీఏ, బీఎస్సీ, బీకాంతోపాటు కంప్యూటర్ అప్లికేషన్/ఆఫీస్ ఆటోమేషన్(ఎంఎస్ ఆఫీస్) సర్టిఫికేట్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 01.01.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- **వేతనం:** నెలకు రూ.29,255 నుంచి రూ.54,380 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష(80 మార్కులు), సంబంధిత అనుభవం(20 మార్కులు), ధ్రువ పత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు సమర్పణ, ఫీజు చెల్లింపు ప్రారంభతేది:** 10.04.2023.
- **దరఖాస్తులకు చివరితేది:** 29.04.2023
- **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:**22.05.2023
- **రాతపరీక్ష తేది:** 28.05.2023.
- **వెబ్‌సైట్:** www.tsnpdcl.in

విజయనగరం జిల్లాలో బ్యాక్‌లాగ్ పోస్టులు

విజయనగరంలోని ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఉమ్మడి విజయనగరం జిల్లాలో దివ్యాంగులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–03, ఆఫీస్ సబార్డినేట్–01, నైట్ వాచ్‌మెన్–02, ధోబీ/చెక్లర్/స్వీపర్–01, ఏఎన్ఎం–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి 5వ తరగతి, 7వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:**18నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, రూమ్ నెం.34, కలెక్టరేట్, విజయనగరం చిరునామాకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 10.04.2023.
- **వెబ్‌సైట్:**www.vizianagaram.ap.gov.in

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో 29 పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 29
- **పోస్టులు:** టెక్నికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజనీర్. • **విభాగాలు:** ఈసీఈ/ఈటీసీ/ఎలక్ట్రానిక్స్/సీఎస్ఈ/ఐటీ తదితరాలు.
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్/బీఎస్సీ ఎంపీసీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి. కనీసం ఒక ఏడాది పని అనుభవం ఉండాలి.

వేతనం

- **టెక్నికల్ ఆఫీసర్:** నెలకు రూ.25,000 చెల్లిస్తారు.
- **అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజనీర్:** నెలకు రూ.24,500 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:**ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా
- **ఇంటర్వ్యూ వేదిక:** సీఎల్‌డీసీ, నలంద కాంప్లెక్స్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, టీఐఎఫ్ఆర్ రోడ్, ఈసీఐఎల్ పోస్ట్, హైదరాబాద్–500062.
- **ఇంటర్వ్యూ తేది:** 06.04.2023,07.04.2023.
- **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

గుంటూరు జిల్లాలో 15 బ్యాక్‌లాగ్ పోస్టులు

గుంటూరు జిల్లా సెలక్షన్ కమిటీ వివిధ విభాగాల్లో ఎస్సీ/ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 54
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–02, జూనియర్ స్టెనో–01,టైపిస్ట్–03,మాట్రాన్ కమ్ స్టోర్ కీపర్–01, ఆఫీస్ సబార్డినేట్–08, మెసెంజర్–02, ల్యాబ్ అసిస్టెంట్–01, ల్యాబ్ అటెండర్–01, వర్క్‌షాప్ అటెండర్–01, స్కిల్డ్ వర్క్‌మ్యాన్–01, ఫిషర్ మ్యాన్–01, శానిటరీ(పబ్లిక్ హెల్త్)మేస్త్రీ–01, వాచ్‌మ్యాన్–09, వాటర్‌మ్యాన్–01, స్వీపర్–03, పబ్లిక్ హెల్త్ వర్కర్–12, గ్యాంగ్ మజ్దూర్–02, డ్రెయిన్ క్లీనర్–01, కళాసి –01, హోల్ టైమ్ సర్వెంట్–01, లస్కర్–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి తెలుగు/ఇంగ్లిష్ భాషలో చదవడం, రాయడం, 5వ తరగతి, 7వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులవ్వాలి. టైప్ రైటింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
- **వయసు:** 01.07.2022 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.04.2023
- **వెబ్‌సైట్:** www.gunturap.in

అనంతపురం జిల్లాలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

అనంతపురం జిల్లాలో దివ్యాంగుల కోసం కేటాయించిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహణకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీ, కలెక్టర్/జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
- **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్–05, జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్–01, టైపిస్ట్–01, ఎల్.డి.కంప్యూటర్–01.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. టైప్ రైటింగ్ సర్టిఫికేట్ ఉండాలి.
- **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **పే స్కేల్:** నెలకు రూ.25,220 నుంచి రూ. 80,910 ఉంటుంది.
- **ఎంపిక విధానం:** అకడమిక్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చైర్మన్, జిల్లా ఎంపిక కమిటీ, జిల్లా కలెక్టర్, అనంతపురం చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 15.04.2023.
- **వెబ్‌సైట్:** www.ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో 17 పోస్టులు

ప్రకాశం జిల్లాలో దివ్యాంగుల కోసం కేటాయించిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహణకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీ, కలెక్టర్/జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
- **పోస్టుల వివరాలు:** టైపిస్ట్–02, జూనియర్ అసిస్టెంట్/డీఈవో–01, టెక్నికల్ అసిస్టెంట్–01, ఆఫీస్ సబార్డినేట్–08, వాచ్‌మ్యాన్–02, సేవిక –01, కామాటి–01, స్వీపర్–01.
- **అర్హత:** పోస్టును అనుసరించి 5వ తరగతి, 7వ తరగతి, బ్యాచిలర్ డిగ్రీ, టైప్ రైటింగ్ సర్టిఫికేట్ ఉండాలి. **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, వైకల్య శాతం ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రకటన వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోగా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామకు పంపించాలి.
- **ప్రకటన తేది:** 30.03.2023.
- **వెబ్‌సైట్:** www.prakasam.ap.gov.in

ప్రఖ్యాత సంస్థల్లో పీజీకి దారి

» సీయూఈటీ-పీజీ 2023 ప్రకటన విడుదల



పోస్ట్‌గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సులు అందించడంలో దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలకు మంచి పేరుంది. ఇందులో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు నాణ్యమైన బోధనతోపాటు అధునాతన విద్యాసౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఇలాంటి ఉత్తమ విద్యాసంస్థల్లో ప్రవేశానికి మార్గం.. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ పోస్ట్‌గ్రాడ్యుయేట్(సీయూఈటీ-పీజీ). ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోంది. ప్రస్తుతం 2023 ఏడాదికి సీయూఈటీ-పీజీ ప్రకటన విడుదలైంది. ఈ నేపథ్యంలో.. సీయూఈటీ పీజీ ప్రత్యేకత, అందించే కోర్సులు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

గతంలో సెంట్రల్ యూనివర్సిటీలు పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం వేర్వేరుగా ఎంట్రెన్స్ టెస్టులు నిర్వహించేవి. దీనివల్ల విద్యార్థులు ప్రతి వర్సిటీ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకొని.. సుదూర ప్రాంతాలకు వెళ్లి రాయాల్సి వచ్చేది. విద్యార్థుల వ్యయప్రయాసలను దృష్టిలో పెట్టుకొని 2022 నుంచి కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)ను ప్రవేశపెట్టారు. ఫలితంగా ఒకే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా విద్యార్థులు దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందే వీలుకలిగింది.

తెలుగు రాష్ట్రాల్లో

- హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ, ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ–హైదరాబాద్, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ–విజయనగరం, ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ–అనంతపురంలలో ప్రవేశాలకు సీయూఈటీ పీజీ స్కోరే ప్రామాణికం. వీటితోపాటు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ–న్యూఢిల్లీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ–వారణాసి, పాండిచ్చేరి యూనివర్సిటీ, జామియా మిల్లియా ఇస్లామియా..ఇలా పలు పేరున్న సంస్థల్లో సీయూఈటీ స్కోర్ ద్వారానే ప్రవేశాలు కల్పిస్తారు.
- సీయూఈటీ పీజీ ద్వారా కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో సైతం అడ్మిషన్ పొందే అవకాశముంది.

అర్హత

డిగ్రీ పూర్తిచేసుకున్నవారు, ప్రస్తుతం డిగ్రీ ఫైనల్‌లో ఉన్న విద్యార్థులు సీయూఈటీ పీజీకి దరఖాస్తు చేసుకోవచ్చు. పలు కోర్సులకు ఏదైనా డిగ్రీ సరిపోతుంది. మరికొన్ని కోర్సులకు డిగ్రీలో సంబంధిత విభాగంలో చదివి ఉండాలి.

ఆన్‌లైన్ పరీక్ష

సీయూఈటీ పీజీ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 2 గంటలు. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ భాషల్లో(లాంగ్వేజ్, సాహిత్య పేపర్లు తప్ప) ఉంటాయి. ఇందులో పార్ట్–ఎ, పార్ట్–బి అనే రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్ ఎలో –25, పార్ట్ బిలో–75 ప్రశ్నల వస్తాయి. పార్ట్–ఎలో జనరల్, పార్ట్–బిలో సంబంధిత సబ్జెక్టు ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు, ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఎంఏ/ఎమ్మెస్సీ కోర్సులకు సంబంధించి పార్ట్–ఎలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, మ్యాథమెటికల్ ఆప్టిట్యూడ్, అనలిటికల్ స్కిల్స్‌లో ప్రశ్నలు వస్తాయి. సబ్జెక్టులవారీ పార్ట్ బి సిలబస్ వివరాలు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఉన్నాయి.

అందించే కోర్సులు

- **ఎంఏ:** తెలుగు, ఇంగ్లిష్, హిందీ, కన్నడ, ఉర్దూ, సంస్కృతం, బెంగాలీ, ఏన్షంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ, జాగ్రఫీ, స్టాటిస్టిక్స్, మ్యాథ్స్, హోంసైన్స్, లింగ్విస్టిక్స్, నేపాలీ, అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, మరాఠీ, పర్షియన్, రష్యన్, చైనీస్, ఫిలాసఫీ, ఆర్ట్ హిస్టరీ, పాళీ, ఎడ్యుకేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, సైకాలజీ, సోషల్ వర్క్, ఆంత్రోపాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ, ఎనర్జీ ఎకనామిక్స్, హెరిటేజ్ మేనేజ్‌మెంట్, మాస్ కమ్యూనికేషన్, మ్యూజియాలజీ.
- **ఎమ్మెస్సీ:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, సైకాలజీ, హోంసైన్స్, బయో కెమిస్ట్రీ, టెక్ జియో ఫిజిక్స్, జియాలజీ, హెల్త్ స్టాటిస్టిక్స్, అగ్రికల్చర్, డైరీ టెక్నాలజీ, మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, కంప్యూటేషనల్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఫోరెన్సిక్ సైన్స్, ఆగ్రోఫారెస్ట్రీ, సాయిల్ వాటర్ కన్జర్వేషన్, ఫుడ్ టెక్నాలజీ, ప్లాంట్ బయోటెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ.
- **ఎంఎఫ్ఏ:** పెయింటింగ్, అప్లయిడ్ ఆర్ట్స్, ప్లాస్టిక్ ఆర్ట్స్, పోటరీ అండ్ సిరామిక్స్, టెక్స్‌టైల్ డిజైన్; ఎంపీఏ: వోకల్ మ్యూజిక్, డాన్స్.
- **ఎంబీఏ:** ఫారిన్ ట్రేడ్, రిస్క్ అండ్ ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, అగ్రి బిజినెస్.
- **మాస్టర్ ఆఫ్ వొకేషన్:** రిటైల్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మెడికల్ లేబొరేటరీ అండ్ టెక్నాలజీ. ఎంఎడ్, ఎంఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఎల్ఐఎస్సీ, మాన్యుస్క్రిప్టాలజీ అండ్ పాలియోగ్రఫీ, ఎంపీఈడీ,ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంకాం, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజ్‌మెంట్ తదితర పీజీలో ఉండే అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- సీయూఈటీ పీజీలో సాధించిన స్కోరుతో ప్రవేశం పొందాలనుకుంటున్న విశ్వవిద్యాలయానికి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి.

ప్రిపరేషన్ ఇలా

పరీక్షకు సంబంధించి సిలబస్‌ను సంబంధిత సబ్జెక్టులను పరిశీలించాలి. సిలబస్‌కు అనుగుణంగా మూడేళ్ల డిగ్రీ స్థాయి పుస్తకాలకు ప్రాధాన్యమివ్వాలి. గతంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలు పీజీ ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రశ్నపత్రాలు సీయూఈటీని ఎదుర్కోవడానికి ఉపయోగపడతాయి. ప్రిపరేషన్‌లో భాగంగా వీలైనన్ని ఎక్కువ మాక్ టెస్టులను రాయాలి. దీనిద్వారా ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకోవచ్చు. అలాగే తప్పులను విశ్లేషించుకుంటూ సన్నద్ధత కొనసాగిస్తే కోరుకున్న వర్సిటీలో ప్రవేశం పొందవచ్చు.

పరీక్ష కేంద్రాలు

రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ముఖ్యమైన ప్రాంతాల్లో పరీక్ష రాసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో–24,తెలంగాణలో–11 ప్రాంతాల్లోని ప్రధాన కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు చివరి తేదీ:** ఏప్రిల్ 19,2023
- **పరీక్ష తేదీలు:** తర్వాత ప్రకటిస్తారు.
- **వెబ్‌సైట్:** https://cuet.nta.nic.in

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943